www.jagritiweekly.com
సంపుటి : 74 సంచిక : 45 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ భాద్రపద శుద్ధ దశమి
05-11 సెప్టెంబర్ 2022
వెల : ₹15/-




# చట్టానికి అతీతులు

రాజ్యాంగాలు, మానవహక్కులు, వాస్తవాలు ఇలాంటి వాటితో నిమిత్తం లేకుండానే
విమర్శ వినిపిస్తే తల, మొండెం వేరు చేస్తామంటూ మతోన్మాదులు బయలుదేరుతున్నారు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

74 సంవత్సరాల జాగృతి 1948 -2021)
జాగృతి
జాతీయ తెలుగు వారపత్రిక




ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వ్యాసాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

ఇంకా... శుభకార్యాలకు వెళ్లినప్పుడు వస్తువో,
ధనమో ఇస్తుంటాం.. దానికి బదులుగా
జాగృతి వార్షిక చందాను కానుకగా ఇద్దాం..

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను
మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

**Jagriti Bank A/c details :**
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com



వాకాటి పాండురంగారావు స్మారక

# కథల పోటీ

జాగృతి వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచిక కోసం సుప్రసిద్ధ కథా రచయిత స్వర్గీయ వాకాటి పాండురంగారావు స్మారక 'కథల పోటీ - 2022' నిర్వహిస్తున్నాం. రచయితలకు ఆహ్వానం..

**ప్రథమ బహుమతి : రూ. 12000/-**
**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**
**తృతీయ బహుమతి : రూ. 5000/-**

1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతి, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు జాగృతి పారితోషికం ఉంటాయి.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 3 కథలకు మించి పంపరాదు.
4. కథ తన స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. దీపావళి సంచిక నుంచి ఆరంభించి, వరుసగా ఈ కథలను ప్రచురిస్తాం.
6. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. చేతి రాత అందంగా, న్యాయనిర్ణేతలకు అర్థమయ్యేలా ఉంటే స్కాన్ చేసి పంపినా పరవాలేదు. కొట్టివేతలు ఉన్నా, సరిగా స్కాన్ చేయకున్నా పోటీకి తీసుకోలేం.
7. కథను పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
8. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. సంపాదకునిదే అంతిమ నిర్ణయం.



**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 21 సెప్టెంబర్, 2022**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత

**యో**గా అంటే మతం కాదు, విజ్ఞానశాస్త్రం. మనిషిని సదా ఆరోగ్యంతో, నవనవోన్మేషంగా ఉంచే శాస్త్రం. శరీరం, ఆత్మ, మేధల నడుమ సామరస్యాన్ని వికసింపచేసే విజ్ఞానశాస్త్రం. ఇది యోగాచార్యులు తరుచు చెప్పే మాట. ఆగస్ట్ 27న హైదరాబాద్‌ను సందర్శించిన ప్రఖ్యాత యోగా గురువు స్వామి శివానంద ఈ మాటలకు సజీవ చిత్రమనిపిస్తుంది. ఆయన వయసు 126 సంవత్సరాలు. ఆయన చాలా విషయాలు చెప్పారు. ఒకటి మాత్రం భారతీయులు తప్పక గమనించవలసి ఉంటుంది. యోగ విద్య పుట్టింది భారతదేశంలోనే. కానీ ఆ అద్భుత విద్య అభ్యసన మాత్రం విదేశాలలోనే ఎక్కువట. నిజానికి ఈ మాటతో మనం కళ్లు తెరుచుకోవాలి. వారి వయసును బట్టే కాదు, నాలుగు దశాబ్దాలుగా ఆరు ఖండాలలో పర్యటించిన అనుభవంతో చెబుతున్న మాటలు కాబట్టి వాటిని ఔదలదాల్చడం కర్తవ్యంగా భావించాలి.

ఎవరీ స్వామి శివానంద? ఈ ఏడాది పద్మ పురస్కారాల కార్యక్రమాన్ని టీవీ తెరల మీద వీక్షించిన వారి మనో ఫలకాల మీద అత్యంత నిరాడంబరమైన ఆయన రూపం ఎప్పటికీ చెదిరిపోదు. ప్రధానికీ, రాష్ట్రపతికీ కూడా సాష్టాంగ నమస్కారం చేసి వెళ్లి పురస్కారం అందుకున్న వయో వృద్ధుడు ఆయనే. ఎందుకీ సాష్టాంగ దండ ప్రమాణం? దేశ పాలకులకు ఇచ్చే గౌరవమని ఆయనే వివరించుకున్నారు. ఆ శివానంద భాగ్యనగర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఒక యోగా కార్యక్రమంలో కొన్ని ఆసనాలు వేసి చూపించారు. యోగా ప్రయోజనం ఏమిటో ఎలాంటి భేషజాలు లేకుండా చెప్పారు.

ఉచ్ఛ్వాస నిశ్వాస సంగీతంతో శరీరంలోని ప్రతి కణం నర్తించడమే యోగ. అదే ఆంతరంగిక ప్రశాంతతనీ, సామరస్యాన్నీ అందిస్తుందని చెబుతారు యోగాచార్యులు. ఇవాళ్టి సంక్లిష్ట జీవితంలో మానవుడు అన్వేషిస్తున్నదే ప్రశాంతత కోసం. పరీక్షల సమయంలో విద్యార్థుల బలవన్మరణాలు, ఉద్యోగ జీవితంలోని ఒడుదుడుకులతో వచ్చే మానసిక వ్యాధులు, పచ్చటి కాపురంలో చెలరేగే చిచ్చు అన్నీ కూడా ప్రశాంతత


శాలివాహన 1944 శ్రీ శుభకృత్ భాద్రపద శుద్ధ దశమి

**లోపలి పేజీలలో...**




ముఖపత్ర కథనం
**చట్టానికి అతీతులు**

జాతీయం
**ఆప్ 'హైడ్రామా!'**







ధారావాహిక నవల
**ఆనంద మఠం**
– బంకించంద్ర చటర్జీ

# జాగృతి

## సంపాదకీయం

కోల్పోయిన ఫలితమే. కానీ ప్రశాంతత ఎక్కడో దొరికేది కాదు. ఒత్తిడి, ఆందోళన, సంఘర్షణ మనలోనివే. చిత్రంగా ప్రశాంతత కూడా మన మనసు నుంచే జనిస్తుంది. నగర జీవితం మనిషి ఆత్మను ఛిద్రం చేస్తున్న మాట కాదనలేం. తెలిసో తెలియకో మనం చోటిచ్చిన అలవాట్లే ఇందుకు ఎక్కువ కారణం. ప్రధానంగా ఆహారపు అలవాట్లు. తరువాత నిద్ర. ఈ రెండింటి మధ్య సమన్వయం అన్ని వృత్తుల వారికి సాధ్యం కాకపోవచ్చు. ఎన్ని సంకెళ్లు ఉన్నా అందులోను కొంత స్వేచ్ఛ ఉంటుంది. ఆ స్వేచ్ఛను కూడా ఉపయోగించుకోకుండా


# యోగజ్ఞానం

ఉండిపోవడమే అసలు సమస్య. ఇంత హడావిడి జీవితంలోను ఆరుగంటలు లేదా ఎనిమిది గంటలు నిద్రకు సమయం లేదనడం మూర్ఖత్వం. అందుకు వేరే కారణాలు ఉంటాయి. అన్ని అవకాశాలు ఉన్నవారు కూడా ఆహారం, నిద్రలకు సంబంధించిన, జీవితానికి అనివార్యమైన నియమాలను ఉల్లంఘిస్తున్నారు. ఏది తినాలి? ఏది తాగాలి? ఎంత సమయం నిద్ర పోవాలి? ఇవి నేటి సమాజంలో కచ్చితంగా వేసుకోవలసిన ప్రశ్నలు. తర్కించుకోవలసిన అంశాలు కూడా. జీవితం సుఖమయం కావడం, లేదా బాధామయం కావడం– ఆ ప్రశ్నలకు మనం చెప్పుకునే సమాధానాలను బట్టి ఉంటుంది. మితాహారమే తన జీవిత రహస్యమని శివానంద చెబుతున్నారు. నూనె, ఉప్పు పరిహరించానని చెప్పారు. నిజానికి దేశంలో ప్రజల ఉప్పు వినియోగం మోతాదుకు మించే ఉందన్న వాదన లేకపోలేదు. ఆరుగంటల నిద్ర, నడక, యోగాసనాలు తన ఆరో ఏట నుంచి ఆరంభించానని చెప్పారు శివానంద. వీటితో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాననీ, ఔషధాల జోలికి వెళ్లవలసిన అవసరం కూడా రాలేదనీ చెబుతున్నారు. కాబట్టి ఈ మాట గురించి ఆలోచించవలసిందే కదా!

యోగాభ్యాసం ఒక అంశాన్ని చూసే దృష్టిని మార్చడమే కాదు, ఆ అంశాన్ని పరిశీలిస్తున్నవారిలో పరివర్తన కూడా తెస్తుంది అంటారు, ప్రఖ్యాత యోగ బోధకులు బీకేఎస్ అయ్యంగార్. శివానంద పండ్లు తీసుకోనని చెప్పారు. అది కూడా ఆరోగ్య రహస్యమనీ, లేదా యోగాలో భాగమని ఆయన చెప్పడం లేదు. ఈ దేశంలో చాలామంది పేదలకు ఇప్పటికీ పండ్లు తీసుకునే అవకాశం దక్కలేదు కాబట్టి తాను వాటిని దూరంగా పెట్టానని ఆయనే వివరణ ఇచ్చారు. ఈ దేశంలో ఒంటి నిండా గుడ్డ కప్పుకునే భాగ్యం లేని పేదలే ఎక్కువ కాబట్టి తాను జానెడు వస్త్రాలనే ధరిస్తానని మహాత్ముడు చెప్పడం ఇక్కడ గుర్తుకు వస్తుంది. నిజంగానే శివానంద దృష్టిలోని పరివర్తన స్వాగతించదగినది. అయితే పేదలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రయత్నం మాత్రం జరగాలి. పరిస్థితులను మార్చాలి.

యోగాభ్యాసంలో శరీరంలోని ప్రతి కణం ఆత్మగీతాన్ని పాడుతుంది. అంటే శరీరానికీ, ఆత్మకూ మధ్య బంధాన్ని ఏర్పరుస్తుంది. అదే కొత్త దృష్టిని ఇస్తుంది. మానవీయతకు సంబంధించి యోగా ఇచ్చే దృష్టిని కనీసంగా గౌరవించాలి. అంటే మనుషులుగా మన బాధ్యతను అది గుర్తు చేస్తే, దానిని మరచిపోరాదు. వ్యాయామం శరీరాన్ని బలపరిస్తే, యోగా మేధస్సును, ఆత్మను ఆరోగ్యవంతం చేస్తుంది. వ్యాయామం వచనం వంటిది. యోగా కదలికలు చెప్పే కవిత్వం వంటిది అంటారు. శివానంద చెప్పినవన్నీ పాటించి, 126 ఏళ్లు బతకాలని, బతికేయవచ్చని చెప్పడం ఇక్కడ ఉద్దేశం కాదు. శివానంద జీవితకాలంలో సగమే జీవించామని అనుకున్నా, అది పరిపూర్ణ ఆరోగ్యంతో జీవించడానికి యోగ ఉపయోగపడుతుందని నమ్మవచ్చు. వీటన్నిటితో పాటు శివానంద చెప్పిన 'నేను తక్కువ మాట్లాడతాను' అన్నమాటను శిరోధార్యంగా భావించాలి. కానీ అది సాధ్యమేనంటారా? ★

05 సెప్టెంబర్ 2022, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



ప్రత్యేక వ్యాసం
**ప్రమాద అరి.. ప్రమోద హరి 'అనంత'**
24లో



ముఖాముఖి
**'ఆయన అన్న మాటలు నన్ను ఎంతో ఎత్తుకు తీసుకు వెళ్లాయి!'**
35లో



కథ
**కాటు**
– నాగేంద్రకుమార్ వేపూరి
32లో



ప్రత్యేక వ్యాసం
**పోషకాహార లోపాన్ని అధిగమిద్దాం!**
40లో


| | | |
|---|---|---|
| శిక్షణతో ఆత్మరక్షణ (మహిళ) | - | 14 |
| వినాయకుడి మీద ఆంక్షలా? (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ఆధ్యాత్మికం | - | 18 |
| సంతృప్తి సందేశం 'వామన'త్వం (ప్రత్యేక వ్యాసం) | - | 23 |
| ఢాకాలోను డ్రాగన్ వీరంగం (అంతర్జాతీయం) | - | 26 |
| కాంగ్రెస్‌లో మిగిలేదెవ్వరు? (చర్చ) | - | 28 |
| అక్షరాస్యత ప్రగతికి ఆధారం (సాహిత్యం) | - | 30 |
| తురుష్కుల పాపం, శతకకవి శాపం (నిందా స్తుతి) | - | 38 |
| గురువును మించిన శిష్యుడు (క్రీడ) | - | 43 |
| వార్తా విశేషాలు | - | 44 |
| బాలజాగృతి | - | 46 |
| వారఫలాలు | - | 48 |
| పదరసం | - | 49 |
| గర్జించని, గాండ్రించని 'లైగర్' (సినిమా) | - | 50 |




# చట్టానికి అతీతం

**ఈ ప్రశ్న ఇప్పుడు ఒకరిద్దరు రచయితల పెదవుల నుంచి ఉరికి వచ్చి ఉండవచ్చు. కానీ అది ప్రపంచంలో చాలామంది మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. విమర్శకు అతీతమని కొన్ని వ్యవస్థల విషయంలో ప్రపంచం ఎందుకు భావించాలి? అలాగే ఇస్లాం విమర్శకు అతీతమైనదంటూ ఆ వర్గంలో కొందరు మాత్రమే చేస్తున్న పిడివాదాన్ని యావత్తు మానవాళి ఎందుకు మౌనంగా వింటూ ఉండిపోవాలి? ఈ ప్రశ్న ఎందుకు అంటే, 'గుస్తాకే రసూల్ కా ఎక్ హి సాజా... సర్ తన్ సే జుదా' (ప్రవక్తను అవమానించినందుకు ఒకటే శిక్ష– తల, మొండెం వేరు చేయడం) అన్న రక్తదాహంతో కూడిన ఒక నినాదం ఇటీవల ప్రపంచమంతటా వినిపిస్తూ ఉండడం వల్లనే. ఈ నినాదం, ఈ ధోరణి ఇస్లాంకు వ్యతిరేకమని కొందరు ముస్లిం పండితులే చెబుతున్నా రోజురోజుకూ అది గొంతు పెంచుకోవడమే కలతపెట్టే విషయం. ఇస్లాంనూ, ప్రవక్తనే కాదు, ఆ మత వర్గీయులు చేస్తున్న అకృత్యాలను విమర్శించినా, వాటిని కూడా మతంతో ముడిపెడుతూ అదే నినాదం ఇవ్వడం ఇప్పుడొక వాస్తవం. రాజ్యాంగాలు, మానవహక్కులు, వాస్తవాలు ఇలాంటి**

స్టాండప్ కమేడియన్ మునావర్ ఫారూకిని తెరాస నాయకుడు, తెలంగాణ ఐటీ మంత్రి తీసుకువచ్చి హైదరాబాద్‌లో ప్రదర్శనకు అవకాశం ఇవ్వడం దగ్గరే ఈ వివాదం రాజుకోవడం మొదలయిందని కాస్త ఆలస్యంగా ఇప్పుడు మొత్తం మీడియా ఘోషిస్తున్నది. దేశంలోని సగం రాష్ట్రాలలో ఈ కమేడియన్‌కి ప్రవేశం లేదు. అయినా పట్టుపట్టి ఇప్పుడు ఎందుకు తీసుకురావాలి? తెరాస నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత మీద వచ్చిన లిక్కర్ స్కాంలో ప్రమేయం ఉందనే ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ఇదంతా చేయించారన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఇక మజ్లిస్ నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ అల్లర్లకు ఎక్కువ బాధ్యత వహించవలసి ఉంటుందని కూడా విమర్శలు వచ్చాయి. సర్ తన్ సే జుదా వంటి నినాదాలు రాజ్యాంగ విరుద్ధమంటూనే, తరువాత ఆ నినాదాలు చేసిన 90 మందిని పోలీసు స్టేషన్ నుంచి విడిపించి ఆయన మీద ఉన్న అనుమానాలను రూఢి చేసుకునే అవకాశం ఆయనే ఇచ్చారు. ఆ 90 మందిని తాను విడుదల చేయించినట్టు స్వయంగా ఆయన అంగీకరించడం కొసమెరుపు. అలాగే ఈ మొత్తం వ్యవహారంలో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పాత్ర ఎంత అన్నది కూడా ఒక ప్రశ్నగా మారింది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలలో తెరాస విజయం కోసం పీకే ఎంతటి చౌకబారు ఎత్తుగడ వేయడానికైనా సిద్ధంగానే ఉంటారన్నది నిజం.

### వీడియో వివాదం

హైదరాబాద్‌లోని గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గం బీజేపీ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ లోధీ మహమ్మద్ ప్రవక్త మీద చేసినట్టు చెబుతున్న వ్యాఖ్యల నేపథ్యంలో ఆగస్ట్ 23న ఉదయం ఆయనను అరెస్టు చేశారు. అంతకు ముందు రోజు ఆయన ఒక వీడియోను విడుదల చేయడం, అది ఇస్లాంను, ప్రవక్తను కించపరిచే విధంగా ఉన్నదంటూ పాతబస్తీ ముస్లిం మతోన్మాదులు అల్లర్లు ప్రారంభించడం తెలిసిందే. విధివిధానాలు సరిగా లేవన్న కారణంగా కోర్టు రాజాసింగ్‌కు వెంటనే బెయిల్ ఇచ్చినా, మళ్లీ 25న ఆయనను అరెస్టు చేశారు. ఆయన మీద కేసు పెట్టాలంటూ ముస్లింలు భారీ ఎత్తున పోలీసు స్టేషన్ల దగ్గర నిరసనలు మొదలు పెట్టారు. కొంతమంది అతివాద ముస్లింలు 'గుస్తాకే రసూల్ కా ఎక్ హి సాజా... సర్ తన్ సే జుదా' (ప్రవక్తను అవమానించినందుకు ఒకటే శిక్ష– తల మొండెం వేరు చేయడం) అంటూ హైదరాబాద్ పాత బస్తీలో విధ్వంసక ఘటనలకు దిగారు. అల్లర్లు పెచ్చరిల్లడానికి మజ్లిస్ కార్పొరేటర్లు శక్తివంచన లేకుండా తమ వంతు పాత్ర నిర్వహించారు. ఇవన్నీ మీడియాలో వార్తలుగా వచ్చాయి. జాతీయ మీడియా ఈ అంశం మీద తీవ్రంగానే స్పందించింది. తనను చంపేస్తామంటూ 4000 ఫోన్ కాల్స్ వచ్చాయని రాజాసింగ్ చెప్పినట్టు హిందుస్తాన్ టైమ్స్ వెల్లడించింది.

23వ తేదీన, మళ్లీ 25న రాజాసింగ్‌ను అరెస్టు చేశారు. రెండోసారి అరెస్టు చేయడం ఎందుకంటే, అది ఫిబ్రవరిలో ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నపుడు ఆయన ఓటర్లను బెదిరించారన్న ఆరోపణకు సంబంధించినది. కేసు మాత్రం హైదరాబాద్‌లోని మంగళ్‌హాట్ స్టేషన్‌లో నమోదయింది. ఏప్రిల్‌లో షాహీనయతాగంజ్‌లో మరొక కేసు నమోదయింది. అప్పుడు జరిగిన శోభాయాత్రలో రెచ్చగొట్టే విధంగా రాజాసింగ్ ఉపన్యసించారన్న ఆరోపణకు సంబంధించిన కేసు ఇది. ఆ రెండు కేసులతోనే ఇప్పుడు అరెస్టు చేశారు. ఆయనను చర్లపల్లి జైలులో జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసిన ఉగ్రవాదులు ఉన్న ప్రాంతంలోనే ఉంచారన్న వార్త ఆయన అభిమానులను కలవరపరిచేదే. ఇదంతా చూస్తే రాజాసింగ్‌ను ఏదో విధంగా నిర్బంధంలో ఉంచాలన్న తెరాస ప్రభుత్వ తపన




# తులు

> వాటితో నిమిత్తం లేకుండానే విమర్శ వినిపిస్తే తల, మొండెం వేరు చేస్తామంటూ బయలుదేరుతున్నారు. ఆగస్ట్ 22 రాత్రి నుంచి హైదరాబాద్ పాతబస్తీ ఇదే నినాదంతో నాలుగైదు రోజుల పాటు దద్దరిల్లింది. ఇతర మతాల మీద, ముఖ్యంగా హిందూధర్మం మీద ముస్లిం మతోన్మాదులు యుద్ధానికి కాలు దువ్వడానికి ఎంచుకున్న నినాదమే సర్ తన్ సే జుదా అని అనుమానించక తప్పదని పరిణామాలే తరుచూ జరుగుతున్నాయి.

స్పష్టంగా కనిపిస్తుంది. పైగా ఆయనపై పీడీ యాక్ట్‌ను ప్రయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని మీద రాజాసింగ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

రాజాసింగ్ వీడియో విడుదలైన తరువాత పాతబస్తీలో అల్లర్లు చెలరేగాయి. హిందువుల మనోభావాలను గాయపరచడమే ధ్యేయంగా ప్రదర్శనలు ఇస్తున్న స్టాండప్ కమేడియన్ మునావర్ ఫారూకిని కావాలని తీసుకువచ్చినందుకు నిరసనగా తాను ఈ వ్యాఖ్యలు చేశానని తాను ఏ మత విశ్వాసాలను గాయపరచలేదని, ఎలాంటి దైవదూషణకు పాల్పడలేదని ఆయన చెప్పారు. తన ఎనిమిదేళ్ల పాలనలో ఒక్క మత ఘర్షణ కూడా చోటు చేసుకోలేదని ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక బహిరంగ సభలో ఈ గొడవల నేపథ్యంలో చెప్పడం ప్రజలను వంచించడమే. తనను తాను వంచించుకోవడం కూడా. రెండేళ్ల క్రితం భైంసాలో జరిగిన అల్లర్లు, అందులో హిందువులు ప్రాణాలరచేతపట్టుకుని వెళ్లిన ఉదంతం ఆయనకు గుర్తు లేకపోవడం హాస్యాస్పదంగా ఉంది.

## పౌరహక్కుల నేత నోటా అదే నినాదం

జాతీయ టీవీ చానళ్లలో చర్చలు చూసేవారికి ఇప్పటికే ఒక విషయం అర్థమై ఉంటుంది. అందులో ముస్లింల తరఫున వాదించే వారంతా వాస్తవం కంటే, తమ వర్గాన్ని అడ్డగోలుగా సమర్థించడానికే శతథా ప్రయత్నిస్తారు. వారు మొదట ముస్లింగాను, ఆ తరువాత పౌరహక్కులవాదిగాను కనపడేందుకు ప్రయత్నిస్తారు. మేధావి ముద్రో, ఉదారవాది అన్న భుజకీర్తో తమకు అవసరం లేదన్న పంథాలోనే మాట్లాడతారు. అది కూడా ముస్లింల పౌరహక్కుల రక్షకులుగానే. హైదరాబాద్‌లో ఇదే జరిగింది. రాజాసింగ్ దిష్టిబొమ్మలు తగలబెడుతూ, సర్ తన్ సే జుదా నినాదాలు చేశారు ముస్లింలు. ఇలాంటి నినాదాలు ఇవ్వడానికి ఎవరు ప్రేరేపించారో పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇక్కడ ఆ నినాదం ఇచ్చినవాళ్లలో ఒకడు సయ్యద్ అబ్దాహు కషఫ్. ఊరేగింపులను ప్రేరేపించినవాడు కూడా ఇతడేనని కొందరు నివేదించారు. సౌత్‌జోన్ డీసీపీ కార్యాలయం దగ్గర ఆందోళనకు ఇతడే నాయకుడు. ఒక్కమాట చెబితే చాలు కషఫ్ ఏమిటో తెలిసి పోతుంది. అతడు జేఎన్‌యూలో చదివాడు. 2012-2019 మధ్య ఎంఐఎం సామాజిక మాధ్యమాల వ్యవస్థకు అధిపతిగా పనిచేశాడు. ఇతడు పౌరహక్కుల కార్యకర్తనని చెప్పుకుంటాడట. అలాగే సామాజిక మాధ్యమాల్ని ప్రభావితం చేసేవానిగా తనకు తాను ప్రకటించుకున్నాడట. ఈ పౌర హక్కుల కార్యకర్త అచ్చంగా ఒక ముస్లిం మతోన్మాది అవతారం ఎత్తాడు. తన నినాదానికి భాష్యం కూడా వెలగబెట్టాడు. ప్రవక్తకు వ్యతిరేకంగా ఎవరు అవమానకరమైన భాషలో మాట్లాడినా వారికి శిక్ష శిరచ్ఛేదనమేనని నా భావన అన్నాడు. ఆగస్ట్ 23న రాజాసింగ్ అరెస్టు కాగానే ఇతడు ఇస్లామిస్టులందరికీ అభినందనలు తెలియచేస్తూ ఒక సందేశం అందించాడు. 'మనం దీనిని జాతీయ వివాదం చేయాలని అనుకున్నాం, అదే జరిగింది' అని కూడా పేర్కొన్నాడు. కషఫ్ ఘనకార్యాలన్నీ బయటపడి, పెద్ద ఎత్తున రగడ జరిగాక ఇక తప్పక అరెస్టు చేశారు. వెంటనే బెయిల్ కూడా ఇచ్చారు. ఈ విషయంలో ఎంఐఎం నేతల నుంచి ఇంతకు మించిన ప్రవర్తనను, జవాబుదారీ తనాన్ని ఎలాగూ ఆశించలేం. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం నేతలు కూడా మజ్లిస్ నాయకుల బాటలోనే, అదే భాషతో రోడ్డెక్కారు. ఇద్దరూ ఒకే తీరులో స్పందించడమే విశేషం. కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్ ఖాన్ కూడా రెచ్చిపోయి, 'రాజాసింగ్ క్షమాపణ చెప్పాలి. లేకపోతే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలని, ఆయన ఎక్కడ కనపడితే అక్కడ దాడి చేయాలని హైదరాబాద్ ముస్లింకు పిలుపునిస్తాన'ని ఒక వీడియో ద్వారా ముఖ్యమంత్రిని హెచ్చరించాడు. పిల్లలు, స్త్రీలు కూడా రాళ్లు విసురుతూ, అదే నినాదం ఇస్తూ ఊరేగారు. మరునాడు కూడా కొందరు ఎంఐఎం నాయకులు, ఇంకొందరు ముస్లింలు సిటీ కాలేజీ ఎదురుగా అవే నినాదాలు చేశారు. వాళ్లని కూడా పోలీసులు


నుపూర్


రాజాసింగ్




అదుపులోకి తీసుకున్నారు.

**బీజేపీయే లక్ష్యం**

ప్రవక్త పట్ల అపచారానికి పాల్పడ్డారంటూ ఈ సంవత్సరం జూన్‌లో ఇదే తరహాలో బీజేపీ జాతీయ మాజీ అధికార ప్రతినిధి నుపూర్‌శర్మ కోసం సర్ తన్ సే జుదా నినాదం ఇచ్చారు. కొందరు అతివాద ముస్లింలు ఆమెను హత్య చేసి వస్తే కోటి రూపాయలు నజరానా ప్రకటించారు. ఈ మేరకు ఫత్వా కూడా జారీ అయింది. పలు రాష్ట్రాలలో ఆమె దిష్టి బొమ్మను దహనం చేశారు. ఆమెకు అనుకూలంగా వచ్చిన మద్దతు తక్కువేమీ కాదు. కానీ ఆ క్రమంలో రాజస్తాన్‌లో కన్హయ్యలాల్, మహారాష్ట్రలో ఉమేశ్ కొల్హే అనే ఇద్దరి హత్యలు జరిగాయి. ఇది అంతర్జాతీయ ముస్లిం సమాజ సమస్యగా కూడా మార్చేశారు. కొన్ని దేశాలు భారతీయ ఉత్పత్తులను బహిష్కరించనున్నట్టు ప్రకటనలు కూడా చేసేశాయి. నుపూర్‌ను చంపడానికి రష్యా నుంచి బయలుదేరిన ఒక ఐసిస్ ఉగ్రవాదిని అక్కడే నిలువరించారు. అదే ధ్యేయంతో పాకిస్తాన్‌కు చెందిన తెహ్రీక్ ఇ లబైక్ అనే ఉగ్రవాద సంస్థకు చెందిన రిజ్వాన్ అష్రఫ్ అనే ఉగ్రవాది ఈ జూలైలో వచ్చాడు. ఇతడిని రాజస్తాన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇంతకీ నుపూర్ చేసిన వ్యాఖ్యలు కొత్తవేమీ కాదు. పీకల్లోతు వివాదాల్లో మునిగినా కూడా నేటికీ ముస్లిం ఉగ్రవాదాన్ని ప్రపంచమంతటా విస్తరింపచేయడానికి పాటు పడుతున్న జకీర్ నాయక్ వంటివారు స్వయంగా వివరించినవే. అవి ముస్లింలకు తెలిసినవే. అయినా ఇప్పుడు ఈ విధ్వంసక ధోరణి ఎందుకు? ఇక్కడ నుపూర్ లేదా రాజాసింగ్, వారి వ్యాఖ్యలు కేవలం సాకు. అసలు లక్ష్యం బీజేపీ. పెరుగుతున్న జాతీయవాదం. హిందువులలో వస్తున్న చైతన్యం. రాజాసింగ్ వ్యాఖ్యల నేపథ్యంలో జరిగిన అల్లర్లలోనే కలీముద్దీన్ అనే వ్యక్తి అరెస్టు ఇందుకు సరైన రుజువు. ఆగస్ట్ 24న కలీముద్దీన్‌ను అరెస్టు చేశారు. ఇతడు ఆర్‌ఎస్‌ఎస్ వారిని ముక్కలు ముక్కలుగా నరికి చంపమని నినాదాలు చేశాడు. స్మలాన్ రష్దీ మీద దాడికి కూడా ఆ నినాదమే కారణం. 1989లో ఇరాన్ అధినేత అయితుల్లా ఖొమైని జారీ చేసిన ఆ ఫత్వాను 30 ఏళ్ల తరువాత హదీ మతర్ షియా ముస్లిం అమెరికాలో అమలు చేశాడు.


సయ్యద్ అబ్దాహు కషఫ్


ఫిరోజ్ ఖాన్


సల్మాన్ తసీర్

**జన్మనిచ్చినది పాకిస్తాన్**

ఈ నినాదం పాకిస్తాన్‌లో 2011లోనే పుట్టింది. అక్కడి తెహ్రీక్ ఇ లబైక్ అనే ఉగ్రవాద సంస్థ కఠినంగా అమలు చేస్తోంది. అందులో ప్రాణాలు విడిచిన వాళ్లని ఘాజీ (ముస్లిం యోధుడు)గా భావించి దర్గాలు నిర్మిస్తారు. 2011లో పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్ గవర్నర్ సల్మాన్ తసీర్ అక్కడి దైవదూషణ చట్టాలను వ్యతిరేకించినందుకు భద్రతా అధికారి ముంతాజ్ ఖాద్రి చంపేశాడు. తరువాత ఐదేళ్ల క్రితం భారత్‌లో వినిపించింది. కమలేశ్ తివారీ (లక్నో)ని దైవదూషణ పేరుతో ఇస్లామిస్టులు చంపేశారు.

**వేగంగా విస్తరిస్తున్న వాదం**

సర్ తన్ సే జుదా వాదం భారత్‌లో వేగంగా విస్తరించడానికి ప్రధాన కారణం పోలీసులు చూసీ చూడనట్టు ఉండిపోవడమేనన్న వాదన ఉంది. ఇందుకు కుహనా సెక్యులరిస్టు పార్టీలు కూడా కారణమే. ఈ రెండు కారణాలు ఈ వాదం ఇంకాస్త పెచ్చరిల్లడానికే దోహదం చేయవచ్చు. ఇది ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ పౌరులందరికీ ఒకే చట్టం అమలు జరగాలి. మతాలకు సంబంధించిన స్మృతులు అమలు చేస్తామనడం సరికాదు. వాటికి తావు లేదు. వాటికి చోటు కల్పించడం, కల్పించాలని కోరడం, లేదా రుద్దడం ఘోర తప్పిదం. తమ మత చట్టాన్ని అమలు చేయాలంటూ మైనారిటీలు ప్రజాస్వామ్య దేశంలో వీరంగం వేయడం ఏమిటి?

అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు.

'సర్ తన్ సే జుదా'... ప్రస్తుతం ఈ నినాదం హైదరాబాద్, జమ్ముకశ్మీర్, వారణాసి, కాన్పూర్, రాంచీ, కోల్‌కతా వరకు యథేచ్ఛగా వినిపిస్తూనే ఉంది. ఎక్కడ ఏ స్థాయిలో ముస్లింలు సమావేశమైనా కావచ్చు, చిన్నదో పెద్దదో ఊరేగింపు జరిపినా అందులో ఈ నినాదంతో ముస్లింలు గొంతు చించుకుంటున్నారు. అంతేకాదు, ఆ నినాదంతోనే రాళ్లు కూడా విసురుతున్నారు. కారణం ఏమిటి? హిందువులు, రాజకీయ నాయకులు, పార్టీలు, ప్రధాన స్రవంతి మీడియా, భద్రతా దళాలు, ప్రముఖ వ్యక్తులు ఈ నినాదం పట్ల మౌనం పాటించడమేనని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పుడు ఈ నినాదం భారతదేశంలో సర్వసాధారణంగా వినిపిస్తున్నదని అంతా ఒప్పుకుంటున్నారు. ఒక ప్రజాస్వామిక దేశంలో ముస్లింలు ఎప్పుడో, అదైనా పాక్షికంగా పాటించిన ఈ శిక్షకు ప్రాణప్రతిష్ట చేయడమంటే షరియాను రుద్దడానికేనని కూడా కొందరు ప్రముఖులు నిర్ద్వంద్వంగా చెబుతున్నారు. కొందరు ముస్లింలలో పెరిగిపోతున్న అతివాద పోకడలను, వాటి వెనుక ఉన్న మత కారణాలను విశ్లేషించే, విమర్శించే ప్రయత్నం చేసేవారు ఎవరైనా దైవ దూషణ ముద్రకు సిద్ధంగా ఉండవలసి వస్తున్నది. మీడియాలో పెద్దగా స్థానానికి నోచుకోని జూన్ 10, 2022 నాటి ఘటనలను తలుచుకుంటే ఇంకాస్త ఆందోళన తప్పదు. ఆ రోజు శుక్రవారం. ప్రార్థనలు పూర్తయిన తరువాత దేశంలోని పలు చోట్ల మసీదుల నుంచి ముస్లింలు బయటకు వచ్చి దాడులకు దిగారు. పోలీసుల మీదకి రాళ్లు విసిరారు. త్రివర్ణ పతాకంలో అశోకచక్రం స్థానంలో కల్మా ఉంచారు. నుపూర్ శిరస్సు ఖండించాలంటూ అరిచారు. బెల్గావి (కర్ణాటక) ఫోర్ట్ రోడ్‌లో ఆమె దిష్టి బొమ్మకు ఉరి వేశారు. హిందూ ఆలయాలమీద దాడులు జరిగాయి.


ఆగస్ట్ 10న మొహర్రం సందర్భంగా కొందరు ముస్లింలు మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో జరిపిన ఒక ఊరేగింపులో అవే నినాదాలు చేశారు. అదే రోజు ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో కూడా సర్ తన్ సే జుదా, పాకిస్తాన్ జిందాబాద్ నినాదాలు వినిపించాయి. ఇక్కడ మాత్రం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.



తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని ఒక అమ్మవారి ఆలయంలో పూజారి యతి నరసింహానంద సరస్వతిని తల నరుకుతానని ఆప్ ఎమ్మెల్యే అమానుల్లా ఖాన్ బాహాటంగానే బెదిరించాడు. ఖాన్‌కు సంఘీభావంగా వేలాది మంది ముస్లింలు కాన్పూర్, బరేలీలలో ఊరేగింపు జరిపి అదే నినాదం ఇచ్చారు. నిరుడు ఏప్రిల్ 15న ఉత్తర ప్రదేశ్‌లోనే బరేలీలో ఇవే నినాదాలు వినిపించాయి.

**ఒవైసీ- నోటిలో చక్కెర, కడుపులో కత్తెర**

హైదరాబాద్ ఎంపీ, అఖిల భారత మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ నోరు విప్పితే మొదట వెలువడిదే భారత రాజ్యాంగం గురించే. తరువాత వరసగా చట్టం, సౌభ్రాత్రం, శాంతి, మత సామరస్యం, అభివృద్ధి అంటూ ఒకదానిని ఒకటి తరుముకుంటూ వెలువడతాయి. రాజ్యాంగ సూత్రాలు ఆయన మెదడంతా ఖాళీ లేకుండా పరుచుకుని ఉన్నాయని నమ్మిస్తాడు. కానీ అదంతా ఒట్టి బూటకమని రాజాసింగ్ ఉదంతంతో మరొకసారి బట్టబయలయింది. ముస్లింలకు అనుకూలంగా తీర్పు రాకుండా ఆఖరికి సుప్రీంకోర్టు మీదనైనా సరే ఈ బారిస్టర్ నిప్పులు కురిపిస్తాడు. యథా రాజా తథా ప్రజ. ఇదే రెండు నాల్కల ధోరణి ఆయన పార్టీ నేతలలో ఉంది. దానినే కార్యకర్తలు సమయం వచ్చినప్పుడు అమలు చేసి చూపుతూ ఉంటారు. తెరాస ప్రభుత్వం వీళ్ల చేతిలో కీలుబొమ్మ కాబట్టి సాగిపోతోంది. రంజాన్ నెలలో నిర్దేశించిన వేళకు దుకాణాలు మూయాలని వచ్చిన పోలీసుల మీద ఎంఐఎం నేతలు, కార్పొరేటర్లు యుద్ధానికి దిగుతారు. ట్రాఫిక్ ఇబ్బంది గురించి దర్యాప్తుకు వచ్చిన పోలీసు అధికారి మీద కార్పొరేటర్లు వీరంగం వేస్తారు. ఇప్పుడు సర్ తన్ సే జుదా నినాదంతో తాలిబన్‌ను మరిపించారు. వీరికి మజ్లిస్, కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తున్నాయి. రాజ్యాంగ వ్యతిరేకమైన ఆ నినాదం ఇచ్చిన 90 మందిని ఒవైసీ విడిపించారు. సీఏఏ ఆందోళనలలో చేతులలో త్రివర్ణ పతాకంతో ఊరేగుతూ, రాజ్యాంగాన్ని రక్షించాలంటూ గొంతు చించుకున్న ఒవైసీ ఇతడే సుమ! అదంతా నాటకమని అర్థం చేసుకుంటే చాలు. మోదీ మీద దాడికి త్రివర్ణపతాకాన్ని అడ్డు పెట్టుకున్నారు. నిజానికి ఆ మహోన్నత పతాకం మీద వారి గౌరవం ఎంతటిదో వాళ్ల చర్యలతో వాళ్లే ప్రశ్నార్థకం చేసుకుంటున్నారు. తల, మొండెం వేరు చేస్తామని అరిచిన 90 మందిని అరెస్టు చేస్తే, ఈ గౌరవ పార్లమెంటు సభ్యుడు విడిపించుకురావడాన్ని ఎలా చూడాలి? ఒవైసీ ఎంత



అసదుద్దీన్ ఒవైసీ



రషీద్ ఖాన్

తెంపరితనం ప్రదర్శించారంటే, మీడియా ఎదుట అలాంటి నినాదాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించారు. తరువాత ఆ నినాదాలు చేసిన వారిని విడిపించిన విషయాన్ని ఆయనే స్వయంగా ఒప్పుకున్నారు. అయినా మీరేం చేయగలరన్న సవాలు ఇందులో ఉంది.

**కాంగ్రెస్ ముస్లిం నేతలదీ అదే దారి!**

రాజాసింగ్ ఎక్కడ కనిపించినా దాడి చేయాలంటూ ఫిరోజ్ ఖాన్ అనే కాంగ్రెస్ నాయకుడు వీడియో విడుదల చేశాడు. ఒక జాతీయ చానల్‌లో తన వాదనను సమర్థించుకున్నాడు. మరొక కాంగ్రెస్ నాయకుడు రషీద్ ఖాన్ ఈ వ్యవహారంలో ఆగస్ట్ 22న సింగ్‌ను అరెస్టు చేయకుంటే గోషామహల్ మొత్తం దహనం చేస్తానని ముఖ్యమంత్రిని హెచ్చరిస్తూ ఒక వీడియో విడుదల చేశాడు. రాజాసింగ్‌ను బీజేపీ బహిష్కరించింది. కానీ తెరాస, మజ్లిస్ పార్టీలు వాళ్ల కార్యకర్తలు ఇంత బరితెగించి మాట్లాడినా ఎలాంటి చర్య తీసుకోలేదు.

**ఇది ఇస్లాంకు విరుద్ధం**

ప్రవక్త మహమ్మద్‌ను అగౌరవ పరిచారంటూ

> రాజాసింగ్ ఎక్కడ కనిపించినా దాడి చేయమంటూ ఫిరోజ్ ఖాన్ అనే కాంగ్రెస్ నాయకుడు వీడియో విడుదల చేశాడు. ఒక జాతీయ చానల్‌లో తన వాదనను సమర్థించుకున్నాడు. మరొక కాంగ్రెస్ నాయకుడు రషీద్ ఖాన్ ఈ వ్యవహారంలో ఆగస్ట్ 23న సింగ్‌ను అరెస్టు చేయకుంటే గోషామహల్ మొత్తం దగ్ధం చేస్తానని ముఖ్యమంత్రిని హెచ్చరిస్తూ ఒక వీడియో విడుదల చేశాడు. రాజాసింగ్‌ను బీజేపీ బహిష్కరించింది. కానీ తెరాస, మజ్లిస్ పార్టీలు వాళ్ల కార్యకర్తలు ఇంత బరితెగించి మాట్లాడినా ఎలాంటి చర్య తీసుకోలేదు.

ఈ జూలై మధ్యలో ఉదయ్‌పూర్ (రాజస్తాన్)కు చెందిన దర్జీ కన్హయలాల్‌ను ఇద్దరు ముస్లింలు హత్య చేశారు. మరొక వ్యక్తి అమెరికాలో స్మలాన్ రష్దీ మీద అదే కారణంతో హత్యా ప్రయత్నం చేశాడు. నుపూర్ శర్మ తల నరకవలసిందంటూ ఈ కారణాన్ని చూపించి ఇంకొందరు కూడా పిలుపులు ఇచ్చారు. తాజాగా అదే పిలుపు, అదే కారణంతో రాజాసింగ్ మీద ఇచ్చారు. ఇక సామాజిక మాధ్యమాలలో ఇదే పిలుపు ఇస్తున్న ముస్లిం యువత ఎంతో లెక్క లేదు.

చంపరాన్‌కు చెందిన తారిక్ అన్వర్ అడిగిన ప్రశ్నకు సక్విబ్ సలీం అనే ఒక చరిత్రకారుడు ఒక వివరణ ఇచ్చారు. ఇది ఆవాజ్ రేడియో (ఆగస్ట్ 27) ప్రసారం చేసింది. ఆయన మాటలలోనే– ‘నా పరిశోధనలో తేలినది ఏమిటంటే, ఇలాంటి పిలుపు 19వ శతాబ్దానికి ముందు లేనేలేదు. ప్రవక్తను అవమానించినంత మాత్రాన ఇతర మతాల వారిని చంపడం సరికాదని ఇమామ్ అబూ హనీఫ్ నిర్ద్వంద్వంగా చెప్పారు. హనీఫ్ సిద్ధాంతాన్ని నమ్మేవారు ఉపఖండంలో గణనీయంగానే ఉన్నారు. అయితే 19వ శతాబ్దంలోనే హనీఫ్ ఆలోచనా విధానాన్ని సవాలు చేస్తూ కొన్ని సైద్ధాంతిక వివాదాలు చెలరేగాయి. అందులో దేవబంది, బరేల్వీ కూడా ఉన్నాయి. అహి ఇ హదిత్ అయితే హనీఫ్ భారతీయ సంస్కృతితో అసలు ఇస్లాంను వక్రీకరిస్తున్నారని ఆరోపించారు. అహ్మదీయా వర్గం హనీఫ్ ఇస్లాం మార్గం నుంచి తప్పారని కూడా ఆరోపించింది. ఒకరు ప్రవక్తను గౌరవప్రదం కాని భాషలో వ్యాఖ్యానించారంటే, వాళ్లు ఇస్లాంను ఆచరించడం లేదని మరొక పద్ధతిలో చెప్పడమే, అలాంటి వాళ్లను మనం ప్రవక్తను గౌరవించమని చెప్పలేమని కూడా హనీఫ్ అభిప్రాయపడ్డారు.

1920లో రంగీలా రసూల్ పేరుతో రాజ్‌పాల్ అనే ప్రచురణకర్త ఒక కరపత్రాన్ని అచ్చు వేయించాడు. అది ముస్లింలలో అసంతృప్తిని రేపింది. దీనిని ఆసరా చేసుకుని కదియానా అహ్మదీయాలు ఆ ప్రచురణకర్తకు వ్యతిరేకంగా ముస్లింలను ఏకం చేయడం మొదలుపెట్టారు. దేవబంది, బరేల్వీ ఉలేమాలు కూడా రంగంలోకి దిగారు. చివరికి 1929లో రాజ్‌పాల్‌ను ఇలాం దిన్ అనే ముస్లిం యువకుడు హత్య చేశాడు. ముస్లింలీగ్, కదియానీలు అతడిని హీరో అంటూ కీర్తించారు. అయితే దేవబంది వర్గ పండితుడే అయినప్పటికి మౌలానా అష్రఫి అలీ తన్వీ ఇలాంటి సంప్రదాయం మంచిది కాదనే అప్పుడు అభిప్రాయపడ్డారు. ఇక ప్రవక్త గురించి అగౌరవంగా మాట్లాడితే మరణ దండన సరికాదన్న హనీఫ్ వాదనను తోసి పుచ్చడమే కాకుండా తన వాదాన్ని నెగ్గించుకునే పనిలో అహి ఇ హదిత్

## ఎందరో బాధితులు




నుపూర్ శర్మ వ్యాఖ్యల తరువాత ఆరుగురు ముస్లిం మతోన్మాదుల దౌష్ట్యానికి గురయ్యారు. ఐదేళ్ల క్రితం లక్నోలో కమలేశ్ తివారీని ఇదే కారణంతో చంపారు. మొన్న జూన్‌లోనే మహారాష్ట్రలోని అమరావతి నగరంలో మందుల దుకాణం నడిపే ఉమేశ్ కొల్హాను కత్తితో పొడిచి చంపారు. నుపూర్ వ్యాఖ్యలను సమర్థిస్తూ వేరెవరో పెట్టిన పోస్టును ఈయన బదలీ చేయడమే కొల్హా చేసిన పాపం. ఈయన వయసు 54 ఏళ్లు. బీజేపీకి చెందిన మరొక కార్యకర్తను కూడా ఇలాగే చంపారు. అదే నెలలో కన్హయాలాల్‌ను రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో చంపారు. ఈయన ఒక దర్జీ. కత్తితో పీక కోసి వెళ్లిపోతూ అదే నినాదం ఇచ్చారు దుండగులు. నిషాంక్ రాథోడ్ అయితే 20 ఏళ్ల ఇంజనీరింగ్ విద్యార్థి. ఇతడి శవం రైలు పట్టాల మీద కనిపించింది. మొదట పోలీసులు వేరే కేసుగా నమ్మించడానికి చూశారు. కానీ రాథోడ్ తండ్రికి ఉగ్రవాదులు అదే నినాదాన్ని ఫోన్‌లో మెసేజ్ చేసి, అది తమ పనేనని రూఢి చేశారు. మునీశ్ భరద్వాజ్, అంకిత్ ఝా, షాను పాండే ఇదే తరహాలో హత్యకు గురయ్యారు.

శృంగారగౌరి–జ్ఞాన్‌వాపి ఆలయం వివాదంలో ఉన్న మహిళ సోహన్‌లాల్ ఆర్య భర్తకు కూడా సర్ తన్ సే జుదా బెదిరింపులు వచ్చాయి. పైగా ఇది పాకిస్తాన్ నంబర్‌తో రావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీని మీద వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు కూడా. ఆగస్ట్ 18న ఈ వివాదం విచారణకు రావడానికి కొంచెం ముందు ఆ బెదిరింపు రావడం ఇంకా ఆశ్చర్యం. ఇందులో ప్రవక్తకు సంబంధించిన అంశమే లేదు. అయినా దైవ దూషణ విషయంలో ఉన్మాదులు చేసే ఈ బెదిరింపును ఉపయోగించడం తెంపరితనమే. నిజానికి ఇప్పుడే కాదు, మార్చి 19న, జూలై 20న కూడా ఇలాంటి కాల్స్ అదే నంబర్ నుంచి వచ్చాయని ఆమె పోలీసులకు తెలియచేశారు. ★

పడింది. అప్పుడే కనీవినీ ఎరుగుని రీతిలో భారతీయ, విదేశీ పండితులు దాదాపు 450 మంది అహి ఇ హడిత్ వాదనను సవాలు చేస్తూ తమ సంతకాలతో ఒక ఫత్వాను విడుదల చేశారు. హడిత్ ఇలాంటి విషయాన్ని ప్రస్తావించినా, అది పదే పదే దైవ దూషణకు పాల్పడినవారి గురించేనని, అది కూడా శిరచ్ఛేదనం గురించి అసలు చెప్పలేదని ఆ ఫత్వా పేర్కొన్నది. ఒక వేళ రాజకీయ కారణాలతో అలాంటి శిక్ష విధిస్తే దానిని మత కోణం నుంచి చూడరాదు.'

20వ శతాబ్దం ఆదిలోనే కాదు, 21వ శతాబ్దం ఆరంభంలో కూడా దైవ దూషణ పేరిట అవతలి మతం వారిని చంపడం తప్పేనని చెబుతున్నవారు ఇస్లాం పండితులలో ఉన్నారు. ఉదయ్‌పూర్ దర్జీ కన్హయాలాల్ హత్య (రియాజ్ అన్సారీ, గౌస్ మహమ్మద్ ఈ హత్య చేశారు) తరువాత కొన్ని ముస్లిం సంఘాలు ఆ చర్య ఇస్లాంకు వ్యతిరేకమేనని చెప్పాయి. కన్హయాలాల్ హత్య మన దేశ చట్టాల దృష్ట్యానే కాదు, ఇస్లాం చట్టాల ప్రకారం కూడా అన్యాయమేనని జమాయిత్ ఉలేమా ఎ హింద్ ప్రధాన కార్యదర్శి మౌలానా హకీముద్దీన్ కాసిం ఒక పత్రికా ప్రకటన ద్వారా చెప్పారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కూడా ఇదే చెప్పింది. అజ్మీర్ దర్గా ప్రధాన పూజారి జైనుల్ అబీదిన్ అలీ ఖాన్, 'ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. ముఖ్యంగా శాంతిని ప్రబోధించే ఇస్లాంలో అన్నీ శాంతి ఆధారిత బోధనలే ఉంటాయి' అన్నారు. హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని షియా ముస్లిం పండితుడు కాల్బే జావెద్ నక్వి వ్యాఖ్యానించారు. అసలు తనను దూషించారన్న ఆరోపణతో ప్రవక్త కూడా ఎవరినీ చంపలేదని లక్నోకు చెందిన పండితుడు సల్మాన్ నద్వి అన్నారు.



## భావితరాలనూ వదిలిపెట్టరా?

హైదరాబాద్ పాతబస్తీలో మతోన్మాదం కలకాలం కొనసాగడానికి వీలుగా బాలలను కూడా తయారు చేస్తున్నారు. రాజాసింగ్‌కు వ్యతిరేకంగా అల్లర్లు జరిగిన సమయంలో బాలల చేత కూడా సర్ తన్ సే జుదా నినాదాలు చేయించడంపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సమితి మండిపడింది. పిల్లలను రాజకీయాల కోసం వాడుకోవడం సహించరానిదని, తక్షణమే చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను బాలల హక్కుల పరిరక్షణ సమితి ఆదేశించింది. పాఠశాలలకు వెళ్లే పిల్లలను రాజకీయ అస్త్రాలుగా ఉపయోగించడం, నిరసనలకు తీసుకురావడం పట్ల సమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. రాజాసింగ్‌ను మొదటిసారి అరెస్టు చేయడం, వెంటనే బెయిల్ రావడం తెలిసిందే. ఆ తరువాతే పాతబస్తీ రెచ్చిపోయింది. నల్లజెండాలతో పర్యాటక స్థలాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ★

సర్ తన్ సే జుదా అనే నినాదం కేవలం మూర్ఖత్వం నుంచి జనించింది అని కూడా చెప్పారు.

ఇదంతా పరిశీలించిన తరువాత సర్ తన్ సే జుదా అనేది హిందూ వ్యతిరేక యుద్ధనాదంగా ముస్లిం మతోన్మాదులు తీసుకుంటున్నారని అనిపిస్తుంది. దీని వెనుక పాకిస్తాన్ ఉంది. ఉదయ్‌పూర్‌లో కన్హయాలాల్‌ను చంపిన ఇద్దరు గౌస్ మహమ్మద్, రియాజ్ ఇద్దరికీ పాకిస్తాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రసంస్థ దవాత్ ఎ ఇస్లామితో సంబంధాలు ఉన్నట్టు తేలింది. ఇస్లాం ప్రమాదంలో ఉన్నదంటూ ప్రచారం చేసి ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం, హదిత్ సూత్రాల ప్రకారం ఇస్లాంను ఛాందస మార్గంలోనే నడిచేటట్టు చేయడం ఆ సంస్థ ధ్యేయాలు.


ఇంతకీ ఆ మార్గం ఏడో శతాబ్దంలో అరేబియాలో ఆచరించినది కావడమే వింత. దీనినే ప్రపంచం నెత్తిన రుద్దాలన్నది వాళ్ల ఆశయం. ఏ విధంగా చూసినా ఇస్లాం మతోన్మాదం నేడు ప్రపంచ సమస్య. దానిని మాత్రం ఎదుర్కొనవలసిందే. వాళ్ల మతాచారాలు వాళ్లవే. కానీ అవి ప్రపంచం కూడా పాటించాలంటే ఘర్షణ తప్పదు. మైనారిటీలు చట్టాలకు అతీతులు కాదు. ప్రజాస్వామిక దేశంలోని చట్టాలు మైనారిటీల దగ్గర తలొంచాలన్నా కూడా సాధ్యం కాదు. భారతదేశంలోని సాంస్కృతిక, సామాజిక వైవిధ్యాన్ని అన్ని మతాలు వారు అంగీకరించాలి. మరీ ముఖ్యంగా చాలామంది ముస్లింలు ఈ వాస్తవం త్వరగా గ్రహించాలి.

– జాగృతి డెస్క్



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆధ్వర్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆవిర్భవించి పట్టుమని పదేళ్లు కూడా కానప్పటికి రాజకీయ క్షుద్ర విద్యల్లో మాత్రం బాగానే రాటుదేలిపోయింది. ఈ విషయంలో వందేళ్లకు పైగా చరిత్ర గల హస్తం, దశాబ్దాల చరిత్ర గల వామపక్షాలు, ఇతర ప్రాంతీయ పార్టీల కన్నా నాలుగాకులు ఎక్కువే చదివింది. అతి తక్కువ కాలంలోనే రాజకీయాన్ని బాగా వంటబట్టించుకుంది. బట్ట కాల్చి ప్రత్యర్థుల మీద పడేయటం వంటి విద్యల్లో అందె వేసిన చేయిగా పేరు తెచ్చుకుంది. గత కొంతకాలంగా ఆప్ రాజకీయ కార్యకలాపాలను పరిశీలించినప్పుడు ఈ అభిప్రాయం కలగక మానదు. తాజాగా తమ పార్టీ శాసనసభ్యులకు విపక్ష భారతీయ జనతా పార్టీ డబ్బు ఆశ చూపి గాలం వేస్తుందన్న ఆ పార్టీ ఆరోపణలను చూసినప్పుడు ఆప్ ఎంతగా ఎదిగిపోయిందో అర్థమవుతుంది. ఇతర విపక్షాలు సైతం ఆప్ రాజకీయం చూసి ముక్కున వేలేసుకుంటున్నాయి. తాము ఎంతగా వెనకబడిపోయామో, తమ కళ్ల ముందు పుట్టి పెరుగుతున్న పార్టీ ఎంత ముందుకు వెళుతుందో చూసి ఆశ్చర్యపోతున్నాయి!

# ఆప్ 'హైడ్రామా!'



ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆర్భాటంగా చెబుతున్నట్లు ఆ పార్టీ ఏమీ సుద్దపూసేమీ కాదు. ఆ పార్టీ నాయకులు అంతకన్నా కాదు. కేజ్రీవాల్ చుట్టూ ఉన్న వాళ్లు సత్యహరిశ్చంద్రు లేమీ కాదు. వారిలో కొందరు అనేక అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అవినీతి ఆరోపణలు వారిని చుట్టుముడుతున్నాయి. మద్యం విధాన రూపకల్పనలో అవకతవకలు జరిగాయంటూ ఆ పార్టీ సీనియర్ నేత, స్వయంగా కేజ్రీవాల్‌కు కుడిభుజం వంటి ఉప ముఖ్యమంత్రి మనీస్ సిసోదియా సీబీఐ (కేంద్ర దర్యాప్తు సంస్థ) కేసును ఎదుర్కొంటున్నారు. తాజాగా ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసు నమోదు చేసింది. ప్రాథమిక దర్యాప్తు నివేదిక (ఎఫ్ఐఆర్)లో సీబీఐ పేర్కొన్న మేరకు, నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)లోని వివిధ సెక్షన్ల కింద సిసోదియాను విచారించేందుకు ఈడీ రంగంలోకి దిగింది. ఈ విషయంలో స్వయంగా రంగంలోకి దిగిన లెఫ్టినెంట్ గవర్నర్ విజయ్‌కుమార్ సక్సేనా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించారు. ప్రాథమిక ఆధారాలు లేకుండా ఏ గవర్నరూ దర్యాప్తునకు ఆదేశించరన్న విషయాన్ని గుర్తించాలి.

దీంతో ఆప్ నాయకత్వానికి దిక్కుదరి తోచడం లేదు. ముచ్చెమటలు పడుతున్నాయి. తమ అవినీతి బాగోతం ఎక్కడ బయటపడుతుందోనన్న ఆందోళన ఆ పార్టీని వెంటాడుతోంది. సాధారణంగా ఎవరిపైన అయిన ఆరోపణలు వచ్చినప్పుడు సంబంధిత నాయకుడు వాటిని ఖండిస్తారు. ఎలాంటి విచారణకైనా సిద్ధమని సవాల్ విసురుతారు. కానీ ఆప్ నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆరోపణలకు సరైన సమాధానం ఇవ్వలేక విపక్ష భారతీయ జనతా పార్టీపై ఎదురు దాడి చేస్తున్నారు. ఆ పార్టీపై లేనిపోని అభాండాలు వేస్తున్నారు. అవి నవ్వు తెప్పించే విధంగా ఉన్నాయి. బీజేపీలో చేరడానికి సిసోదియా నిరాకరించినందువల్లే కేంద్రం ఆయనపై సీబీఐ, ఈడీలను రంగంలోకి దించిందని ఆప్ అధికార ప్రతినిధి, ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరోపణలు చూసినప్పుడు ఆశ్చర్యం కలగక మానదు. జైలుకు వెళ్లడానికైనా సిసోదియా సిద్ధపడతారు తప్ప బీజేపీకి ఆయన తలవంచరని ఆయన స్పష్టం చేశారు. పార్టీ అధినేత అరవింద కేజ్రీవాల్ మరింత ముందడుగు వేసి మాట్లాడిన తీరు వెగటు పుట్టించే విధంగా ఉంది. ఈ ఏడాది డిసెంబర్‌లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ రాష్ట్రంలో తమ పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి కమలం పార్టీలో ఆందోళన మొదలైందని, అందుకే తమ పార్టీ నాయకులను లక్ష్యంగా దాడులకు పాల్పడుతోందని కేజ్రీవాల్ ఆరోపించారు. అంతేకాక గుజరాత్ ముఖ్యమంత్రిని సైతం మార్చే ఆలోచన బీజేపీ చేస్తుందని ఆయన

ఆరోపించడం హాస్యాస్పదంగా ఉంది. గుజరాత్ ఎన్నికలకు, సిసోదియాకు సంబంధమేంటో ఎంత ఆలోచించినా ఎవరికీ అర్థం కాదు. దాదాపు మూడు దశాబ్దాలుగా గుజరాత్‌లో అధికారంలో ఉన్న కమలం పార్టీ నిన్నగాక మొన్న వచ్చిన ఆప్‌ను చూసి భయపడుతుందని చెప్పడం అతిశయోక్తి అవుతుంది. కాంగ్రెస్ అవినీతి, అసమర్ధ పాలనతో, ప్రధాన ప్రతిపక్షమైన అకాలీదళ్ కుటుంబ పాలనతో విసిగివేసారిన పంజాబ్ ప్రజలు వేరే ప్రత్యామ్నాయం లేక మొన్నటి ఎన్నికల్లో ఆప్‌కు పట్టం కట్టారు. అంతమాత్రాన గుజరాత్‌లోనూ అలా జరుగుతుందని భావించడం భ్రమే అవుతుంది. ఏటా ప్రభుత్వాలను మార్చే పద్ధతిని పాటించే పంజాబ్‌కు, మంచి పాలన అందించే పార్టీని ఆదరించి అక్కున చేర్చుకునే గుజరాత్ ప్రజలకు పోలిక లేదన్న విషయాన్ని కేజ్రీవాల్ ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది. అదే సమయంలో కేజ్రీవాల్ గ్రహించాల్సిన మరో ముఖ్య విషయం ఒకటుంది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన సంగ్రూర్ పార్లమెంటు స్థానానికి జరిగిన ఉపఎన్నికలో ఆప్ అడ్రసు కోల్పోయింది. అక్కడ ఖలిస్తానీవాది అయిన సిమ్రన్ జిత్‌సింగ్ మాన్ గెలిచారు. ఇది ఆప్ సిట్టింగ్ స్థానం. అదీ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ సీఎంగా బాధ్యతలు చేపట్టేవరకు ప్రాతినిథ్యం వహించిన పార్లమెంటు స్థానం. అంచనాల మేరకు పనిచేయక పోతే ప్రజలు ఎంతటివారినైనా ఉపేక్షించరనడానికి ఇంతకుమించిన మరో నిదర్శనం అక్కర్లేదు. అక్కడి దాకా ఎందుకు 2014 నుంచి ఢిల్లీని ఏలుతున్న ఆప్‌కు 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎటు వంటి చేదు ఫలితాలు ఎదురయ్యాయో అవలోకనం చేసుకుంటే వాస్తవాలు బోధపడతాయి. 2014, 2019ల్లో ఢిల్లీలోని మొత్తం ఏడు పార్లమెంటు సీట్లను బీజేపీ గెలుచుకున్న సంగతి తెలిసిందే. రెండు ఎన్నికల్లోనూ ఆప్ కనీసం ఒక్క సీటూ గెలుచుకోలేక పోయిన సంగతీ తెలిసిందే. ఈ విషయాలు తెలిసీ తెలియనట్లు నటిస్తోంది ఆప్.



జైన్

ఇప్పటికే తమ మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టుతో ఆప్ సతమతమవుతోంది. ఆయనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టలేక ఇబ్బందిపడుతోంది. తాజాగా సిసోదియా వ్యవహారం వెలుగులోకి రావడంతో గత్యంతరం లేక ఎదురుదాడికి దిగుతోంది. మనీ లాండరింగ్ కేసులో సత్యేంద్ర జైన్ అరెస్టయిన సంగతి తెలిసిందే.

ఇంతటితోనే ఆప్ నటన ఆగిపోలేదు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కమలం పార్టీ ప్రయత్ని స్తోందని ఆ పార్టీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ ఆరోపించడం మరింత హాస్యాస్పదంగా ఉంది. ఒక్కో శాసనసభ్యుడికి బీజేపీ రూ. 20 కోట్లు ఎర చూపిందని ఆయన ఆరో పించారు. మోదీకి కంట్లో నలుసుగా మారిన కేజ్రీవాల్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు కమలం పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోందని ఆయన ఆరో పించారు. మా ఎమ్మెల్యేలు అజయ్ దత్, సంజీవ్ ఝా, సోమ్‌నాథ్ భారతి, కులదీప్ కుమార్‌లతో సన్నిహిత సంబంధాలున్న కొందరు నేతలతో బీజేపీ నాయకులు సంప్రదింపులు జరిపారని, పార్టీ మారితే ఒక్కొక్కరికి రూ. 20 కోట్ల ఎర చూపారని సంజయ్ సింగ్ ఆరోపించారు. ఇతర శాసనసభ్యులను తీసుకు వస్తే రూ.25 కోట్ల వంతున ఇస్తామని, లేనట్లయితే మనీశ్ సిసోదియా మాదిరిగా సీబీఐ, ఈడీ కేసులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ సంప్రదించిందని చెబుతున్న ఆప్ శాసనసభ్యులు సైతం పాల్గొనడం విశేషం. ఆప్ శాసనసభ్యులు అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతారు తప్ప అమ్ముడుపోరని చెప్పడం నాటకీయం తప్ప మరొకటి కాదు. ఆ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో బీజేపీ నేతలు చెప్పాలని డిమాండ్ చేయడం మరో విశేషం. ఆరోపణలు చేసేది వారే, వివరణలు అడిగేదీ వారే కావడం ఇక్కడ ప్రత్యేకత. ఆప్ శాసనసభ్యులను బీజేపీ నాయకులు ప్రలోభ పెట్టారని ఆరోపిస్తున్నారు. ఆ శాసనసభ్యులు ఎవరో చెబుతున్నారు. అదే సమయంలో వారిని ఎవరు సంప్రదించారో వారినే అడిగితే తెలిసిపోతుంది. అంతేతప్ప మరెవరిపైనో బట్ట కాల్చివేయడం, బురద జల్లడం సరైన విధానం కాదు. ఈ విషయాన్నే బీజేపీ సూటిగా ప్రశ్నించింది. డబ్బులు ఎవరు ఇస్తామని చెప్పారో, వారి పేరు ఎందుకు వెల్లడించరు? ఎందుకు వెనకాడుతున్నారని ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర ప్రశ్నించారు. ఇందుకు ఆప్ నుంచి సమాధానం కరవైంది. బహుశా మద్యం మాఫియా నుంచి ఆప్ శాసనసభ్యులకు ఆఫర్ వచ్చి ఉంటుందని సంబిత్ ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీలో మొత్తం 70కిగాను ఆప్‌కు 62మంది, బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 8 మంది ఎమ్మెల్యేలున్న పార్టీ ప్రభుత్వాన్ని ఎలా కూల్చగలదో ఎవరికీ అర్థం కాదు. ఆప్‌లో సమాంతరంగా చీలిక వస్తే తప్ప అది సాధ్యం కాదు. నిజంగా అలా జరిగితే అది పార్టీలో అంతర్గత తిరుగుబాటు అవుతుంది తప్ప శాసనసభ్యులకు ఎర వేయడం కాదు. ఈ విషయాలన్నీ తెలిసీ ఆప్ అద్భుతంగా నటిస్తోంది.

ఇప్పటికే తమ మంత్రి సత్యేంద్ర జైన్ అరెస్టుతో ఆప్ సతమతమవుతోంది. ఆయనపై వచ్చిన ఆరోపణలను తిప్పికొట్టలేక ఇబ్బంది పడుతోంది. తాజాగా సిసోదియా వ్యవహారం వెలుగులోకి రావ డంతో గత్యంతరం లేక ఎదురుదాడికి దిగుతోంది. మనీ లాండరింగ్ కేసులో సత్యేంద్ర జైన్ అరెస్టయిన సంగతి తెలిసిందే. కోల్‌కతాకు చెందిన ఓ కంపెనీకి సంబంధించిన హవాలా లావాదేవీల వ్యవహారంలో ఆయన్ను అరెస్టు చేశారు. ఆయనకు చెందిన రూ.4.81 కోట్ల ఆస్తులను ఎటాచ్ చేశారు. కేజ్రీవాల్ మంత్రివర్గంలో ఆయన వైద్య ఆరోగ్య, విద్యుత్, గృహ నిర్మాణ, పీడబ్ల్యూడీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి, నీటి పారుదల వంటి కీలక శాఖలకు సారథ్యం వహిం చారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు. ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటూ, దిక్కుతోచక అనవసరంగా బీజేపీపై అభాండాలు వేస్తోంది ఆప్. దేశంలోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టేందుకు బీజేపీ రూ.6300 కోట్లను వెచ్చించిందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఇప్పటివరకు 277 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిందన్నారు.

ఆరోపణలతో చెలరేగిపోతున్న కేజ్రీవాల్ అసలైన మద్యం విధానానికి సంబంధించి లేవనెత్తిన ప్రశ్నలకు మాత్రం సమాధానం ఇవ్వడం లేదు. ఆయన మౌనం మద్యం విధానంలోని 'లొసుగులను' సూచిస్తోందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా విమర్శించారు. కేజ్రీవాల్ ఆరోపణలను దీటుగానే ఆ పార్టీ తిప్పి కొట్టింది. కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆడలేక మద్దెల ఓడన్నట్లు కేజ్రీవాల్ తన శాసనసభ్యులను కాపాడు కోలేక బీజేపీపై ఎదురుదాడి చేస్తున్నారని విమర్శిం చారు. సిసోదియాపై ఆరోపణలకు ఆధారాలు లేనట్లయితే కోర్టే ఆ విషయాన్ని నిర్ధారిస్తుంది. నిర్దోషిగా బయటపడతారు. అప్పటిదాకా వేచి చూసే ఓపిక లేక ఎదురుదాడి చేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. జైన్, సిసోదియా వ్యవహారం ఆప్ మెడకు చుట్టుకునే ప్రమాదం లేకపోలేదు.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

పౌరరక్షణ అప్పుడప్పుడు మనకు వినిపించే మాట. ఆడపిల్లలు– ముఖ్యంగా విద్యార్థినులు తమను తాము కాపాడుకోవాలంటే ఆయుధం, సాధనం అదే. ఆపద సమయాల్లో ఇతరులను ఎలా రక్షిస్తారో వెల్లడిస్తూ; ఒకవేళ అవే పరిస్థితులు తమకే ఎదురైతే ఆత్మరక్షణ ఏ విధంగా చేసుకోవాలన్నదే సారాంశం. ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విద్యాలయాల్లో ఆ విధమైన శిక్షణ కొంతకాలం సాగింది. పలు కారణాల వల్ల అది మందగించింది. నానా విధాల పరిణామాల వల్ల నేరాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అమ్మాయిలకు రక్షణ పూర్తిగా కరవైపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రక్షణ విద్య ప్రాధాన్యం విస్తరించాలనడంలో ఆశ్చర్యం ఏముంది? ఆత్మరక్షణ ఒక హక్కు. వ్యక్తులైనా, వారి ఆస్తులైనా ప్రమాదంలో పడితే ప్రభుత్వ అధికార యంత్రాంగం నుంచి తక్షణ సాయం అందే అవకాశమే లేకుంటే ఏం చేయాలి? బాధితురాలు తన ఆత్మరక్షణ హక్కును వాడుకోవచ్చు. భారత పరమోన్నత న్యాయస్థానం ఈ అంశాన్ని ఏనాడో ప్రస్ఫుటం చేసింది. ఎటువంటి స్థితిగతుల్లో స్వయం రక్షణ హక్కును వినియోగించ వచ్చో శిక్షాస్మృతి తేల్చి చెప్పిందని పేర్కొంది. బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు తమ భద్రతను తాము చూసుకునే ప్రక్రియను నేర్పిస్తున్నారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోనైతే ప్రత్యేక శిక్షణ విభాగాలను రూపొందించారు. అత్యవసర వేళల్లో తమ పరిరక్షణకు వీలుగా ఫోన్ నంబర్లను దగ్గర పెట్టుకోవాలని పోలీసు ఉన్నతాధి కారులు, ప్రత్యేకించి షీ టీమ్ బాధ్యులు సూచిస్తూ ఉన్నారు. ఇదంతా ఓ ఉద్యమంలా కొంతకాలం సాగింది కానీ, అనంతరం వేగం తగ్గింది. దీనికి కారణాలేమిటి? సమస్యను పరిష్కరించడానికి సమాజంలో ఎవరెవరు ఏ మేర స్పందించాల్సి ఉంటుందన్నదే ప్రస్తుత చర్చనీయం. పూర్వాపరాల్లోకి వెళితే..



ఏ పత్రిక తిరగేసినా, ఏ ఛానెల్ చూసినా, సమాచార ప్రసార ప్రచార మాధ్యమాల్లో అన్నిటా అంతటా ఎక్కువగా కనిపించేవి వనితలపై అకృత్యాల వార్తలే. వారి పట్ల వేధింపులు, హింస, లైంగిక దాడులు, అఘాయిత్యాలు మరెన్నో. వాటిని ప్రచురించడం, ప్రసారం చేయడం, వివరాలు వెల్లడించడం రోజువారీగా మారిన దారుణ పరిస్థితులే ఎటు చూసినా కనిపిస్తున్నాయి. విద్యా సంస్థల వెలుపల, ఉద్యోగ ప్రదేశాల్లో చోటుచేసుకుంటున్న ఇలాంటి సంఘటనలు దిగజారిన మానవతా విలువలకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. అటువంటి నేరాలకు శిక్షలు లేవా? ఉండవా? అంటే ఎందుకు ఉండవు! స్త్రీని ఏ విధంగా హింసించినా శిక్షార్హమే అని భారత శిక్షాస్మృతిలోని 354వ సెక్షన్ అంటోంది. దురుద్దేశంతో ప్రవర్తించినా, వారిని కించపరిచేలా ఫొటోలు/వీడియోలు తీసినా కఠిన శిక్ష తప్పదంటోంది. అవమానకరంగా మాట్లాడినా, అసభ్య సైగలు చేసినా దండన ఉండి తీరుతుందంటుంది 509వ సెక్షన్. నడుస్తూ వెళ్తున్న అమ్మాయిని వెంబడించినా, బస్టాప్ వంటి చోట్ల అనుచితంగా ప్రవర్తించినా, ఒంటరిగా ఉన్న ఆడపిల్లతో అనాగరికంగా ప్రవర్తించినా చర్యలు తథ్యమని 294వ సెక్షన్ చాటి చెబుతోంది. ఇబ్బంది పెట్టేవాళ్ళకు కారాగార శిక్ష లేదా జరిమానా తప్పదంటోంది. ఇష్టానుసారం అనుకరించినా, హేళనచేసినా, అవమానపరిచి బాధించినా చట్టం ఊరుకోదు. గరిష్ఠంగా ఐదేళ్ళపాటు జైలు శిక్ష తప్పదంతే! ఫొటోల మార్ఫిడి వంటి అకృత్యాలకు పాల్పడిన వాళ్లకు, దుష్ప్రచారాలు కొనసాగించే వారికి కటకటాలూ తప్పవు. దౌర్జన్యాలకు, బలప్రయోగాలకు అత్యధికంగా ఏడు సంవత్సరాల శిక్ష తథ్యం. సెక్షన్ 354 (అనుబంధ) ప్రకారం కఠినంగా విధింపు ఉంటుంది. చట్టం ఇంత వివరంగా ఉన్నా నేరాలు ఎందుకు తగ్గడం లేదంటే..భయమూ, భీతీ లేకపోవడమే! సకాలంలో శిక్షలు పడితే, సంబంధిత అధికారుల స్పందన తక్షణమే లభించి నేరాలకు అడ్డుకట్టంటూ ఉంటే ఇక కావాల్సిందేముంది?



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

**యుద్ధ కళలు నేర్వాల్సిందే**

ఆకతాయిలు వెంటపడితే, ప్రయాణిస్తున్న అమ్మాయిలతో వాహనచోదకులు అసభ్యంగా ప్రవర్తించినా, దారి మళ్లించి అత్యాచారాలకు తెగబడినా పని పడతానంటోంది 'దిశ'. పని స్థలాల్లో వనితలు ఎటువంటి దుండగుల బారిన పడకుండా చూస్తానని చెబుతోందీ యాప్. పరిపూర్ణ అవగాహన కలిగిస్తూ ఆ యాప్‌ను ఆడపిల్లల ఫోన్లకు అనుసంధానించి పేరు తెచ్చుకున్నారు ఆంధ్రప్రదేశ్ పోలీసులు. మహిళలు ఒకవేళ ఇబ్బందులు ఎదుర్కొంటే, బాధితుల కుటుంబ సభ్యులు, మిత్రులకూ సమాచారం వెంటనే చేరేలా ఏర్పాట్లు చేశారు. ఇవన్నీ మహిళా రక్షణకు దోహదపడుతున్నాయి.

తెలంగాణ మహిళా భద్రతా విభాగం తనవంతు కృషితో అండదండలందిస్తోంది. జనసందోహం ఉన్న ప్రాంతాల్లో, రద్దీ ప్రదేశాల్లో, పండుగల సందడి వేళల్లో, మార్కెట్ స్థలాల్లో పోకిరీల భరతం పట్టేందుకు షీటీమ్స్ రంగంలోకి దిగిన సందర్భాలెన్నో. సాంకేతికత వినియోగం, నేరాల నియంత్రణ రీతులు, కట్టడి చర్యలతో ముందడుగు వేస్తూ వస్తున్నాయి. పోలీసు, న్యాయవ్యవస్థలను కలిపి ఉంచే విధానం కూడా దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో పైలట్ ప్రాజెక్టులా అమలైంది. నిఘా నేత్రాల (సీసీటీవి కెమెరాలు)పరంగానూ దూసుకెళ్తున్నట్లు బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ నివేదిక తెలిపింది. వీటన్నింటికీ తోడు, ఎవరికివారే రక్షించుకునే విధంగా



# శిక్షణతో ఆత్మరక్షణ

ప్రభుత్వ వ్యవస్థలు, సేవాసంస్థలు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తు న్నాయి. ఆత్మరక్షణ కోసమే కరాటే వంటి యుద్ధవిద్యలు నేర్చుకోవాలని ఉత్సాహ పరుస్తున్నాయి. మార్షల్ ఆర్ట్స్ విస్తృతికి ఎంత అవకాశం కలిగిస్తే అంత త్వరగా నేరాలు అదుపులోకి వస్తాయి. ప్రతి ఆడపిల్లకీ ఆత్మరక్షణ శిక్షణ అవసరమని రెండేళ్ల క్రితం ఒక ఉన్నత పాఠశాల ఆవరణలోని సదస్సులో తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు. అక్కడి బాలికలు పాల్గొన్న ప్రదర్శనను తిలకించిన ఆమె.. ఆత్మరక్షణ కళలు పాఠ్యాంశంలో భాగంగా మారాలనడం పెరుగుతున్న ప్రాధాన్యానికి నిదర్శనం. ప్రతికూల స్థితులు ఎదురైనప్పుడు ఏ వనిత అయినా మరింత తెలివిగా మెలగాలి. తాను విపత్కర పరిస్థితిలో ఉన్నాననే సమాచారాన్ని బయటికి చేరవేయగలగాలి. ఈ లోగా తన రక్షణ విద్యను వినియోగిస్తే, సంఘవిద్రోహుల ఆటకట్టినట్లవుతుంది. గవర్నర్ ఇచ్చిన సందేశం, చేసిన సూచన ఇదే.

**నెరవేరిన 'అభి'లాష**

అభిషేక్ పేరు విన్నారా మీరు? ఆతడిది కర్ణాటక. ఒకరోజు మిత్రులతో కలిసి ఉత్తరప్రదేశ్ వెళ్లాడు. అది దసరా పండగ సెలవుల కాలం. ఓ ఉత్సవానికి వెళ్లినప్పుడు, సరిగ్గా అక్కడే కొందరు అమ్మాయిల్ని పోకిరీలు వేధించడం చూశాడు. యుద్ధ విద్యలు నేర్చినవాడు కాబట్టి, వెంటనే అడ్డుపడి వాళ్లను కాపాడి ఇళ్లకు చేర్చాడు. అప్పుడు అనిపించింది అతనికి 'నా లాగా ఈ ఆడ పిల్లలకీ కరాటే వంటివి తెలిసి ఉంటే, వాళ్లని వాళ్లే రక్షించుకునే వాళ్లు కదా!' అని. అటు తర్వాత, తన మదిలో మెదిలిన ఆలోచన ఆచరణగా మారింది. వేలమందికి ఆత్మరక్షణ విద్యలు నేర్పేలా చేసింది. అతడు చేపట్టిన ఆ కార్యక్రమం పేరు 'నా రక్షణ నా చేతుల్లోనే'! ఇది 16 ఏళ్ల నాటి మాట. తన పేరిట ట్రస్టు స్థాపించి, పోలీసుశాఖ వారితో చర్చించి ముందుకు సాగాడు. రక్షకుడిగా లక్షలాది వనితల, వారి కుటుంబ సభ్యుల ప్రశంస లందుకున్నాడు. అతడి సేవా ప్రక్రియ మహారాష్ట్రతో పాటు దేశ రాజధానికీ విస్తరించింది. అనేక శిక్షణ శిబిరాలు నిర్వహించి, ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచాడు. తన నిర్వహణ కేవలం విద్యార్థినులూ యువతులకే పరిమితం కాలేదు, కానివ్వలేదు. నాలుగు పదుల వయసు దాటిన అతివలకీ విస్తరించేలా చేశాడు. ఆ మహిళా బృందానికి తాను పెట్టిన పేరు తెలుసా? 'పవర్ వింగ్'. అవును..! అంతటి శక్తియుక్తుల వినియోగంతోనే అగ్రదేశం అమెరికా నుంచి ప్రెసిడెన్షియల్ ఛాంపియన్ గోల్డ్ అవార్డు స్వీకరించాడు అభి. చట్టాలుంటాయి, నిబంధనలూ ఉంటాయి. దేశంలో ఎన్ని ఉన్నా ప్రత్యేకంచి ఆడపిల్లలకి ముందు జాగ్రత్తలుండాలి. రక్షణ విద్యలతో ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలను పెంచుకోవాలంటాడతను. మన దేశంలోనూ ప్రభుత్వం స్వీయరక్షణ శిక్షణ కార్యక్రమం అమలు పరుస్తోంది. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు పరిసరాల పరిశీలనా శక్తి కలిగిస్తోంది. అనూహ్యంగా ఉపద్రవం ఎదురైతే తమను తాము రక్షించుకోగలిగిన సత్తువ పెంచుతోంది. శిక్షణలో భాగంగా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి మంత్రిత్వశాఖ వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. పోలీస్, హోమ్‌గార్డు, ఎన్‌సీసీ విభాగాల ద్వారా సమన్వయం సాధిస్తోంది.

**పోకిరీల పనిపట్టాలి**

అలనాటి యుద్ధ కళల్లో 'సిలంచం' ఒకటి. దీనికి గతంలోనే కేంద్రం నుంచి గుర్తింపు లభించింది. ప్రాచీన విద్య అయినా, ఆధునికంలోనూ ఎంతైనా అవసరం. ఇందులో ఆయుధమూ, సాధనమూ ఒకటే. కొన్నిచోట్ల వెదురు కర్రలను ఉపయోగి స్తుంటారు. పొరుగు రాష్ట్రం తమిళనాట చిరకాలంగా పేరొందిన విద్య అది. కర్రసాముతో దుండగుల ఆట కట్టించవచ్చు. ఇటువంటి అభ్యాసాలు ఆత్మరక్షణకు వినియోగపడతాయి. పాఠశాల స్థాయి నుంచే ముఖ్యంగా ఆడపిల్లలు నేర్చుకోవడం విశ్వాస పటిమను తీర్చిదిద్దుతుంది. చట్టాలను గౌరవిస్తూ, ఆయా నిబంధనలను అనుసరిస్తూ కొనసాగడమే పౌరధర్మం. అదే సందర్భంలో అత్యవసర సమయాల్లో తన రక్షణకు తాను యుద్ధ విద్య అభ్యసించడం ఎంతైనా ప్రయోజనకరం. ప్రతీ మహిళ శక్తి స్వరూపిణి. గౌరవించి ఆదరించడం భారతీయ సంప్రదాయం. విరుద్ధ పరిస్థితులు ఎదురైతే, తనను తాను ఎలా కాపాడుకోవాలో మగువకు తెలుసు. అందుకు ఊతమిచ్చేలా ప్రభుత్వాలూ మరింత ముందుకు రావడం, వనితాశక్తిని చాటి చెప్పడం ఎంతైనా ప్రధానం. నారీ శక్తికి మహాభివాదం. ★

చట్టాలుంటాయి, నిబంధనలూ ఉంటాయి. దేశంలో ఎన్ని ఉన్నా ప్రత్యేకంచి ఆడపిల్లలకి ముందు జాగ్రత్తలుండాలి. రక్షణ విద్యలతో ఆత్మవిశ్వాసం, ధైర్యసాహసాలను పెంచు కోవాలంటాడతను. మన దేశంలోనూ ప్రభుత్వం స్వీయరక్షణ శిక్షణ కార్యక్రమం అమలు పరుస్తోంది. పాఠశాల స్థాయి నుంచే బాలికలకు పరిసరాల పరిశీలనా శక్తి కలిగిస్తోంది. అనూహ్యంగా ఉపద్రవం ఎదురైతే తమను తాము రక్షించుకోగలిగిన సత్తువ పెంచుతోంది.

# విదేశీ మతాల కోసం వినాయకుడి మీద



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందూ సంస్కృతిని అణచివేసే చర్యలకు ప్రభుత్వం పూనుకోవడాన్ని హిందువులంతా వ్యతిరేకిస్తున్నారు. హిందూ సంస్కృతిని, హిందూ ధర్మాన్ని అణచివేసి పరమతాలను ప్రోత్సహిస్తూ, మరో కేరళగా మార్చివేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. హిందూ సంస్కృతిలో పండుగల నిర్వహణ అత్యంత కోలాహలంగా జరగడం ప్రధాన లక్షణం. అందులోనూ వినాయక చవితి ఉత్సవాలు దేశంలోనే పేరెన్నికగన్నవి. ఇవి ఉత్సవాలే కాదు. స్వాతంత్రోద్యమంలో ప్రజలంతా ఐకమత్యంగా ఉండి బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడటానికి ఈ ఉత్సవాలు దోహదపడ్డాయి.. అంతటి ఘన చరిత్ర ఈ గణేష్ ఉత్సవాలకు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా అత్యంత ఘనంగా ఉత్సవాలు జరిగేవి. మన దేశంలోనే కాదు ఇతర దేశాల్లో కూడా ఘనంగా జరుపుకుంటున్నాం. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం స్వేచ్ఛగా నిర్వహించుకునే అవకాశం కనిపించడం లేదని హిందువు లంటున్నారు. గత ఏడాది కోవిడ్ పేరుతో చవితి వేడుకలను అడ్డుకోడానికి ప్రయత్నించిన ప్రభుత్వం ఈ ఏడాది పలురకాల అనుమతుల పేరుతో ఆంక్షలు విధించి వేడుకలకు అడ్డుపడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చవితి వేడుకల్లో చిన్న పందిళ్లే అధికం. స్థానికంగా ఉండే యువత చందాలు పోగుచేసి ఆ వచ్చిన కొద్దిపాటి డబ్బుతోనే చిన్నపందిళ్లు వేసి పండుగను వారానికిపైగా అత్యంత ఉత్సాహంగా జరుపుకుంటారు. కాని ఇప్పుడు ప్రభుత్వం విధించిన నిబంధనలతో ఈ పందిళ్ల వేసే అవకాశం కనిపించం లేదు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాలను అడ్డుకునే ప్రభుత్వం, ఇతర మతాలకు చెందినవారు చేసే నెల, వారం, రోజూ చేసే వేడుకలను ఎలా అనుమతిని ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

**నియమ నిబంధనలు**

వినాయక "విగ్రహ ప్రతిష్ఠ పందిళ్లను" ఏర్పాటు చేసుకోవడానికి, ఊరేగింపునకు తప్పని సరిగా కొన్ని అనుమతులను తీసుకోవాలని పోలీసులు ప్రకటించారు. ముందుగా మున్సిపాలిటీ, ఫైర్, ఎలక్ట్రికల్ పంచాయతీ శాఖల అనుమతి పొందిన తరువాత మాత్రమే పోలీస్ శాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది. మండపాల వద్ద శబ్దకాలుష్య క్రమబద్దీకరణ, నియంత్రణ నిబంధనలు-2000 ప్రకారం రెసిడెన్సియల్ ఏరియా నందు పగలు 55, రాత్రి 45 డెసిబల్స్‌కు మించకుండా ఉండే విధంగా స్పీకర్లను ఉపయోగించాలి. లౌడ్ స్పీకర్లను సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఎటువంటి స్పీకర్లను ఎట్టి పరిస్థితులలోను ఉపయోగించరాదు. విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలి. మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ వైర్లను ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో జాగ్రత్తలు వహించాలి. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలి. భద్రత కోసం రాత్రి సమయాల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండాలి. మండపాల వద్ద ఏ విధమైన అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు నీరు, ఇసుకను ఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి పందిరి వద్ద నిర్వాహకులు సి.సి.టి.వి కెమెరాలు ఏర్పాటు, 24/7 సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలి. మండపం పటిష్టతను దృష్టిలో ఉంచుకుని పూజ నిర్వహించే సమయంలో మండపంపై ఎక్కువ మంది జనం లేకుండా చూడాలి. విగ్రహ పందిళ్ళ చుట్టుప్రక్కల వాహనాలను పార్కింగ్ చేయరాదు. పందిళ్ళకు దూరంగా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలి. వినాయక పందిళ్ళు గాని, విగ్రహం పెట్టే ప్రదేశం గాని రోడ్డుపైన ఉండరాదు. బ్యానర్లు కానీ, ఫ్లెక్సీలు రోడ్డుపైన పెట్టరాదు. వినాయక పందిళ్ళ వలన ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బంది కలిగించరాదు. విగ్రహ నిమజ్జన ఊరేగింపు సమయంలో రంగులు చల్లడం, లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం, మందుగుండు సామగ్రిని పేల్చడం చేయరాదు. ఊరేగింపు సమయంలో పోలీసుల అనుమతి లేకుండా వేషధారణలు ఎక్కువ శబ్దం వచ్చే వాయిద్యాలు అనగా డీజే అనుమతించరాదు. పందిళ్ళ వద్ద ఊరేగింపు సమయాలలో అనుచిత ప్రదర్శనలు, అసభ్య నాట్య ప్రదర్శనలు జరగకుండా మద్యం లేదా మత్తు పదార్థాలను సేవించిన వారు లేకుండా ఉండే విధంగా ఉత్సవ నిర్వాహకులు బాధ్యత వహించాలి. ఈ నిబంధనలు పాతవే కాని కొన్ని నిబంధనలపై మాత్రం వివాదం నెలకొంది. కరెంటు సరఫరా, అగ్నిప్రమాద నివారణ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలనడం, ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు బ్యానర్లు ప్రదర్శించడం చేయరాదనడం, అలాగే ఊరేగింపుతో పాటు వెళ్లే

# ఆంక్షలా?



**తురగా నాగభూషణం**

మతనాయకులు వేరే మతాలకు వ్యతిరేకంగా ఉపన్యాసాలు ఇవ్వకుండా మత సామరస్యం పాటించాలి అనడం మాత్రం అభ్యంతరకరంగా మారాయి. ఇటీవల నెల్లూరులో జరిగిన హనుమాన్ శోభాయాత్రపై ఒక మసీదులోని ముస్లింలు దాడులు చేయడం, హిందూ ధర్మ వ్యతిరేక నినాదాలు చేయడం అందరికీ తెలిసిందే. సహజంగా ఇలాంటివి చేసేది అన్యమతస్తులే. ఈ నిబంధనలు వారికి వర్తించవా?

### చిన్న పందిళ్లపై ఆర్థిక భారం

రాష్ట్రవ్యాప్తంగా వినాయక మండపాలకు 2014 నుంచి అమలులో ఉన్న టారిఫ్ ప్రకారం 500 వాట్స్‌కి రూ.1000, 1000 వాట్స్‌కి రూ.2,250, 1,500 వాట్స్‌కి రూ.3,000, 2000 వాట్స్‌కి రూ.3,750, 2,500 వాట్స్‌కి రూ.4,550, 3000 వాట్స్‌కి రూ.5,250, 3,500 వాట్స్‌కి రూ.6,000, 4000 వాట్స్‌కి రూ.6,750, 5000 వాట్స్‌కి రూ.8,250, 6,000 వాట్స్‌కి రూ.9,750, 10,000 వాట్స్‌కి రూ.15,750 చొప్పున చెల్లించి తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లను తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఈ కనెక్షన్ల ద్వారా పది రోజులపాటు విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని తెలిపింది. వినాయక చవితి ఉత్సవాల పందిళ్లకు విద్యుత్ సరఫరా అవసరమే. స్థానికంగా వేసే చిన్న పందిళ్లకు మాత్రం స్థానికులే కరెంటు సరఫరా ఇస్తారు. వాటిని ఆ ఇంటి యజమానే భరిస్తారు. పెద్ద పందిళ్లకు మాత్రం నిర్వాహకులు విద్యుత్ శాఖ నుంచి సరఫరా తీసుకుంటారు. కాని ఇప్పుడు అన్ని పందిళ్లకు విద్యుత్‌శాఖ నుంచే సరఫరా పొందాలని అందుకు అనుమతులు తీసుకోవాలని నిబంధనలు విధించారు.

దీని వల్ల చిన్న పందిళ్లపై ఆర్థికభారం పడి నిర్వహణకు ముందుకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉంటే ప్రతి పందిరి నిర్వాహకులు రోజుకు తమకు రూ.1000 చెల్లించాలని పోలీసులు అడుగుతున్నారని నిర్వాహకుల నుంచి విమర్శలు రావడంతో పోలీసులు ఉన్నతాధికారులు ఎవరికీ డబ్బులు ఇవ్వరాదని ప్రకటించారు. పందిరి నిర్వహణలో నిబంధనలు లేవని ప్రకటించారు. పోలీసులు విధించిన నిబంధనలపై భారతీయ జనతా పార్టీ మండిపడింది. నిబంధనలు లేవంటూనే ఫైర్, విద్యుత్,పోలీస్ పర్మిషన్స్ తీసుకోవాలని చెప్పడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తప్పు పడుతున్నారు. ఇవి నిబంధనలు కావా అని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాదులో వినాయక చవితి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఆ వేడుకలు చూసేందుకు ఎక్కడెక్కడ నుంచో ప్రజలు తరలి వస్తారు. ఏపి సీఎం అక్కడికి వెళ్లి అందులో పాల్గొంటే అప్పుడు ఆ ప్రాముఖ్యత తెలుస్తుంది. ఇక్కడ పెట్టిన నిబంధనలు అన్నీ వెంటనే తొలగించాలి. నిబంధనల పేరుతో పండుగని అడ్డుకోవాలంటే బిజెపి చూస్తూ ఊరుకోదు. రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ ఈ నిబంధనలు ఏమీ పట్టించుకోవద్దు. రాజమండ్రిలో వినాయక చవితి వేడుకల్లో నేను పాల్గొంటాను. దానికి ఎలాంటి అనుమతులు తీసుకోను. దమ్ముంటే నన్ను అడ్డుకోండి, అరెస్ట్ చెయ్యండంటూ ఆయన సవాల్ విసిరారు.

### వారికి నిబంధనలు లేవా?

రాష్ట్రంలో వేల కొద్దీ ఇతర మతాలకు చెందిన ప్రార్థన స్థలాలున్నాయి. మసీదుల్లో రోజుకు అయిదుసార్లు లౌడ్ స్పీకర్లతో ప్రార్థనలు చేస్తారు. రంజాన్ సమయంలో రోజూ వేలాది మంది ఒకే ప్రాంతంలో గుమిగూడి ప్రార్థనలు చేస్తారు. మొహరం రోజు వేలాది మంది బహిరంగంగా ర్యాలీలు నిర్వహించి ప్రదర్శనలు చేస్తారు. పలుమార్లు రెచ్చగొట్టేలా నినాదాలు చేయడం అందరూ చూశారు. చర్చిల్లో హిందూమతాన్ని, దేవతలను దూషిస్తూ, అవమానిస్తూ మాట్లాడినప్పుడు ఈ నిబంధనలు ఏమయ్యాయి? వైకాపాకు ఓటువేయాలని ముల్లాలు, ఫాస్టర్లు మసీదులు, చర్చిల్లో ప్రచారం చేసినప్పుడు, దేవుని రాజ్యం రావాలని, అదే కొనసాగాలని ప్రసంగాలు చేసినప్పుడు ఈ ప్రభుత్వం ఏం చేసింది? అని హిందువులు ప్రశ్నిస్తున్నారు.

### ఉద్దేశపూర్వకంగా అణచివేత

రాష్ట్రంలో వైకాపా అధికారం చేపట్టినప్పటి నుంచి అణచివేత చర్యలు చేపట్టిందని హిందువులు, హిందూమత సంస్థలు, భారతీయ జనతా పార్టీ ఆరోపిస్తున్నాయి. తమకు 100 శాతం ఓట్లు వేసి మద్దతిచ్చారని అన్యమతాలను అనుసరించేవారికి ప్రోత్సాహం ఇచ్చి, అదే సమయంలో హిందూ మతంపై పరమతాల దాడులు, మతమార్పిడులు జరుగుతుంటే పట్టించుకోవడం లేదని ఆరోపిస్తు న్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం వారి ఓట్లు పొందేందుకు ప్రభుత్వం ఇలా హిందూమత వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నట్లు చెబుతున్నారు. ఆలయాల కూల్చివేత, విగ్రహాలు, రథాలను ధ్వంసం చేసినా ప్రభుత్వం దానిని పిచ్చోళ్ల పనిగా ప్రకటించడం వంటివి హిందువులను తీవ్ర ఆగ్రహానికి గురి చేశాయి.

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గోవులను అక్రమంగా వధిస్తున్నారనే సమాచారం ఇచ్చిన యువకులపై దాడులు, నిందితులను వదిలేసి సమాచారం చెప్పిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, గోవధ నిషేధం సాధ్యం కాదని ఎమ్మిగనూర్ ఎమ్మెల్యే బహిరంగంగా చెప్పడం, అక్కడ జరిగిన హింసా కాండను ఏమాత్రం పట్టించుకోకపోవడం, దానికి తోడు కడప జిల్లా ప్రొద్దుటూరులో స్థానిక వైకాపా ఎమ్మెల్యే ప్రోత్సాహంతో టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటు చేయాలనుకోవడం, శ్రీశైలంలో తిష్టవేసుకున్న అన్యమతావలంబికుడు, దేవస్థానం నిర్వహణలో పాల్గొనడం, కాంట్రాక్టు పనుల్లో అక్రమ జోక్యం, పూలమాటున మద్యం సరఫరా చేయడం, మాంసం కోసమే గోశాలలో గోవులు మరణించేలా చేయడం వంటి ఆరోపణలు వచ్చాయి. కర్నూలు జిల్లా ఆత్మకూరులో అనుమతి లేని మసీదు నిర్మాణాన్ని వ్యతిరేకించి ఫిర్యాదు చేసినందుకు నంద్యాల జిల్లా బీజేపీ నాయకుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు అధికారపార్టీ కార్యకర్తలుగా మారి బాధితుడిపైనే అక్రమకేసులు పెట్టారు. పరిపాలనా వైఫల్యాలతో ప్రజల మద్దతు కోల్పోయిన ప్రభుత్వం, రాబోయే ఎన్నికల్లో పరమతాలకు అనుకూలంగా ఉండి, వారిని ప్రసన్నం చేసుకుని ఓట్లు వేయించుకుని గెలవాలనే తలంపుతోనే హిందూ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని హిందువులు ఆరోపిస్తున్నారు.

### రాజకీయ కోణం

వినాయక చవితి పందిళ్లకు అనుమతులు ఇవ్వడంలో విధించిన ఆంక్షలకు రాజకీయకోణం కూడా ముడివడి వున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి ప్రాంతంలోనూ పందిళ్లు వేసే వారిలో అన్ని పార్టీల వారు కూడా ఉంటారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిమాణాలు, ఇతర పార్టీల అణచివేత చర్యలను పరిశీలిస్తే పోలీసులు, ఫైర్, విద్యుత్ సంస్థల అనుమతులు ఇతర పార్టీల యువత నిర్వహించే పందిళ్లకు రాకుండా చేస్తాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం వైకాపా నాయకులు వేసే పందిళ్లకు మాత్రమే అనుమతులు ఇచ్చి మిగతావారి పందిళ్లకు అనుమతులు రాకుండా చేసే పన్నాగంగా అనుమానిస్తున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**



# ప్రహ్లాద వరదా నృసింహా...!!

వరాహ రూపంలో తమ్ముడు హిరణ్యాక్షుడిని వధించిన విష్ణువుపై పగ సాధించాలన్న తీవ్ర సంకల్పంతో హిరణ్యకశిపుడు తపస్సుకు బయలుదేరి వెళ్ళాడు. ఆ సమయంలో ఆయన భార్య లీలావతి గర్భస్థ శిశువును హత మార్చడానికి ఇంద్రుడు మాయోపాయంతో ఆమెను చెరబట్టాడు. ఆకాశమార్గాన వెళుతున్న ఆయనకు నారదుడు ఎదురై, 'దేవేంద్రా! ఎంత పనికి ఒడిగట్టావు! నీ ప్రయత్నాన్ని విరమించు. హిరణ్యకశిపుడు పగతో సర్వకాల సర్వావస్థలలో విష్ణు చింతనలో ఉండడం వల్ల లీలావతి గర్భస్థ శిశువుకు ఆ విష్ణు చింతన సంక్రమించి, పగ భక్తిగా అతనిలో రూపాంతరం పొందింది. లీలావతి గొప్ప విష్ణుభక్తుడిని కనబోతూన్నది కనుక ఆమెను విడిచిపెట్టి నీ దారిన నువ్వు వెళ్లు!' అని చెప్పి లీలావతిని తన ఆశ్రమానికి తీసుకెళ్లాడు.

ఆశ్రమంలో నారదుడు ఉన్నతమైన వేదాంత విషయాలనూ, విష్ణు దివ్య కల్యాణ గుణగణాలను వర్ణిస్తున్నప్పుడు లీలావతి గర్భంలోని బిడ్డ అమిత ఆసక్తితో వింటూ, ఊఁకొడుతూండే వాడు. లీలావతి కుమారుడిని ప్రసవించింది. హిరణ్యకశిపుడు ఘోరతపస్సుతో బ్రహ్మను మెప్పించాడు. ఏ రకంగానూ చావు లేకుండా వరం పొంది, వర విజయగర్వంతో తిరిగివస్తున్న దానవేంద్రుడు నారదుడి వల్ల జరిగిన వృత్తాంతం విని, కుమారుడికి 'ప్రహ్లాద' అని నామకరణం తరువాత భార్యాబిడ్డలతో రాజ్యానికి చేరాడు. ఇంద్రుడిపై ప్రతీకారంగా స్వర్గంపై దండయాత్ర చేసి, సింహాసనం ఆక్రమించాడు. దిక్కులన్నిటినీ జయించి, అష్ట దిక్పాలకుల్ని తన అదుపాజ్ఞల్లో పెట్టుకున్నాడు. మునుల ఆశ్రమాల్ని తగలబెట్టించాడు. విష్ణు విశ్వాసకుల్ని చిత్రవధ చేయించాడు. దేవతలను పశువుల్ని బాదినట్లుగా బాదాడు. శచీదేవిని అవమానించబోతే లీలావతి అడ్డుకొంది.

విష్ణువును ఎలాగైనా ఎదుర్కోవాలన్న ఏకైక లక్ష్యంతో విష్ణువు పట్ల కవ్వింపు చర్యలకు పాల్పడ్డాడు. వైకుంఠంపై దాడికి వెళ్లగా, అక్కడా విష్ణువు కనపడలేదు. 'నాకు భయపడి దాగున్నాడు. పిరికిపంద!' అని తిరిగివచ్చాడు.

ప్రహ్లాదుడు సదా విష్ణునామ స్మరణతో దినదిన ప్రవర్ధమాన మవుతున్నాడు. కుమారుడి విష్ణుభక్తి నచ్చని తండ్రి 'శత్రువును ఆరాధించే కులద్రోహి ఎందుకు పుట్టాలి?'అని చింతించి, విద్యాబుద్ధులు నేర్పడానికి గురుపుత్రులైన చండామార్కులకు కుమారుడిని అప్పగించాడు. ప్రహ్లాదుడు గురుకులంలో హరి ధ్యానంతోనే చదువంతా పూర్తిచేశాడు. తోటి బాలురను విష్ణుభక్తి పట్ల అనురక్తులను చేశాడు.

గురుకులం నుంచి రాజప్రాసాదానికి చేరిన కుమారుడిని చేరదీసిన హిరణ్యకశిపుడు 'నాయనా! నువ్వు నేర్చినదేమిటో చెప్పు' అని అడిగాడు. 'తండ్రీ! గురువులు చెప్పినదంతా క్షుణ్ణంగా నేర్చాను. విష్ణువునందు మనసు నిలపడమే చదువులన్నిటి కంటె గొప్ప చదువు. ఆయను స్మరించే జన్మే జన్మ!' అని బదులివ్వడంతో, హిరణ్యకశిపుడు తన ఒడిలోని కుమారుడిని చప్పున క్రిందకు తోసి పట్టరాని ఆగ్రహంతో చండామార్కులతో, 'ఇదా మీరు నేర్పిన చదువు?' అని ఆగ్రహించాడు. ఇందులో తమ లోపమేమీ లేదంటూ, గురుకులంలో ప్రహ్లాదుడి తీరును వివరించి తప్పుకున్నారు గురువులు.

'వరాహరూపుడిగా వచ్చి మీ పినతండ్రిని చంపిన విష్ణువును స్మరించడం క్షమించరాని కులద్రోహం. ఈ క్షణమే అతనిని మరచి పో...' అని హిరణ్యకశిపుడు కుమారుడు ప్రహ్లాదుడిని ఆజ్ఞాపించాడు.

అతను ధనవంతుడు. బోలెడంత సంపద. దాంతో అతను బంధువులందరినీ కాదని కొందరు నౌకర్లతో ఉల్లాసంగా ఉంటున్నాడు.

ఏం కావాలన్నా పనివాళ్ళున్నారనే ధీమాతో ఉన్నాడు.

ఓ రోజు ఓ జ్ఞాని అనుకోకుండా ఆయన వద్దకు వచ్చాడు.

ధనికుడు సకల మర్యాదలతో ఆహ్వానించాడు.

జ్ఞాని 'ఏరీ నీ భార్యా పిల్లలూ? ఇక్కడి వాతావరణం చూస్తుంటే బంధువులెవరూ కూడా వచ్చిపోతున్నట్లనిపించడం లేదు? నీ బంధువులందరూ ఏమయ్యారు? ఎంతసేపూ నౌకర్లే కనిపిస్తున్నారు?' అని అడిగాడు. దానికి ధనికుడు...

'నాకు బోలెడంత డబ్బు ఉంది. ఏం కావాలన్నా చేసిపెట్టడానికి నౌకర్లున్నారు. గుమ్మం దాటక్కర్లేదు. అటువంటప్పుడు భార్యాబిడ్డల అవసరమేముంది? బంధువులెవరూ రాకున్నా నష్టం లేదు. నాకు వాళ్ళెవరితోనూ ఏ అవసరమూ లేదు' అని బదులిచ్చాడు.

'ఓహో. అలాగా' అంటూ జ్ఞాని, కాస్సేపు నాతో అలా వస్తావా? అటూ ఇటూ తిరిగొద్దాం" అంటాడు జ్ఞాని.

దోర్బల పూర్ణిమాస్వాతి

'దానవేశ్వరుడవైన నీవు అన్నివిధాలా నన్ను శాసింపతగినవాడివే! కాని ఇనుప ముక్క అయస్కాంతాన్ని ఆకర్షించినట్లుగా నా మనస్సు విష్ణువుపై లగ్నమై ఉన్నది. మందార పువ్వులోని మకరందాన్ని తుమ్మెద విడిచి పెట్టలేనట్లే ఆయనను మరవడం నా వశంలో లేదు. నాలో జీవము ఉన్నంత వరకూ విష్ణుచింతన పోదు. ఆ జీవము కూడా విష్ణువే' అని వినయంగా బదులిచ్చాడు ప్రహ్లాదుడు

ముక్కుపచ్చలారని బాలుడి మాటలకు విస్తుపోతూ, అగ్నిలా ప్రజ్వరిల్లి, 'అయితే నీవు చావక తప్పదు, ఆహారపానాలు లేకుండా మలమల మాడి చావు!' అంటూ ప్రహ్లాదుడిని వెలుతురు చొరబడని కారాగారంలో పెట్టించాడు. పుత్రప్రేమతో లీలావతి తల్లడిల్లి పోయింది.

రోజులు గడుస్తున్నాయి. లీలావతి శోకం చూడలేక కుమారుడిని చెర నుంచి విడిపించిన హిరణ్యకశిపుడు, తన్మయుడై విష్ణు సంకీర్తన చేస్తూ నవనవలాడుతున్న ప్రహ్లాదుడిని చూసి, 'చాలా రోజులుగా అన్నపానాలు లేకపోయినా ఎలా జీవించి ఉన్నాడా!' అని ఆశ్చర్యపడుతూనే, పట్టరాని ఆగ్రహంతో కుమారుడుని ఏనుగులచేత మట్టించమన్నాడు.

ప్రహ్లాదుడిని చూడగానే ఏనుగులు సింహాన్ని చూసినట్లు బెదిరాయి. పాములచేత కరిపించబోతే ముద్దాడి, పడగలు విప్పి గొడుగులుపట్టి ఆడాయి. కొండశిఖరం నుంచి తోయించాడు, మంటల్లో వేయించాడు, సముద్రంలో పడవేయించాడు, కాలకూట విషం త్రాగించాడు. ఎన్ని చేసినా, ప్రహ్లాదుడు సురక్షతంగా ఉండటం చూసి, హిరణ్యకశిపుడు, 'ఇంత చేసినా నిన్ను మృత్యువు సమీపించకపోవడానికి వెనక ఆ రహస్యమేమిటో చెప్పు!' అని అడిగాడు.

ప్రహ్లాదుడు నవ్వుతూ, 'ఇందులో రహస్యం ఏదీలేదు. ఏనుగుల్లో, పాముల్లో, రాళ్లలో, అగ్నిలో, సముద్రాల్లో, విషంలో అన్నిట్లో, నీలో, నాలో ఉన్నది విష్ణువే అన్న సత్యాన్ని తెలుసుకోలేకపోతున్నావు! నన్ను చంపాలనుకుంటున్నదీ, నేను బతుకుతూన్నదీ అతని లీలావినోదం వల్లనే' అని బదులు ఇచ్చాడు. ఆ మాటలకు హిరణ్యకశిపుడు కోపావేశంతో, 'కులద్రోహీ! నా తమ్ముడిని చంపిన విష్ణువును నీ ముందే హతమార్చి పగ తీర్చుకుంటాను' అంటూ సభామండపానికి ఎదురుగా గల లోహ స్తంభం చూపుతూ,'నీ విష్ణువు ఇందులో ఉన్నాడా? అని అడిగాడు. 'ఆ సందేహమే వద్దు తండ్రీ! అంతటా ఉన్నాడు, అందులోనూ ఉన్నాడు' అని బదులిచ్చాడు ప్రహ్లాదుడు.

హిరణ్యకశిపుడు చరచరా వెళ్లి గదతో స్తంభాన్ని కొట్టాడు.

ప్రళయధ్వనితో భూన భోంతరాలు దద్దరిల్లాయి, పొగల మేఘాలు అంతటా విరజిమ్ముకున్నాయి. స్తంభం రెండుగా చీలిపోతూండగా మిరుమిట్లుగొలిపే మెరుపుల మధ్య సింహం తల, మనిషి శరీరం, చేతులకు సింహం గోళ్ళతో అద్భుత, విచిత్ర రూపంలో నరసింహామూర్తిగా (దశావతారాల్లో నాలుగవది) విష్ణువు ఆవిర్భవించాడు. ప్రళయభీకరంగా గర్జించాడు. పాంచజన్య శంఖధ్వని వినిపించింది. సుదర్శనచక్రం అతని చుట్టూ తిరుగుతూ కనిపించింది.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడిని ఆలింగనం చేసుకొని, 'ప్రహ్లాదా! నీ మూలంగా ఇన్నాళ్ళకు విష్ణువుపై పగతీర్చుకొనే అవకాశం లభించింది!' అంటూ గద ఎత్తి నృసింహరూపుడిపై పోరాటానికి తలపడ్డాడు. నరసింహుడు ప్రళయగర్జనతో హిరణ్య కశిపుడిని ఒడిసిపట్టుకొని సభామండప ద్వారం మధ్యకు తీసుకువెళ్లాడు. హిరణ్యకశిపుడు బ్రహ్మ నుంచి పొందిన వరాలకు భిన్నంగా, 'లోపలా, వెలుపలా కాని ద్వారం అరుగుమీద? రాత్రీ, పగలూ కాని సంధ్యాసమయంలో; ఆకాశమూ, భూమీ కాని తన తొడల మీద పెట్టుకొని, సజీవ, నిర్జీవాలుకాని కాని గోళ్లతో, విష్ణువు నరసింహరూపంలో రాక్షసరాజు రొమ్మునూ, పొట్టనూ భీకరంగా చీల్చి చంపాడు. నరసింహుడిని సమూహంగా ఎదుర్కోవడానికి వచ్చిని రాక్షస సమూహాన్ని సుదర్శనం అంతం చేసింది.

ఉగ్ర నృసింహుడిని దేవతలు, ప్రహ్లాదుడు శాంతింప చేశారు. ప్రహ్లాదుడితో తండ్రికి ఉత్తర క్రియలు జరిపించి, రాజ్యపాలన చేయవలసిందని చెప్పి ప్రహ్లాదుడిని దీవించి, నరసింహావతారుడైన విష్ణువు అంతర్ధానమయ్యాడు. ★




❈ **తాత్వికత** ❈

# నీడనివ్వని నీ నీడ

'సరే' అంటూనే ఎండలో రమ్మంటాడేమిటీ అని మనసులో అనుకుంటాడు. కానీ రాలేనని చెప్పడం ఇష్టంలేక అన్యమనస్కంగానే బయలుదేరుతాడు జ్ఞాని వెంట ధనికుడు. కొంచెం దూరం వెళ్ళేసరికే ఎండకు తట్టుకోలేక నీడకోసం చుట్టూ చూస్తాడు.

అది తెలిసి జ్ఞాని ఏమీ ఎరగనట్టే 'ఎవరికోసం చూస్తున్నావు? నీకెవరి తోడూ అక్కర్లేదన్నావుగా? నీకేం కావాలన్నా చేసి పెట్టడానికి నౌకర్లు ఉన్నారుగా. అయినా నీ నీడే నీకుందిగా. అందులో సేదదీరవచ్చుగా?' అన్నాడు.

'అదెలా కుదురుతుంది స్వామీ? నా నీడ నాకెలా నీడిస్తుంది?' అని ప్రశ్నిస్తూనే తన తప్పుని తెలుసుకుని తలదించుకుంటాడు. అందుకే 'డబ్బులెంత వరకు ఉపయోగపడతాయో తెలుసుకోవాలి' అని అంటారు అనుభవజ్ఞులు. చుట్టాలూ, పక్కాలూ స్నేహితులూ అంటూ బంధాలన్నీ పరస్పర తోడునీడల కోసం అవసరమే. ఒంటికన్ను రాకాసిలా నాకెవరి తోడూ అవసరం లేదనుకునే బతుకు బతుకే కాదు. ఈ లోకంలో ఉన్నప్పుడే కాదు, పోయేటప్పుడూ నలుగురి అవసరం ఉందనే వాస్తవం గుర్తెరిగి నడచుకోవాలి.




ఉపక్రమణిక

**అత్యంత విస్తృతమైన అరణ్యం. ఆ అరణ్యంలో ఎక్కువ భాగం పత్తి చెట్లు. విచ్ఛేదశూన్యం, ఛిద్రశూన్యం అయిన ఆ అరణ్యంలో కాలిదారి అనేదే లేకుండా ఉంది. కొన్నిచోట్ల ఒక చెట్టు ఇంకొక చెట్టుతో ఒరుసుకుని వేడుకగా ముచ్చటలాడుకుంటున్నట్టు ఉన్నాయి. పశుపక్ష్యాదుల సవ్వడి తప్ప అక్కడ యింకే విధమయిన చప్పుడు వినిపించదు.**

అది విస్తృతమయిన అగమ్యమయిన అంధకారమయమయిన అరణ్యం. పట్టపగలే ఎండ పొడ పడదు. ఇప్పుడేమో రాత్రి సమయం. అర్ధరాత్రి. చీకటి దట్టంగా అలముకుంది. భూగర్భంలో ఎటువంటి చీకటి అలుముకుని ఉంటుందో అడవిలో అలాగే ఉంది. అరణ్యానికి బయటకూడా చీకటితెరలు వ్యాపించి ఉన్నాయి. కంటికి ఏమీ అగుపించడంలేదు. అరణ్యంలోపల భయంకరమైన అంధకారం!

పశుపక్ష్యాదులన్నీ నిస్తబ్దంగా ఉన్నాయి. అఖిల ప్రాణజాతమూ పెను నిద్రావస్థలో కూరుకొనిపోయాయి. ఈ అనంత శూన్యారణ్యంలో అంధకారం అంటే ఏమిటో బాగా తెలిసి వస్తుంది. భయానకమయిన నిస్తబ్దతను భేదిస్తూ ఈ ధ్వని వినవచ్చింది. 'నా మనోరథం ఎప్పటికైనా నెరవేరుతుందా?"

ఈ విధంగా మూడు పర్యాయాలు నిస్తబ్ద అంధకారం నుండి చొచ్చుకొని వచ్చి ఈ ప్రశ్న వినిపించింది.

'అది సరే! నీ గాఢమైన మనోవాంఛ తీరడానికి నీవు ఏమి సమర్పించగలవు? ఏమిటి నీ నిశ్చయం?"

జవాబు: 'నా తనువునే ఇవ్వగలను. జీవసర్వస్వం... ప్రాణ సమర్పణే చేయగలను!"

ప్రతిశబ్దం : 'జీవనం తుచ్ఛమయినది. అందరూ దానిని త్యాగం చేయగలరు.'

'అయితే ఇంకా ఏముంది? ఏమున్నది? నేనేమి ఇవ్వగలను? అంతకన్నా నా దగ్గర మరేముంది?"

జవాబువచ్చింది: 'భక్తి! సడలని భక్తి. ఆరాధన. నా నేస్తమా! నీకుండవలసినది అంకిత భక్తి' అని పై నుంచి అతడికి నిశ్చల గంభీర స్వరం ఒకటి వినిపించింది.

### ప్రథమ భాగము

**1**

వంగ సంవత్సరం 1176 (క్రీస్తుశకం 1769). వేసవికాలంలో ఒక రోజు. పదచిహ్నా అనే పేరుగల ఆ ఊళ్లో ఎండవేడిమి దుస్సహంగా ఉంది. ఎప్పుడూ చూడలేదు అనే విధంగా ఉంది ఎండ. గ్రామంలో అనేక ఇళ్లు ఉన్నాయి. అయితే మనుషులు ఎవరూ అగుపించడం లేదు. పెద్ద బజారులో గొప్ప గొప్ప దుకాణాలు, రకరకాలయిన కొట్లు, చిన్న సందుల్లో మట్టి ఇళ్లు, మహాభవంతులు ఇలా అనేకం ఉన్నాయి. అయితే ఈరోజు అంతా నిర్మానుష్యంగా ఉంది. దుకాణదారు అక్కడనుండి ఎలా పారిపోయాడో ఎవరికీ తెలియకుండా ఉంది. ఈరోజు బజారంతా ఎంతో కళకళలాడుతూ, బేరసారాలతో సంతలా ఉండవలసిన రోజు. అయితే ఎందుచేతనో శూన్యంగా ఉండిపోయింది. భిక్ష జరగవలసిన రోజు. కాని భిక్షకులు ఎవరూ అగుపించటం లేదు. సాలెవాళ్లు తమ మగ్గాలను కట్టి పెట్టి ఇళ్లలో ఏడుస్తూ కూర్చున్నారు. వ్యవసాయదారులు తమ వ్యవసాయం మరచిపోయి, పిల్లలను ఒళ్లో పడుకోబెట్టుకుని విహ్వలులై ఉన్నారు. దాతలు తమ దానధర్మాలు మానివేశారు. ఉపాధ్యాయులు బడిని మూసి వేశారు. బహుశా పిల్లలు సైతం ఏడుపు మానివేసి ఉంటారు. ఎంత భయానక పరిస్థితులు వచ్చి పడ్డాయంటే శిశువులు ఏడవడానికి కూడా జడుసుకునే పరిస్థితి. ఉలికిపడే పరిస్థితులు అక్కడ కనిపిస్తున్నాయి. రాజపథంలో ఇప్పుడు ప్రయాణికులు ఎవరూ నడవడం లేదు. వీథులన్నీ బావురుమంటున్నాయి. సరోవరాల దగ్గర స్నానార్థం కూడా ఎవరూ గుమిగూడడం లేదు. ఇంటి గుమ్మాల ముందు సైతం ఎవరూ కనిపించడం లేదు. చెట్లపైన పక్షులు కూడా కనిపించడంలేదు. అంతా స్మశానం మోస్తరుగా ఉంది.

ఒక పెద్ద భవనము కనిపిస్తోంది. ఆ భవనశీర్షం

గగనాన్ని చుంబిస్తున్నట్లుగా ఉంది. చాలా దూరం నుంచే ఆ ఇంటిని చూడగలం. అరణ్య ప్రాంతంలో శైల శిఖరంలాగ అగుపిస్తోంది. కాని దాని తలుపులు మూసి ఉన్నాయి. ఎవరూ వచ్చి వెదుతున్న అలికిడి కూడా వినిపించడం లేదు. గాలి కూడా లోపలికి దూరలేదేమో అనిపిస్తోంది.

ఆ ఇంట్లో ఇప్పుడు భార్యాభర్తలు గాఢోద్విగ్నమైన మనసులతో, ఆలోచనలతో ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు. రాత్రి అంధకారంలో ఆ భవనంలో ఒక గదిలో అప్పుడే వికసించిన పుష్పాలవలె ఆ దంపతులు కూర్చుని ఆలోచన చేస్తున్నారు. వారి ఎదుట కరవు భీతి వికటాట్టహాసం చేస్తున్నట్లు ఉంది.ఆ ఇంటి యజమాని మహేంద్ర సింగ్, ఆయన భార్య ఒకరినొకరు పలకరించుకునే ధైర్యం కూడా కోల్పోయి ఆలోచనలలో మునిగిపోయారు.

1174లో (క్రీ.శ.1767) పంటలు ఏమాత్రం బాగా పండలేదు. అందువల్ల 1175లో (క్రీ.శ. 1768) కరవు వచ్చింది. భారతవాసి కష్టంలో పడిపోయాడు. కాని నవాబులు మాత్రం తమకు రావలసిన పన్నులను పైసలతో సహా వసూలు చేస్తున్నారు. దరిద్రంతో తల్లడిల్లిపోతున్న ప్రజలు రోజుకు ఒక పూట మాత్రమే భోజనం చేస్తున్నారు. పైసలు కూడబెట్టి పన్నులు బకాయి లేకుండా చూచుకున్నారు.

మరు సంవత్సరం సకాలంలో వర్షాలు పడినాయి. రైతులు చాల ఆనందించారు. పంటలు బాగా పండుతాయని ఆశించారు. దేవతలు ప్రసన్నులయినారని సంతోషించారు. గ్రామాలలోని మఠాలలో, మందిరాలలో గానా బజానా తిరిగి ప్రారంభం అయింది. స్త్రీలు తమకు నగలు చేయించవలసిందిగా భర్తలతో తగువులాడుతున్నారు. అంతా ఆనందమయంగా ఉండగా, హటాత్తుగా ఆశ్వీయుజ మాసంలో దేవతలు తిరిగి విముఖులు అయినారు. ఆశ్వీయుజం, కార్తీక మాసాలలో ఒక్క నీటి బొట్టు అయినా ఆకాశం నుండి రాలలేదు పొలాలలో వరి ఎండి గడ్డి అయిపోయింది. వర్షం లేకపోవడంవల్ల కంకి వేయలేదు. ఒకటి రెండు చోట్ల కొద్దిగా ధాన్యం పండింది. కాని దానిని తమ సైన్యం కోసం రాజుగారు కొనివేశారు. అందువల్ల జనానికి భోజన ప్రాప్తి లేకుండాపోయింది. ముందు ఒక పూట పస్తు ఉండడం ఆరంభించారు. ఒక్కొక్కసారి ఈ పూట అయినా అర్ధాకలితోనే లేచిపోవలసి వచ్చేది. తరువాత ప్రతిరోజూ ఉపవాసమే అయిపోయేది. చైత్ర మాసంలోని పంట నోటి దగ్గరకు వస్తూనే మాయం




అయిపోయింది. అయితే పన్నులు వసూలు చేసే అధికారి మహమ్మద్ రజాకాన్ మటుకు తన ధనార్జనకు ఇదే తగిన సమయమని ఆనందించాడు. పన్నును ఒక్కమారుగా పదిశాతం పెంచివేశాడు. వంగ దేశంలో ఇంటింటా ఆర్తనాదాలు వినిపించ సాగినాయి.

మొదట ప్రజలు భిక్షుకవృత్తి ఆరంభించారు. కాని బిచ్చంగూడా దొరక్కుండాపోయింది. అప్పుడు ఉపవాసాలు ఆరంభించారు. ఆపైన వారికి రోగాలు రాసాగినాయి. వ్యవసాయపు పరికరాలైన నాగళ్లు, వక్కులు, తాళ్లు వేళ్లు అమ్ముకున్నారు. విత్తనాలకోసం అట్టిపెట్టుకున్న ధాన్యం అమ్ముకున్నారు.



ఇళ్లు వాకిళ్లు అమ్ముకున్నారు. పొలాలు అమ్ము కున్నారు. దీని తరువాత ప్రజలు పిల్లలను అమ్ము కోవడం కూడా ఆరంభించారు.

పిల్లలు అయిపోయిన తరువాత గృహలక్ష్మిని అమ్మసాగారు. ఆపైన బాలబాలికలను భార్యలను అమ్ముతామంటే మాత్రం కొనేవారు ఎవరున్నారు? అందరూ అమ్ముతాము అనేవారే. కాని కొనేవారు ఎక్కడ ఉన్నారు? ఆకలి బాధకు తట్టుకోలేక ప్రజలు – ఆకులు అలములు తిని కడుపు నింపుకోసాగారు. అట్టడుగు జాతులకు చెందినవారు కుక్కలను, పిల్లులను, ఎలుకలను చంపి తినసాగారు. ఈ దేశం వదలి పారిపోయినవారు విదేశాలలో అన్నాహారాలు లేక మరణించారు. పారిపోకుండా ఇక్కడే ఉన్నవారు అయినవీ కానివీ తిని రోగాలు తెచ్చుకుని ఇక్కడే చనిపోయారు.

రోగాలు బాగా విస్తరించడానికి ఇదే సమయం. జ్వరము, మసూచికము, క్షయ, కలరా ఇటువంటి అంటువ్యాధులు బాగా వ్యాపించాయి. మసూచి జ్వరము బాగా వ్యాపించింది. ఇంటింటా మహ మ్మారికి గురియై ప్రజలు చనిపోతున్నారు. వీళ్లందరికీ ఎవరు సేవలు చేస్తారు? నీళ్లూ పాలూ ఎవరు ఇస్తారు? చికిత్స లేదు, ఆలన పాలన లేదు. చనిపోతే శవాలను కూడా ఎవరూ ఎత్తివేయడంలేదు. అతి రమణీయము, మనోహరము అయిన ఇళ్లు వాకిళ్లు ఇటువంటి మరణాలతో నిండిపోతున్నాయి. ఇంటిలో ఎవరికైనా మసూచికం అంటుకున్నదీ అంటే, మిగిలినవారు ఆ ఇంటిని వదిలి పోతున్నారు.

పదచిహ్న గ్రామంలో మహేంద్రసింహుడు గణ నీయమయిన వ్యక్తి. అతడు చాల ఐశ్వర్యవంతుడు. అయినా ఈ కరవు మూలంగా బీదవారు, భాగ్య వంతులు ఒకటే అయిపోయారు. ఈ సమయంలో రోగగ్రస్తులై అతని ఆత్మబంధువులు, స్వజనం, నౌకర్లు చాకర్లు అందరూ వెళ్లిపోయారు. చనిపోయినవారు చనిపోయారు. మిగిలినవారు పారిపోయారు. ఇప్పు డిక ఆయన భార్య, బిడ్డ మాత్రం మిగిలి ఉన్నారు.

ఆయన భార్య కల్యాణి ఆలోచనలు కొద్దిసేపు పక్కకు నెట్టి గోశాలకు వెళ్లింది. ఆవుపాలు తీసుకు వచ్చింది. తానే స్వయంగా పితుక్కు వచ్చింది.

పాలు వెచ్చ చేసి అమ్మాయి చేత తాగించింది. ఆవుకు మేతవేసి వచ్చింది. ఆమె వచ్చి కూర్చున్న తరువాత మహేంద్రుడు "ఇక ఎన్నాళ్లు సాగుతుంది?" అన్నాడు.

"ఎన్నో రోజులు గడవదు. ఎన్నాళ్లు గడుస్తుందో అన్నాళ్లూ గడుపుదాం. ఆ తరువాత మీరు అమ్మాయిని తీసుకుని పట్టణం వెళ్లిపొండి." –

"పట్టణానికి వెళ్లడం తప్పనిసరే అయితే, ఇప్పుడు ఇక్కడ ఇలా కష్టపడడం ఎందుకు? ఇప్పుడే వెళ్లి పోవచ్చును కదా!" అన్నాడు మహేంద్రుడు. దీని తరువాత ఇద్దరూ ఈ విషయమై చాలా సేపు సమాలోచించుకున్నారు.

"పట్టణానికి వెళ్లినందువల్ల విశేషలాభం ఏదయినా ఉంటుందా?" అని అడిగింది కల్యాణి.

"ఆ ప్రదేశం కూడా ఇలాగే జనశూన్యం అయిపోతుంది. ప్రాణ రక్షణోపాయం కూడా ఉండదనుకుంటాను."

"మూర్షిదాబాద్, ఖాసింబజార్, కలకత్తా ఏదో నగరానికి వెళ్లి ప్రాణాలు కాపాడుకుందాం. ఏమయినా, త్వరగా ఈ గ్రామం వదలి వెళ్లడమే ఉచితమని తోస్తోంది."

"మన పూర్వీకులు సంపాదించిన డబ్బంతా ఈ ఇంటి నిండా మూలుగుతోంది. మనం వెళ్లిపోతే దీనిని దొంగలు దోచుకుంటారు."

"ఇప్పుడు దొంగలు దోచుకుందుకు వచ్చినా మనం అడ్డుపడగలమా ఏమిటి? ఒక ప్రక్క ప్రాణాలు పోతూ ఉంటే, ఈ భోగభాగ్యాలను గురించి ఆలోచన

> **పిల్లలు అయిపోయిన తరువాత గృహలక్ష్మిని అమ్మసాగారు. ఆపైన బాలబాలికలను భార్యలను అమ్ముతామంటే మాత్రం కొనేవారు ఎవరున్నారు? అందరూ అమ్ముతాము అనేవారే. కాని కొనేవారు ఎక్కడ ఉన్నారు? ఆకలి బాధకు తట్టుకోలేక ప్రజలు – ఆకులు అలములు తిని కడుపు నింపుకోసాగారు. అట్టడుగు జాతులకు చెందినవారు కుక్కలను, పిల్లులను, ఎలుకలను చంపి తినసాగారు.**

ఎందుకు? తలుపులన్నీ మూసి వెడదాం. బతికి బాగుంటే, తరువాత వచ్చి అనుభవించవచ్చును" అంది కల్యాణి.

"నీవు నడవగలవా? బోయీలంతా చనిపో యారు. ఎద్దు ఉన్నాయిగాని బండిలేదు. బండి ఉంటే బండివాడు లేడు. ఎలా ప్రయాణం చేయడం?"

"విచారించకండి. నేను కాలినడకనే వస్తాను."

కల్యాణి మనసులో ఒక నిశ్చయానికి వచ్చింది. అదేమిటంటే మార్గమధ్యంలో తాను నడవలేక చనిపోయినా బిడ్డా, భర్తా క్షేమంగా ముందుకు వెళ్లగలుగుతారు. రెండవరోజు ఉదయం కూడా కొంత డబ్బు తీసుకుని పశువులన్నిటినీ విప్పివేసి, అన్ని తలుపులకు తాళాలు వేసి, పిల్లను చంకన వేసుకుని ఇద్దరూ రాజధాని వైపు ప్రయాణం సాగించారు. మహేంద్రుడు "దారి చాల కంటక ప్రాయంగా ఉంటుంది. అడుగడుగునా దొంగల భయం. ఉత్తచేతితో వెళ్లడం మంచిదికాదు" అంటూ తిరిగి ఇంటికి వెళ్లి తుపాకి, తూటాలు తీసుకు వచ్చాడు. వాటిని చూచి కల్యాణి "సమయానికి గుర్తుచేశారు. నేను కూడా రక్షణాస్త్రం తెచ్చు కుంటాను. కాస్త సుకుమారిని ఎత్తుకోండి" అని ఇంటిలోనికి వెళ్లింది. "నీవేం అస్త్రం తెస్తావు?" అడిగాడు మహేంద్రుడు.

కల్యాణి ఇంటిలోనికి వెళ్లి విషం ఉన్న డబ్బాను తన కొంగుకు ముడి వేసుకుని ఇవతలకు వచ్చింది. దుఃఖదినాలలో ఎటువంటి ఆపదలు వస్తాయో ముందు ఊహించలేం. ఈ ఆలోచనతోనే కల్యాణి విషం సేకరించి చిన్న డబ్బాలో జాగ్రత్త చేసుకుంది.

జ్యేష్టమాసం అవడంచేత భూమి అగ్నిగోళంలా మండిపోతోంది. గాలి వెంటే నిప్పు సెగలు వ్యాపిస్తు న్నాయి. ఆకాశం కాలిన రాగిపళ్లెం లాగ వేడిమిని ప్రసారం చేస్తోంది. కల్యాణి శరీరం నుండి చెమట ధారలుగా కారుతోంది. ఆమె అడపా దడపా చెట్ల నీడల కింద కూర్చుని సేద తీర్చుకుంటూ అలాగే ఆయాసంతో నడక సాగిస్తోంది. చెరువులలో దొరికిన మురికి నీరే తాగి దప్పిక తీర్చుకుంటోంది. అమ్మా యిని మహేంద్రుడు ఎత్తుకున్నాడు. అప్పుడప్పుడు మహేంద్రుడు భార్యకు సపర్యలు చేస్తున్నాడు. కల్యాణి ఇంత శ్రమకు ఓర్చుకుని ఈ విధంగా ప్రయాణం చేస్తూ ఉండడం మహేంద్రుడికి ఆశ్చర్యం కలిగి స్తోంది. దగ్గరలో ఉన్న ఒక జలాశయం దగ్గర అంగవస్త్రం తడుపుకు వచ్చి అమ్మాయికి, భార్యకు కాళ్లు చేతులు, ముఖం తుడిచాడు మహేంద్రుడు.

ఈ సపర్యల వల్ల కల్యాణికి కొంతవరకు సేద తీరింది. కాని ఆకలి బాధ ఎక్కువ అవసాగింది. వారిద్దరూ ఎలాగో ఆకలి బాధను అణచుకోగలుగు తున్నారుగాని, అమ్మాయి సంగతి ఏమిటి? వారు తిరిగి నడక ప్రారంభించారు. ఆ అగ్ని తరంగాలను దాటుకుంటూ వెళ్లి సంధ్యాసమయం కాకముందే ఒక బస్తీకి చేరుకున్నారు. బస్తీ చేరుకోవడంతోటే మహేంద్రునకు చాల తృప్తి కలిగినట్టయింది. ఇక్కడ తన భార్యకు, కుమార్తెకు భోజనాదికాలు, విశ్రాంతి లభిస్తాయని అతడి ఆశ. కాని ఈ ఆశ అంతరించటా నికి ఎక్కువసేపు పట్టలేదు. అటు ఇటు పరికించి చూచాడు మహేంద్రుడు. ఎవరూ మానవమాత్రులు అగుపించడంలేదు. ఎక్కడా సంచారమే కరవైపో యింది. పెద్ద పెద్ద ఇళ్లూ, భవంతులూ, మేడలు– అన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. అందరూ పట్టణం నుంచి పారిపోయారన్నమాట! మహేంద్రుడు తన భార్యను, కుమార్తెను ఒక ఇంటిలోనికి తీసుకువెళ్లాడు. వారిని లోన కూర్చుండజేసి, ఆ ఇంటిలో ఎవరైనా పలుకుతారేమోనని పిలిచాడు. బదులులేదు. తరు వాత కల్యాణితో "కొద్దిసేపు ధైర్యంగా ఇక్కడే కూర్చో. నేను బయటకు వెళ్లి కాసిని పాలు దొరుకుతాయేమో చూచి తీసుకువస్తాను" అని మహేంద్రుడు మట్టిపాత్ర తీసుకుని బయటకు వెళ్లాడు.

(సశేషం)

ప్రత్యేక వ్యాసం

విశ్వజిత్ యాగంతో త్రిలోకాధిపత్యం సాధించి చెలరేగి పోతున్న బలి చక్రవర్తిని కట్టడి చేయడానికి అదితి కశ్యప దంపతులకు శ్రీ మహావిష్ణువు పుత్రుడిగా ఉదయించాడు. ఎన్నో సుగుణాలను ఒక దుర్గుణం అతిక్రమిస్తుందనేం దుకు కూడా వామనావతార ఆవిర్భావ కారణాన్ని ఉదాహరణగా చెబుతారు. బలి పాలన సుభిక్షమైనదని, సకాలంలో వానలు కురిసి ధనధాన్యాలు సమృద్ధిగా ఉండేవని, అన్ని వర్గాల వారు సుఖ శాంతులతో జీవించే వారని శ్రీమద్భాగవతం చెబుతోంది. దాతృత్వం, ఇచ్చిన మాట కోసం గురువు శాపాన్ని భరించి జీవితాన్ని త్యాగం చేయడం లాంటి సత్ ప్రవర్తకుడి వినాశనానికి శ్రీహరి అంశ వటువుగా రావడానికి బలీయకారణం ఉందని ఆధ్యాత్మికవాదులు చెబుతారు. దైత్యుల బలం సన్నగిల్లి తన పుత్రులు దేవతల బలం పెరగాలని అదితి చేసిన అభ్యర్థనతో బలి గర్వభంగానికి శ్రీమన్నారాయణుడు వామనుడిగా అవతరించాడు. బలి తన తాత ప్రహ్లాదుడి విష్ణుభక్తి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్నప్పటికీ సాత్విక అహంకారాన్ని వీడలేకపోయాడు. దానిని రూపు మాపడమే ఈ అవతార పరమార్థం. దానిని అటుంచితే, వామనుడి సందేశంలో, బలి-వామనుల సంభాషణలో మానవళికి ఉపకరించే ఎన్నో అంశాలు కనిపిస్తాయి.




# సంతృప్తి సందేశం ‘వామన’త్వం

బలి చక్రవర్తి మంచి పాలకుడు, మహాదాత. అయినా అధికార వ్యామోహాన్ని జయించ లేక పోయాడు. ఇంద్రపదవి ఆర్జనతో అహం పెరిగింది. అమరావతిని వశపరచుకున్నాడు. దేవతలు భయకంపితులై అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దేవ, రుషిగణాల వినతిపై, పరిస్థితిని చక్కదిద్దేందుకు శ్రీమన్నారాయణుడికి మరో అవతారం అనివార్య మైంది. అదితి కశ్యప దంపతులకు భాద్రపద శుద్ధ ద్వాదశి నాడు వామనుడుగా జన్మించాడు. ఉప నయన వయస్కుడిగానే అవతరించాడు. కశ్యపుడు ముంజి (మొలతాడు), దేవగురువు బృహస్పతి యజ్ఞోపవీతం, భూదేవి జింకచర్మం, సరస్వతి జప మాల, కుబేరుడు భిక్షాపాత్ర ప్రసాదించగా, సాక్షాత్ గాయత్రీ మాత తన మంత్రాన్ని ఉపదేశించింది.

బలికి బలం, బలహీనత ‘దాన’గుణమేనని చెబు తారు. శ్రీహరి తన కార్యసాధనకు చతుర్విధోపాయాల లోని రెండవది ‘దాన’ గుణాన్ని ఎంచుకున్నాడు. బలి అశ్వమేధ యాగం చేస్తున్న నర్మద నదీతీరంలోని ‘భృగుకచ్ఛం’అనే ప్రదేశానికి చేరాడు. చక్రవర్తి ఆ వటువును సాదరంగా ఆహ్వానించాడు. వామనుడు ఆయనను సమీపిస్తూనే, ‘స్వస్తి జగత్రయీ భువన శాసన కర్తకు...’ అనే ఆశీర్వచనంలో ‘ముల్లోకాలను శాసించగల నీకు మంగళం’ అంటూనే, ‘ఆ శాస నానికి, నీకూ ఇక చెల్లు (స్వస్తి) చీటీ’ అనే అంతరార్థం స్ఫురిస్తుంది. అతిథి మర్యాదల అనంతరం బలి,‘ఏమి కావాలో’ కోరుకోమన్నాడు. మణులు, మాణిక్యాలు, రాజ్యం.. ఇలా అనేకానేకాలు ఇవ్వజూపాడు. దానికి ఆ వటువు ‘వరదాతలలో పుంగవుడివైన నీ నుంచి ‘ఈషణ్మాత్రం’ (కొంచెం) భూమిని, అదీ మూడడ గులు కోరుతున్నాను’ అని బదులివ్వడంతో బలి ఆశ్చర్యపోయాడు. ‘ఏదైనా, ఎంతైనా ఇవ్వగల నా దగ్గర ఇంత అల్పమైన కోరికా? గ్రహీత దాత స్థాయి నైనా పరిగణించాలి కదా?’ అనడంలో సాత్వికాహం కారం ధ్వనించింది. విప్రవటుడు మాత్రం తన మాట మీదే నిలిచాడు. తృప్తికి మించిన సంపదలేదు. ‘సంతుష్టుడీ మూడు జగముల బూజ్యుండు, సంతోషికెప్పుడు జరుగు సుఖము’. కానీ ఆ తృప్తే మనిషిలో కరవవుతోంది ‘ప్రాప్తంబగు లేశమైన బదివేలనుచున్ ద్రుప్తిం జెందని మనుజుడు సప్తద్వీప ములనైనన్ ‌జక్కంబడునే’... (ప్రాప్తం కొద్దీ దక్కిన దానితో తృప్తిపడని వాడు ఏడు ద్వీపాలలోని భూమిని ఇచ్చినా తృప్తి పడలేడు) అని అన్నాడు.. ఎన్ని సంపదలు పోగుపడినా తృప్తి కలగదు. భూమండ లాన్ని ఏలిన మహారాజులు, చక్రవర్తులలో అత్యధి కులు అసంతృప్తితోనే దాటిపోయారు. కోరికలు అనంతం. అయితే మనిషికి దక్కవలసినంతే దక్కు తుంది. అత్యాశ అనర్థ హేతువు. అసంతృప్తి సుఖాన్ని చెరిపేస్తుంది. దుఃఖానికి హేతువు అవుతుంది. సంపదలు అశాశ్వతం. ‘నీవు చక్రవర్తివి. అందునా మహాదాతవు కనుక ఏది కోరినా ఇవ్వగలవు. కానీ అర్థికి పరిమితులు ఉంటాయి. దాత స్థాయిని బట్టి కాకుండ గ్రహీత తనకు అవసరమైనదే అడిగి పుచ్చు కోవాలి. నాకు మూడడుగుల నేలనే ఇవ్వు. నేను కోరింది నీ దృష్టిలో పరమాణువు కావచ్చు. నాకు అనంత సంపద. లోకంలో ఎవరూ శాశ్వతంకారు, ఏవీ శాశ్వతం కావు. సిరిసంపదల రాకపోకలు దైవయోగాన్ని బట్టే ఉంటాయి. అవన్నీ సొంతం,

శాశ్వతం అనుకుంటే పొరపాటే. ఎందరో రాజులు, చక్రవర్తులు పుట్టి గిట్టారు కానీ ఎవరూ ఏమీ వెంట తీసుకు వెళ్లలేదు, కీర్తి ప్రతిష్ఠలను తప్ప.

వడుగు అర్థింపులోని మర్మాన్ని గ్రహించిన రాక్షసగురువు శుక్రాచార్యుడు, అతనిని రాక్షసకులాంతకుడు శ్రీహరిగా గుర్తించి శిష్యుడిని అప్రమత్తం చేయబోయాడు. ఆడి తప్పని చక్రవర్తి గురోపదేశాన్ని పట్టించుకోలేదు.

పైగా 'లక్ష్మీ'నాథుడి చేయి కింద, తన చేయి పైన అయితే అంతకుమించిన భాగ్యమేముంది? అనీ సమర్థించుకున్నాడు. 'స్త్రీలను సుముఖులను చేసుకొనేందుకు, వివాహ విషయాలలో, ప్రాణధ(ద్రా)న మానాలకు హాని కలిగే సందర్భాలలో, గోబ్రాహ్మణ రక్షణ సమయాలలో అసత్యమాడినా పాపం అంటదు' అనే 'వెసులుబాటు'ను ఉపయోగించుకోవచ్చన్న గురువు మాటనూ బలిచక్రవర్తి ఆలకించలేదు. అందునా, అమిత భక్తితో విష్ణువునే కట్టిపడేసిన ప్రహ్లాదుడి మనవడు. తాతను బ్రోచినవాడే మనువడి ముందు చేయి చాపడం భాగ్యంగా భావించాడు. 'కారే రాజులు రాజ్యముల్ కలుగవే గర్వోన్నతిన్ పొందరే' అనీ నిర్వేదం వ్యక్తీకరించాడు. 'బ్రతుకవచ్చుఁగాక బహుబంధనములైన/వచ్చుగాక లేమి వచ్చుఁగాక/ జీవధనములైనఁ జెడుగాక పడుగాక/మాటఁదిరుగలేరు మానధనులు' (ఎన్ని కష్టాలు వచ్చిన, ఆఖరికి ప్రాణం పోయినా ఆత్మాభిమానం కలవారు ఇచ్చిన మాట తప్పరు) అన్న బలి ధర్మనిష్ఠ నారాయణుడిని కదిలించింది. అయినా వచ్చిన పని నెరవేర్చడం ద్వారా అతని అహంభావాన్ని అంతరింపచేయాలి.

దానం అడిగిన మూడడుగులను స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో బాలవటుడు 'త్రివిక్రముడు' అయ్యాడు. సూర్యచంద్రులు ఉన్నంత మేర భూమి ఒక అడుగు, స్వర్గం రెండవ అడుగు అయింది. 'మూడవ పాదం ఎక్కడ?' అన్న ప్రశ్నకు, సత్యవ్రతనిష్ఠుడైన బలి 'నీ తృతీయ పదము నిజము నా శిరమున/నెలవు సేసి పెట్టు నిర్మలాత్మ' అని విస్పష్టంగా చెప్పాడు. 'అహంకారంతో కన్నులు మూసుకుపోయి ప్రవర్తించిన మాలాంటి దానవుల కళ్లను సకాలంలో తెరిపించిన నీవు ఆదిగురువు లాంటివాడివి' అను శ్లాఘించాడు.

భగవానుడు బలి శిరస్సున పాదం మోపే సమయంలోనే అక్కడి చేరిన ప్రహ్లాదుడు, మనవడి దుస్థితికి విచారం వ్యక్తం చేయకపోగా, 'నీవు కట్టబెట్టిన ఇంద్రపదవి అజ్ఞానం, అహంకారాలకు మూలమైంది.

దానిని ఇప్పుడు తొలగించడం సమయోచితమే. అహంకారమనే అంధకారం తొలగేలా శిక్షించడం అంటే అతనిని రక్షించడమే...' అని వినయంగా పలికాడు.

'వాస్తవానికి ఎంతటి పదవైనా నీ పాదసేవ ముందు అల్పమే' అనీ పలికాడు. అయినా పరమాత్ముడు బలి ఉన్నతిని శ్లాఘించాడు. 'బద్ధుండై గురుశప్తుడై చలితుడై బంధుప్రజత్యక్తుడై/సిద్ధైశ్వరముఁగోలుపోయి విభక్షీణుండనై పేదయై...' (బంధితుడై, దానమిస్తానన్నందుకు గురువు శాపానికి బద్ధుడై, బంధుజనానికి దూరమై, ఐశ్వర్యాన్ని కోల్పోయి, పేదగా మిగిలినప్పటికీ, సత్యం, ధర్మాలను వీడని బలిరాజు బహు పుణ్యశీలి అని ఆయన ఉన్నతిని లోకానికి చాటాడు. ' బలి సాత్వికాహంకారాన్ని తొలగించి ముక్తి ప్రదానమే నా ఉద్దేశం. తాను చేసిన పుణ్య కార్యాల వల్ల సిద్ధి పొందాడు.

అతనిని స్వర్గానికి మించిన సుతల లోకాధిపతిగా అభిషేకిస్తున్నాను. ఆ తరువాత ఇంద్రపదవి, పిదప దేవతలకు కూడా దుర్లభమైన నా సాయుజ్యం లభిస్తుంది' అని అనుగ్రహించాడు.

*'దేవేశ్వరాయ దేవాయ దేవ సంభూతి కారిణే!*
*ప్రభవే సర్వవేదానాం వామనాయ నమో నమః!!*


★



**అనంతుడు అంటే అంతులేని వాడు, ఆదిశేషు, విష్ణువు, రుద్రుడు అని అర్థం. నాభిలో పద్మం ఉంటుంది కనుక అనంత పద్మనాభుడయ్యాడు. ఆయన కాలస్వరూపుడైన సృష్టి, స్థితి, లయ కారణ భూతుడని అరణ్యవాసం కాలంలో ధర్మజుడికి సాక్షాత్తు శ్రీకృష్ణుడే చెప్పినట్లు పురాణగాథ. 'నేనే అనంతుడను. సూర్యగమనంతో పగలు రాత్రి, కాలం నా స్వరూపం. నా స్వరూపుడైన కాలపురుషుడే అనంతుడు' అని భగవానుడు చెప్పాడు. పద్మాల పిండితో ఏడు పడగలతో పామును చిత్రించి, దర్భలతో పాముబొమ్మను తయారు చేసి పూజచేయడం ఈ వ్రతవిశిష్టత. ఆదిశేషువు సమస్త భూభారాన్ని మోస్తాడని పురాణవాక్కు కనుక ఏటా భాద్రపద మాస శుక్ల చతుర్థినాడు అనంత పద్మనాభ స్వామి వ్రతం ఆచరించడం అనాదిగా వస్తోంది.**

జీవుల సర్వచింతలను పోగొట్టి శాంతిని, యశస్సును కలిగించేది 'అనంత పద్మనాభ స్వామి వ్రతం' అని, దారిద్ర్యంతో కుమిలిపోతున్న వారికి ఉపశమనం కలిగించేదని సూతుడు శౌనకాది మహర్షులకు తెలియచెప్పాడని పురాణగాథ. తమ్ములతో అరణ్యవాసంలో అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్న ధర్మరాజు, ఆత్మబంధువు శ్రీకృష్ణుని సలహా మేరకు ఈ వ్రతం ఆచరించి సఫలీకృతుడయ్యాడని సూత వచనం.

***'కృత్వా దర్భమయం దేవం శ్వేతద్వీపే స్థిరం హరిమ్!***
***సమన్వితం సప్తఫణైః పింగలాక్షం చతుర్భుజమ్!!*** అనే శ్లోకాన్ని పఠించి, స్వామిని అర్చించాలి. మహిళలు ఎర్రటి చీరను ధరించి, గోమయంతో అలికిన ప్రదేశంలో అష్టదళ పద్మంగల ముగ్గు వేసి, కలశంలో యమునాదేవిని దర్భలతో సర్పాకృతిని పీఠం మీద ఏర్పాటు చేయాలి. వ్రత సామగ్రి పద్నాలుగు సంఖ్యలో ఉండాలి. అనంతుని



సెప్టెంబర్ 10
అనంత
పద్మనాభస్వామి
వ్రతం

# ప్రమాద అరి.. ప్రమోద హరి 'అనంత'

పూజలో పద్నాలుగు సంఖ్యకు విశేష ప్రాధాన్యం ఉంది. ఈ వ్రత తిథి (చతుర్దశి) పద్నాలుగు. తోరం పద్నాలుగు పోచలతో చేసినది కాగా దానికి గ్రంథులు పద్నాలుగు. పద్నాలుగు రకాల పత్రులతో పూజ. అంతే సంఖ్యలో పిండివంటలు, వాయనానికి పద్నాలుగు అతిరసములు వాడతారు. ఏటా వ్రతం ఆచరిస్తూ పద్నాలుగేళ్లకు ఒకసారి వ్రతానికి ఉద్యాపన చెబుతారు.

అలా పద్నాలుగేళ్లు చేస్తే సద్గతులు కలుగుతాయని, జీవితం సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో సాగుతుందని చెబుతారు. కృతయుగంలో కౌండిన్య సుగుణవతి (సుశీల) దంపతులు ఈ వ్రతాన్ని ఆచరించి నక్షత్ర లోకప్రాప్తిని పొందారని కథనం.

ప్రచారంలో ఉన్న వ్రతకథ ప్రకారం, సుశీల భర్త కౌండిన్యుడితో కలసి మెట్టినింటికి బయలు దేరింది. దారిలో ఒక ఆశ్రమంలో కొందరు ముత్తయి దువలు అనంత పద్మనాభస్వామి వ్రతం ఆచరిస్తుండగా, ఆమె కూడా చేతికి వ్రతతోరం కట్టుకొని అందులో పాల్గొని, తనకు పుట్టింటి వారు ఇచ్చిన పిండిని బ్రాహ్మణులకు దాన మిచ్చింది. ఆ వ్రతం మహత్మ్యంతో ఆ ఆశ్రమం ఐశ్వర్యసంపన్నమైంది. ఇటు, ఆమె చేతికి ఉన్న అనంత వ్రత తోరం ఏదో వశీకరణ యంత్రంగా అనుమానించిన భర్త దానిని తెంపి అగ్నిలో పడేశాడు. ఫలితంగా సంపద హరించి, దారిద్ర్య బాధతో పశ్చాత్తాపం చెందాడు. వాస్తవం తెలిసి తన అవివేకానికి చింతిస్తూ, అనంతుడు కనిపించేంత వరకు అన్న పానాలు ముట్టనని దీక్ష పట్టి స్వామి కోసం అన్వేషిస్తూ సొమ్మసిల్లి పడిపోయాడు భక్తుడి దీనస్థితికి కరిగిన అనంతుడు బ్రాహ్మణ రూపంలో ప్రత్యక్షమై తన ఆశ్రమానికి తీసుకువెళ్లి అతిథి సత్కారాల అనంతరం అనంత పద్మనాభుడిగా దర్శనమిచ్చాడు. సంపదలు, ముక్తిని ప్రసాదించాడు.

అలా 'కౌండిన్యుడు నక్షత్ర మండలంలో కనబడుతూ ఉంటాడు. అగస్త్య మహర్షి ఈ వ్రతాన్ని ఆచరించి జగత్ప్రసిద్ధుడయ్యాడు. సగర, దిలీప, భరత, హరిశ్చంద్ర , జనక మహారాజాదులు ఈ వ్రతాన్ని ఆచరించి స్వర్గసౌఖ్యాలు పొందారు' అని కృష్ణ భగవానుడు పాండవాగ్రజుడికి వివరించాడు.

అంతకుముందు పద్మనాభస్వామి కోసం అన్వేషణలో కౌండిన్యుడికి ఎదురైన అనుభవాలు సర్వకాలాల్లో కనిపించేవి, వర్తించేవే అనిపిస్తుంది. ఆయన దేవుడిని చూడాలనే ఆరాటంలో కనిపించిన చెట్టు, పచ్చగడ్డి చేనులో ఉన్న ఆవును, ఎద్దు, గాడిద, ఏనుగును ప్రశ్నిస్తాడు.

అవేమీ తమకు తెలియవంటాయి. అన్నిటికి మించి విరగకాచిన మామిడి చెట్టుపై ఒక పక్షి కూడా లేకపోవడంతో ఆశ్చర్యపడిన కౌండిన్యుడు అదే విషయాన్ని స్వామితో ప్రస్తావించాడట. దానికి పద్మనాభుడు, 'పూర్వం ఒక విద్యావంతుడు తన జ్ఞానాన్ని ఎవరికి పంచకపోవడం వల్ల ఉపయోగంలేని చెట్టుగా, ఒక ధనవంతుడు బ్రాహ్మణాదులకు దానం చేయనందున గడ్డి తినడానికి నోరు రాని ఆవుగా, బీడు భీములను దానమిచ్చిన రాజు ఎద్దుగా, అయినదానికి కానిదానికి సాటివారిని దూషించడం వల్ల గాడిదగా, ఒకరు తన పూర్వికుల దానాలను విస్మరించినందున ఏనుగుగా పుట్టారు' అని వివరించాడు.

**'అనంత' క్షేత్ర స్థలపురాణం**

శ్రీమహావిష్ణువు 108 దివ్య క్షేత్రాలలో ఒకటి కేరళలోని తిరువనంతపురం. స్వామి ఆదిశేష తల్పంపై యోగనిద్రలో ఉంటాడు. మూలవిరాట్ 1208 సాలగ్రామాలతో కూడి ఉందని చెబుతారు. ఆయన దేవేరి శ్రీహరి లక్ష్మీ తాయారు. ఇక్కడి స్వామిని మూడు ద్వారాల నుంచి, అంటే.. మొదటి ద్వారం నుంచి తల, రెండవ ద్వారం నుంచి నాభి, మూడవ ద్వారం నుంచి పాదభాగం దర్శించాలి.. స్థల పురాణాన్ని బట్టి, దివాకరముని అనే భక్తుడి తపస్సుకు మెచ్చిన శ్రీమహావిష్ణువు బాలుని రూపంలో ప్రత్యక్ష మయ్యాడు. అతని ముగ్ధ రూపానికి తన్మయుడైన ఆ ముని, ఆయనను తన వద్దనే ఉండి పొమ్మని కోరాడు. 'సదా ప్రేమగా చూసుకుంటానంటే అలాగా ఉంటాన'ని మాటిచ్చాడు బాలుడి రూపంలోని భగవానుడు, రోజులు గడుస్తున్నాయి. ఒకనాడు, ముని పూజలో ఉండగా, బాలుడు సాలగ్రామాన్ని నోటిలో ఉంచుకొని పరిగెత్తుతుండగా ఆయన ఆగ్రహించాడు. అంతే.. మాట తప్పి కోపగించావంటూ బాలుడు వెళ్లిపోతూ, తనను చూడాలనుకుంటే అడవిలోకి రమ్మంటూ పరుగుతీశాడట.

అమిత మనోవ్యథతో బాలుడిని అనుసరించిన మునికి అక్కడ అతను ఒక్క క్షణం కనిపించి మహావృక్షం రూపంలో నేలకొరిగి శేషశయనుడిగా కనిపించాడు. ఆ రూపం సుదూర పరిధికి విస్తరించడంతో, మానవ మాత్రులు దర్శించలేరని వేడుకోగా, స్వామి ప్రస్తుత రూపంలో వెలిశారని తాళపత్రాలను బట్టి తెలుస్తోంది. బలరామదేవుడు తీర్థయాత్రల్లో భాగంగా ఈ స్వామిని దర్శించి, పద్మతీర్థంలో స్నానమాచరించినట్లు తెలుస్తోంది. నమ్మాళ్వార్ తన 'తిరువాయ్‌మొళి' ప్రబంధంలో కీర్తించారు.

1565లో నిర్మితమై విశిష్ట చరిత్రగల ఈ ఆలయం ఇటీవలి సంవత్సరాలలో బయల్పడిన అపార సంపద కారణంగా వార్తలకు ఎక్కింది. ఇప్పటి వరకు ఆలయానికి సంబంధించిన ఐదు నేలమాళిగలలను తెరిచి స్వామి సంపదను అంచనా వేశారు. ఆరవ మాళిగను తెరిచేందుకు సాహసించలేదు. తిరువనంతపురం ఆలయంలో బయటపడిన వజ్రాలు, బంగారం, పచ్చలు, రాయలు, ఈస్టిండియా, నెపోలియన్ కాలం నాటి నాణేలు బస్తాల్లో లభ్యమై అప్పటివరకు మొదటి స్థానంలో ఉన్న తిరుమలేశుడు రెండవ స్థానంలో నిలిచేలా చేశాయని విశ్లేషకులు అంటారు.

**తిరుమలలో**

తిరుమలలో ఏటా భాద్రపద శుద్ధ చతుర్దశీ నాడు స్వామి వారికి ప్రాతఃకాలారాధన తరువాత శ్రీవారి చక్రత్తాళ్వార్ తిరుచ్చిలో అధివసించి తిరువీధుల ద్వారా వరహాస్వామి ఆలయం ముందున్నమండ పానికి చేరుకుంటారు. అక్కడ అభిషేకం,పుష్కరిణిలో స్నానం జరుగుతుంది.

ఉత్సవం సందర్భంగా అనంత పద్మనాభ వ్రతానికి సంబంధించి పట్టుతోరాలను స్వామి వారికి సమర్పిస్తారు. అనంతరం అర్చకులు, ఏకాంగులు, ఉద్యోగులు ఆ పట్టుతోరాలను ధరిస్తారు.

ఎ.రామచంద్ర రామానుజ



# ఢాకా లోను డ్రాగన్

**నిన్న శ్రీలంక, ఇవాళ బంగ్లాదేశ్. జిత్తులమారి చైనా దక్షిణాసియాలో పాగా వేసేందుకు ‘భారత్ బూచి’ని చూపి ఈ ప్రాంత దేశాలకు స్నేహహస్తం అందిస్తోంది. విషాదం ఏమిటంటే, డ్రాగన్ కంబంధ హస్తాల్లో నలిగిపోతున్నామనే వాస్తవం నిండా మునిగితే కానీ ఈ దేశాలకు అర్థం కావడం లేదు. చైనా దగ్గర తీసుకున్న రుణాలు తడిసి మోపెడై శ్రీలంక ఏ విధంగా దివాళా తీసిందో ప్రపంచమంతా గమనించింది. పాకిస్తాన్, నేపాల్ ఇప్పటికే విలవిల్లాడుతున్నాయి. తాజాగా బంగ్లాదేశ్. అసలే ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లా కూడా చైనా వలలో చిక్కుకుంది. శ్రీలంకలో హంబన్‌తోట, పాకిస్తాన్‌లో గ్వాదర్ ఓడరేవుల తరహాలోనే బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ రేవు మీద చైనా కన్నేసింది. రక్షణ పరంగా ఈ పరిణామాలు భారత్‌కు ఇబ్బంది కలిగిస్తున్నా, అంతకన్నా ఎక్కువ నష్టం పొరుగు దేశాలే ఎదుర్కొంటున్నాయి.**

ఆగస్ట్ 7వ తేదీన చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి బంగ్లాదేశ్‌లో పర్యటించారు. ఆ దేశ ప్రధాన మంత్రి షేక్ హసీనాను కలుసుకోవడంతో పాటు విదేశాంగ మంత్రి ఎ.కె. అబ్దుల్ మొమెన్, ఆర్థిక మంత్రి ఎహెచ్‌ఎం ముస్తఫా కమల్, వ్యవసాయ మంత్రి డాక్టర్ అబ్దుర్ రజాక్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చైనా–బంగ్లా మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. విపత్తు నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చైనా సహకారం ఈ ఒప్పందాలలోని కీలక అంశం. బంగ్లాదేశ్‌తో మెరుగైన వాణిజ్య సంబంధాలు ఏర్పరచుకుంటామని, పెట్టుబడులుల‌తో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తామని చైనా విదేశాంగమంత్రి వాంగ్ యి చెప్పారు. అలాగే 7 లక్షల మంది రొహింగ్యాలను వారి స్వదేశం మయన్మార్ పంపడంలో చైనా సహకారాన్ని కోరింది బంగ్లాదేశ్. దేశానికి బెడదగా తయారైన రొహింగ్యాలను వదల్చుకోవాలనుకుంటూనే, చైనాను అంటకాగడమే ఇక్కడ గమనార్హం.



షేక్ హసీనా, జిన్‌పింగ్

బంగ్లాదేశ్‌లో 500కు పైగా చైనీస్ కంపెనీలు చురుకుగా పనిచేస్తున్నాయి. ఓడరేవులు, నదుల్లో సొరంగాలు, రహదారుల నిర్మాణంలో ఇప్పటికే చైనా నిపుణులు భాగస్వాములయ్యారు. పద్మానదిపై 3.6 బిలియన్ డాలర్ల వ్యయంతో భారీ వంతెన నిర్మించింది. చైనాకు బంగ్లాదేశ్ ముడి పదార్థాలను ఎక్కువగా ఎగుమతి చేస్తుంటుంది. ఈ దేశం నుంచి ఎక్కువగా ఎగుమతి అయ్యేది వస్త్రాలే. చైనాకు ఎగుమతి చేసే 98% వస్తువులకు సుంక రహిత (డ్యూటీ ఫ్రీ) ఒప్పందం ఉంది. ఇప్పుడు దీన్ని 99 శాతానికి పెంచేసింది చైనా. అంతర్జాతీయ వేదికపై చైనా తమ దేశం తరఫున నిలబడతారని హామీ ఇచ్చిందటున్నారు ఆ దేశ విదేశాంగ సహాయ మంత్రి షహరియార్ ఆలం. తాము భారత్, అమెరికాలతో పాటు చైనాతో కూడా సమానంగా దౌత్య, వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకుంటున్నామని తెలివిగా చెప్పారాయన..

కొన్ని దేశాలు చైనాను తప్పుగా అర్థం చేసుకుంటాయని పరోక్షంగా భారత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు ఆలం. చైనా– తైవాన్ మధ్య ఇటీవలి ఉద్రిక్తతల నేపథ్యంలో ‘వన్ చైనా’ విధానానికి తన మద్దతు ఉంటుందని ప్రకటించింది బంగ్లాదేశ్. చైనా వత్తిడితో బంగ్లాదేశ్ ప్రధాని హసీనా ఢాకాలోని తైవాన్ వాణిజ్య ప్రతినిధి కార్యాలయాన్ని మూసి వేయించింది.

**లంక, పాక్, నేపాల్ మాదిరే....**

మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరిట దక్షిణాసియాలోని శ్రీలంక, పాకిస్తాన్, నేపాల్‌ను మచ్చిక చేసుకుంది చైనా. బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టును అడ్డం పెట్టుకొని ఇందుకోసం వాటికి భారీ రుణాలను ఇచ్చింది. ఇప్పటికే శ్రీలంకలో హంబన్‌తోట, పాకిస్తాన్‌లో గ్వాదర్ ఓడరేవులను తెలివిగా తన స్వాధీనంలోకి తీసుకున్న చైనా ఇప్పుడు బంగ్లాలోని చిట్టగాంగ్‌లో కూడా పాగా వేస్తోంది. భారత్‌ను దిగ్బంధించేందుకే తమను చైనా దువ్వుతోందని ఈ దేశాలకు తెలుసు. కానీ ఆర్థిక వ్యవస్థల బలహీనత కారణంగా నిస్సహాయ పరిస్థితికి చేరుకున్నాయి.

చైనా దగ్గర భారీ వడ్డీకి తీసుకున్న అప్పులు భారంగా మారడం వల్లే శ్రీలంక దివాలా తీసిందని అందరికీ తెలుసు. శ్రీలంక ఆర్థిక, రాజకీయ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. శ్రీలంకను ఆర్థికంగా దెబ్బ తీయడంతో డ్రాగన్ ప్రధాన పాత్ర పోషించింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం చైనా నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో తీర్చుకోలేకపోయింది. దేశంలో విదేశీ మారక నిల్వలు తరిగి పోవడంతో ద్రవ్యోల్బణం గరిష్ట స్థాయికి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారత్ కొంత మేర సాయం అందించింది. అయినప్పటికీ భారత్ ప్రయోజనాలకు విరుద్ధంగా ఇటీవల హంబన్‌తోటకు చైనా యుద్ధనౌక వచ్చినా అభ్యంతరం తెలపలేని నిస్సహాయ పరిస్థితి ఏర్పడింది.

పాకిస్తాన్ కూడా తీసుకున్న అప్పులు తీర్చలేని దుస్థితితో చైనాకు ఎప్పుడో లొంగిపోయింది. బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టులో భాగంగా ‘చైనా పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్– సీపీఈసీ’ వ్యయం తడిసిమోపెడై పాకిస్తాన్ విలవిలలాడుతోంది. ఆరంభంలో పాకిస్తాన్ ఈ ప్రాజెక్టును జాక్‌పాట్‌గా భావించింది. కానీ ఈ అప్పులు తీర్చలేకపోడంతో నెమ్మదిగా పాకిస్తాన్‌లోని అనేక ప్రాంతాలను చైనా ఆక్రమిస్తోంది. సీపీఈసీని అడ్డం పెట్టుకొని గ్వాదర్ రేవులో పాగా వేసింది. తాజాగా పాకిస్తాన్ సైన్యం కోసం రహస్య క్షిపణి స్థావరాన్ని నిర్మించే పనిలో నిమగ్నమైంది చైనా. సింధ్‌లోని నవాబ్‌షా,



# వీరంగం

బలూచిస్తాన్‌లోని ఖజ్దర్ పరిసర ప్రాంతాల్లో ఈ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి శత్రువు భారత్‌ను దెబ్బ తీయాలనే లక్ష్యంతో చైనాతో చేతులు కలిపిన పాకిస్తాన్ ఇప్పుడు ఫలితాన్ని అనుభవిస్తోంది. పాకిస్తాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో అక్కడి ప్రజలు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

భారత్‌తో అనాదిగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబంధాలున్న నేపాల్ సైతం చైనా వలలో చిక్కుకుంది. రుణాలు తీసుకునేప్పుడు ఆనందంగానే ఉన్నా తీర్చేటప్పుడు బాధ కలుగుతుంది. నేపాల్‌కు మూడు వైపులా భారత్ ఉంటే ఉత్తరంలో హిమాలయాలకు ఆవల చైనా ఉంటుంది. స్వతహాగా ఆ దేశం భారత్ మీద ఆధారపడక తప్పదు. అయితే నేపాల్ కమ్యూనిస్టు నాయకులు చైనా మాయలో పడి తమ దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టేశారు. భారత్‌లోని లద్దాఖ్, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో చాలా భూభాగాల్లో తిష్టేసిన చైనా ఇప్పుడు నేపాల్ విషయంలోనే అదే వ్యూహాన్ని అమలు చేస్తోంది. నేపాల్‌లోని గూరా, హుమ్లా జిల్లాల్లోకి చైనా చొరబడింది. అక్కడ రోడ్లను కూడా నిర్మించే ప్రయత్నం చేస్తోంది. గూరాలోని చుమనుబరి రూరల్ మున్సిపాలిటీ–1లోని రుయిలా సరిహద్దులో కంచెను ఏర్పాటు చేసింది. డ్రాగన్ దుష్ట చేష్టల కారణంగా సరిహద్దులోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పశువులు గడ్డి మేయకుండా చైనా సైనికులు అడ్డుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. నేపాల్ సార్వభౌమత్వానికి చైనా సవాలు విసురుతున్నా, అక్కడి పాలకులు గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేయలేని దుస్థితి. భూటాన్‌లోని డోక్లాంలో పాగా వేందుకు ప్రయత్నించి భారత్ ప్రతిఘటనతో భంగపడ్డ చైనా, ఇప్పుడు తన దురాక్రమణను నేపాల్‌లో అమలు చేస్తోంది. అయితే తాము నేపాల్ సరిహద్దులను ఆక్రమించలేదని, ఆ భూభాగాలు టిబెట్ పరిధిలోనివంటూ చైనా బుకాయిస్తోంది.

ఏ విధంగా చూసినా శ్రీలంకను దివాళా తీయించిన చైనా వక్ర దృష్టి ఇప్పుడు బంగ్లాదేశ్‌పై కూడా పడిందని నిశ్చయంగా చెప్పవచ్చు. ఈ దేశాన్ని కూడా అప్పుల ఊబిలోకి తోసేసే ప్రయత్నాలు మొదలు పెట్టింది. బంగ్లాదేశ్‌లోని ముఖ్యమైన ఓడరేవు చిట్టగాంగ్‌పై తన ఆధిపత్యాన్ని పెంచుకునే ప్రయత్నం ఇందుకు సంబంధించినదే. చిట్టగాంగ్‌ను స్మార్ట్ సిటీగా మార్చాలని, అక్కడ మెట్రో ట్రైన్స్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని చాలా కంపెనీలు ప్రతిపాదించాయి. లాభాల్లో వాటా ఇవ్వాలనే చర్చ కూడా జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడుల పేరుతో బంగ్లాదేశ్‌ను డ్రాగన్ పూర్తిగా తన అధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవలి చైనా విదేశాంగమంత్రి ఢాకాలో పర్యటన, కీలక ఒప్పందాలపై సంతకాలు దీని ఫలితమే. బంగాళాఖాతంలోని ఈ కీలక రేవులో చైనా కార్యకలాపాలు భారత్‌కు ముప్పుగా మారబోతున్నాయి..

**ఆర్థిక సంక్షోభంలో బంగ్లా**

అప్పులు తీర్చలేక శ్రీలంక దివాళా తీస్తే, పాకిస్తాన్ దివాలా అంచుకు చేరింది. ఇప్పుడు బంగ్లాదేశ్‌లో కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో బంగ్లాదేశ్ ఒకటని ఆర్థికవేత్తలు కితాబిస్తుంటారు. ఆ దేశం 416 బిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే 33వ స్థానంలో ఉంది. ఈ దేశ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం, సేవారంగాలపై ఆధారపడి ఉంది. జీడీపీలో 56శాతం ఉన్న బంగ్లా సేవారంగం కరోనా కారణంగా బాగా దెబ్బతింది. దీంతో 11లక్షల మంది నిరుద్యోగులయ్యారు. మరో వైపు బంగ్లాదేశ్ ఎగుమతుల్లో 84శాతం వాటా ఉన్న రెడీమేడ్ దుస్తుల డిమాండ్ లాక్‌డౌన్ల కారణంగా దెబ్బతింది. విదేశాల్లో నివసించే బంగ్లాదేశ్ వాసులు స్వదేశానికి పంపించే మొత్తాలు కూడా గణనీయంగా తగ్గాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా చమురు రేట్లు గణనీయంగా పెరగడం కూడా బంగ్లాదేశ్‌కు శాపంగా మారింది.

ఈ పరిస్థితుల్లో బంగ్లాదేశ్ బెయిల్‌ఔట్ ప్యాకేజీ కోసం అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వద్దకు వెళ్లింది. రానున్న మూడేళ్లలో 4.5 బిలియన్ డాలర్లు ఇవ్వాలని కోరింది. వివిధ సంస్థల నుంచి 2.5 బిలియన్ డాలర్ల రుణం కోసం యత్నిస్తోంది. మరోవైపు బంగ్లాదేశ్ పాలకులు మాత్రం ఆర్థికంగా దేశానికి ఎటువంటి ఇబ్బంది లేదని చెబుతున్నారు. తక్కువ వడ్డీతో లభించే రుణాలను అవసరాలకు వాడుకోవడానికి ఓ మార్గంగా పరిగణిస్తున్నట్టు సమర్థించుకొంది. కానీ, వాస్తవాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ఇబ్బందుల్లో ఉంది. ఒక్క 2019లోనే 11.11 బిలియన్ డాలర్ల రుణాలు దేశీయంగా ఎగవేసినట్లు ఆ దేశ సెంట్రల్ బ్యాంక్ వెల్లడిస్తోంది. ప్రస్తుతం బంగ్లాదేశ్ వద్ద ఉన్న రిజర్వులు కొన్ని నెలల విదేశీ చెల్లింపులకు మాత్రమే సరిపోతాయి. ఈ నేపథ్యంలో ఆ దేశ ఎగుమతులు పెరిగి విదేశీ కరెన్సీ రిజర్వులు పుంజుకోకపోతే ఆ దేశం మరిన్ని ఆర్థిక కష్టాలు ఎదుర్కోక తప్పదు.

బంగ్లాదేశ్ ప్రజలు కూడా ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో అల్లాడుతున్నారు. ద్రవ్యోల్బణం అంతకంతకూ పెరుగుతోంది. తొమ్మిది నెలలుగా 6శాతం పైనే నమోదవుతోంది. గత నెలలో 7.48 శాతానికి చేరింది. మధ్యతరగతి, పేద ప్రజలకు పూట గడడం కష్టంగా మారింది. ఈ పరిస్థితుల్లో యుద్ధం పేరుతో మళ్లీ ఇంధన ధరల భారం మోపడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. 51.2 శాతం పెరుగుదలతో ప్రస్తుతం భారత కరెన్సీ ప్రకారం లీటర్ పెట్రోల్ ధర 108రూపాయలకు చేరింది. డీజిల్, కిరోసిన్, గ్యాస్ ధరలు కూడా భారీగా పెరిగాయి.

ఈ నేపథ్యంలో శ్రీలంక తరహాలో బంగ్లాదేశ్‌లో కూడా ఆందోళనలు భారీగా జరుగుతున్నాయి.



బంగ్లా, చైనా విదేశాంగ మంత్రులు


పెరిగిన ఇంధన ధరలకు వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. ఆందోళనలతో రాజధాని ఢాకా దద్దరిల్లిపోయింది. పెట్రోల్ బంక్‌లను ధ్వంసం చేశారు.

ఈ పరిస్థితుల మధ్యే బంగ్లాదేశ్, చైనాతో నాలుగు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ ఒప్పందాలపై బంగ్లాదేశ్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీలంక దివాళాకు చైనా కారణమన్నది ప్రపంచమంతా అంగీకరిస్తోంది. ఇప్పటికే సంక్షోభం దిశగా పయనిస్తున్న బంగ్లాదేశ్ ఈ సమయంలో చైనాతో ఒప్పందాలు కుదుర్చుకోవాల్సిన అవసరమేంటని బంగ్లాదేశ్‌లోని మేధావి వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# కాంగ్రెస్‌లో మిగిలేదెవ్వరు?

**కాంగ్రెస్‌ని ఇంతకు మించి చెడగొట్టడం మరొకరి వల్ల కానేకాదని ఆ పార్టీ ప్రముఖులు ఏకగ్రీవంగా తేల్చేసినట్టే ఉన్నారు. ఆ విషయాన్ని దశలవారీగా బహిర్గతం చేయడానికి సిద్ధపడుతున్నట్టుగానూ కనిపిస్తున్నారు. అంత చెడగొట్టే ప్రతిభ ప్రస్తుతం ఆ పార్టీలో ఎవరికి ఉందో జాతికి ప్రత్యేకంగా బోధించనక్కరలేదు. ఆ అసమాన ప్రతిభావంతుడు రాహుల్ గాంధీయే. కాంగ్రెస్ ముక్త భారత్ అన్న నినాదం ఇచ్చిన బీజేపీ పనిని ఈ గాంధీ వారసుడే సులభతరం చేసిపెడుతున్నారు. అందుకు బీజేపీ కృతజ్ఞతలు చెప్పుకోవడం మరవరాదు.**



సామాజిక మాధ్యమాల నుంచి

పార్టీ కోమాలోకి వెళ్లిపోయిందంటూ రెండేళ్ల క్రితం 23 మంది కాంగ్రెస్ సభ్యులు పార్టీ అధినేత్రికి పెద్ద లేఖ రాశారు. దానికి సరైన సమాధానం లేదు. నెహ్రూ గాంధీ వారసుడు రాహుల్ తప్ప పార్టీకి అన్యథా శరణం నాస్తి అన్న నినాదం వదిలేస్తే మంచిదన్న అభిప్రాయాన్నే ఆ 23 మంది పరోక్షంగా సూచించారు. పోనీ నాయకత్వ బాధ్యతలైనా పద్ధతిగా స్వీకరిస్తే గుడ్డిలో మెల్ల కదా అన్న రాజీ ధోరణి కూడా ఆ 23 మంది వచ్చారు. కానీ రాహుల్ మనసు కరగలేదు. దేశంలో కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎలాంటి ఎన్నికలు కావచ్చు. సరిగ్గా ఆ సమయంలోనే ఆయన విదేశీయాత్రను అవి ఆపలేవు. ఆయన వెళ్లి తీరతారు. ఆ పార్టీ ప్రత్యేకత కడుపు మండిన పెద్దలు ఇప్పుడు తమ ప్రతాపం చూపిస్తున్నారు. కపిల్ సిబల్, అశ్వినీకుమార్, హార్దిక్ పటేల్, సునీల్ జాకడ్ వంటి నాయకులంతా వరస పెట్టి కాంగ్రెస్‌కు సలాం కొట్టినవారే. ఇప్పుడు గులాం నబీ ఆజాద్ వంతు వచ్చింది.

యాభయ్ ఏళ్ల నుంచి కాంగ్రెస్‌ను సేవించు కుంటున్న కశ్మీరీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి గులాం నబీ ఆజాద్ ఎట్టకేలకు ఆగస్ట్ 26న రాజీనామా పత్రాన్ని దాదాపు పార్టీ ముఖానికేసి కొట్టారు. ఆ లేఖలో రాహుల్ గాంధీని ఎన్ని విశేషణాలతో ఛీత్కరించారో గమనిస్తే, ఆజాద్‌గారి భాషా చాతుర్యం, శబ్ద సౌందర్యం, భావ ప్రకటనా సామర్థ్యం మనలని విస్తుపోయేటట్టు చేస్తాయి.

ఏమిటంటే, చెంచాలనీ, భృత్యులనీ అపురూపంగా చూసుకునే సంస్కృతి పుష్కలంగా ఉండక్కడ. వాళ్లు రాహుల్ మాత్రమే అర్హుడంటూ కొన్నేళ్లుగా పాడిందే పాడుతున్నారు. ఇంతకీ రాహుల్ ఎలాంటి నాయకుడు? ఆయన పార్టీ పదవులు స్వీకరించరు. అలా అని పార్టీ మీద స్వారీ చేయడం ఆపరు. అలాగే ప్రధాని పీఠం మీద గాంధీ-నెహ్రూ వంశీకులు కాని వారు కూర్చుంటే రాహుల్ సుతరాం సహించలేరు. అయోధ్య కూల్చివేత సమయంలో మా వంశీకులు ఉంటేనా... అని ఆయన అసందర్భ ప్రేలాపన చేశారు. అసలు కాంగ్రెస్ మీద పెత్తనం తమ జన్మహక్కని ఆయన గాఢంగా నమ్ముతారు. దీనితోనే 2013లో రాహుల్ ఉపాధ్యక్షుడయ్యాడు, ఇక ఇంతే సంగతులు అని తేల్చారు ఆజాద్. ఆ పాదం మహిమ మామూలు మహిమ కాదని చెప్పడం ఆజాద్ ఉద్దేశం. 2014-2022 మధ్య జరిగిన 49 అసెంబ్లీ ఎన్నికలకు గాను 39 సార్లు కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడిపోయింది మరి. యువనేత వెళ్లడం ఏమిటి, అక్కడ పార్టీ చతికిల పడడం ఏమిటి! సర్వసాధారణ మైపోయింది. అయినా రాహుల్ మాత్రమే కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఒరలో కత్తిలా సరిపోతాడని చెబుతున్నారు, తైనాతీలు. ఈ వికారపు ధోరణి పట్ల ఏవగింపుతోనే ఆజాద్ గట్టి సలాం కొట్టి బయటకి నడిచారని అర్థమవుతుంది.

తాను పార్టీని ఎందుకు వదిలిపోవలసి వచ్చిందో ఏడు కారణాలను ఆజాద్ ప్రస్తావించారు. అవి ఏడు చేపల కథని గుర్తుకు తెస్తాయి. ఒక అంశంతో ఒకటి లోతుగా ముడిపడి ఉన్నాయి. ఆయన ఏకరువు పెట్టిన కారణాలన్నీ కూడా రాహుల్ మీద ఛీత్కారాలే. రాహుల్‌కు బొత్తిగా పరిపక్వత లేదని నిర్ధారించారు ఆజాద్. పరిపక్వత లేకపోవడం అంటే రాహుల్‌వన్నీ పిల్ల చేష్టలేనని అర్థం. అదీ చెప్పారు. సీనియర్లని చూస్తే ఆయనకి తేళ్లు,జెర్రిలు పాకినట్టు ఉంటుందట. కోటరీ మాటని పన్నీటి జల్లులా ఆస్వాదిస్తారట. అయినా రాహుల్ గాంధీకి ఆయన సెక్రటరీలు, సెక్యూరిటీ గార్డులు శ్రమ ఇవ్వరట. పార్టీకి సంబంధించిన నిర్ణయాలు వీళ్లే తీసుకుంటారట. సోనియమ్మ ఉత్సవ విగ్రహం తప్ప మరేమీ కాదనీ, నిర్ణయాలన్నీ ఆమె కొంగుచాటు ముద్దుల తనయుడివేనని ఆజాద్ అంతఃపుర రహస్యాల గుట్టు విప్పేశారు. ఆజాద్‌కి ఇక్కడ ఈ పక్షపాతం ఎందుకో అర్థం కాదు. ఈ కొడుకు ఆ తల్లి కొడుకు కాదూ! ఆమె మాత్రం తక్కువా?

రాహుల్ అపరిపక్వత ఎప్పుడూ ఒక్కలా ఉండిపోలేదు. అందులో తగినంత వృద్ధి కూడా కనిపిస్తుందట. మన్మోహన్ సింగ్ రెండో దఫా పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంలో జాతి యావత్తు ముక్కున వేలేసుకునేటట్టు రాహుల్ చేసిన ఒక నిర్వాకం గురించి కూడా ఆజాద్ గుర్తు చేశారు. అప్పుడే ప్రభుత్వం ఇచ్చిన ఒక ఆర్డినెన్సును పట్టుకొచ్చి విలేకరుల సమావేశంలో పరపర చింపేశారు, రాహుల్. ఆ సమావేశంలో నాటి ప్రధాని, మౌనముని మన్మోహన్‌సింగ్ కూడా ఉన్నారు. ఇది రాహుల్ అపరిపక్వతకు పరాకాష్ఠ అంటున్నారు ఆజాద్. అన్నట్టు ఆ ఆర్డినెన్స్ మీద రాష్ట్రపతి ఆమోదముద్ర సైతం పడిపోయింది. ఆ విధంగా రాష్ట్రపతినీ,





ప్రధానినీ ఏకకాలంలో అవమానించిన నాయకుడిగా రాహుల్ చరిత్రకెక్కాడు. 2019లో వర్కింగ్ కమిటీ సమావేశంలోనే రాహుల్ సీనియర్లని ఘోరంగా అవమానించిన సంగతిని కూడా ఆజాద్ ఇప్పుడు బయటపెట్టారు. ఆ తిట్లు ఎలాంటివో కూడా చెబితే బాగుండేది.

గులాం నబీ ఆక్రోశాన్ని అర్థం చేసుకోవలసిందే. 23 మంది కలసి పార్టీ శ్రేయస్సు కోసం లేఖ రాస్తే, కశ్మీర్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. ఆ విన్నపం మీద సంతకాలు చేసిన ఇంకొందరు కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు ఉత్సాహవంతులైన రాహుల్ విధేయులు బైఠాయింపు జరిపారు కూడా. కాంగ్రెస్ సర్వనాశనం అయిపోయినా ఫర్వాలేదు. పోటీ చేసిన ప్రతిచోటా ఓడిపోయినా పట్టించుకోనక్కరలేదు. రెండు మూడు సీట్ల కోసం ప్రాంతీయ పార్టీల పంచన చేరినా కూడా ఫరవాలేదు. కానీ గాంధీ కుటుంబం మీద ఈగ వాలితే మాత్రం సహించరు కాంగ్రెస్ కార్యకర్తలు.

పంజాబ్‌లోని ఆనందపూర్‌సాహెబ్ ఎంపీ, మరొక సీనియర్ నాయకుడు మనీష్ తివారీ అయితే ఇంకొంచెం నిశితమైన అంశాన్ని బయటపెట్టారు. ఇంత తెలివైనవాడు ఆ పార్టీలో ఎందుకు ఉండి పోయాడో కదా అనిపిస్తుంది. చూడబోతే భారత్‌కీ, కాంగ్రెస్‌కీ మధ్య అగాధం వచ్చినట్టే కనిపిస్తోంది అన్నారాయన. కాంగ్రెస్ మాటేమో కాని, ఇది బీజేపీకి నిరాశ కలిగించే అంశమే. తమ ప్రమేయం ఆట్టే లేకుండానే భారత గడ్డ మీద కాంగ్రెస్ పార్టీ ఎండిపోతోంది మరి! నిర్మొహమాటంగా చెప్పాలంటే ఆ పార్టీకీ, దేశ ప్రజలకీ మధ్య అంతరం ఎప్పుడో వచ్చింది. గులాం నబీ ఆజాద్ రాజీనామా, మరొక నాయకుడు ఆనంద్ శర్మ హిమాచల్ పార్టీ స్టీరింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్న నేపథ్యంలో మనీష్ చేసిన ఈ వ్యాఖ్య మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీలో మథనం ఎలాగూ లేదు సరే, కనీసం అంతర్మథమైనా చేసుకోలేరేమి అన్నదే మనీష్ ఆక్రోశం. పాపం, ఆనంద శర్మ అయితే ఆత్మ గౌరవం అనేది అడిగి తీసుకునేది కాదని గట్టిగా చెప్పారు. తను హిమాచల్ స్టీరింగ్ కమిటీ సభ్యుడే. కానీ ఏ ఒక్క విషయమూ శర్మకు తెలియడం లేదట. ఎవరికి తెలుస్తున్నాయో, ఎవరు నడిపిస్తున్నారో వేరే చెప్పాలా? ఇక మనీష్ మాటలు తూటాల్లాగే ఉన్నాయి. వార్డు సభ్యునిగా పోటీ చేసే అర్హత కూడా లేని వాళ్లు, పార్టీలో చప్రాసీల వంటి వాళ్లు ఇప్పుడు జ్ఞానబోధకు ఉపక్రమించారని, ఇది బొత్తిగా హాస్యాస్పదమని అన్నారాయన. ఆజాద్ రాజీనామా గురించి గాంధీ-నెహ్రూ కుటుంబ భృత్యులు కొందరు చేసిన వ్యాఖ్యలకు మనీష్ ఇంత ఘాటుగా సమాధానం ఇచ్చారన్న మాట. 1885లో స్థాపించిన ఈ పార్టీకి, దేశానికీ మధ్య అగాధం వచ్చినట్టే ఉందని మనీష్ తీర్పు ఇచ్చారు.

ఇప్పుడు అసోం ముఖ్యమంత్రిగా పని చేస్తూ దేశవ్యాప్త ఖ్యాతిని సంతరించుకున్న వ్యక్తి ఎవరో గుర్తుంది కదా! హిమంత బిశ్వశర్మ. ఆయన కాంగ్రెస్ వారే. ఒకసారి ఆయన ఢిల్లీ వెళ్లి తమ అధిష్ఠానదేవుడు రాహుల్ వారి దర్శనం కోరారు. అయితే రాహుల్ తీరిక లేనంత పనిలో ఉన్నారు, ఎవరినీ కలుసుకునే ఉద్దేశంలో అసలే లేరు అని భృత్యులు హిమంతను




తరిమేశారు. ఇంతకీ రాహుల్ గాంధీకి అంత తీరిక లేని పనేమిటి అంటే, కుక్క పిల్లతో ఆడుకోవడం. హిమంత అక్కడ నుంచి అటే బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. తరువాత కథ తెలిసిందే.

అటు గులాం నబీకి కాని, ఇటు మనీష్‌కి కాని చిర్రెత్తుకొచ్చిన విషయం ఒకటి ఉందని అనిపిస్తుంది. నబీ అన్ని పదవులు అనుభవించి కష్టాలలో ఉన్నపుడు వదిలిపెట్టిపోతున్న ద్రోహి అన్నట్టు కొందరు భృత్య శిఖామణులు అవాకులు చెవాకులు పేలారు. ఇంకా పేలుతూనే ఉన్నారు. పార్టీలో ఉండనివ్వరు. వెళ్లిపోతే అవాకులు చెవాకులు!

ఇదంతా చూస్తుంటే 1990లో సోవియెట్ రష్యా పతనానికి ముందు వినిపించిన ఒక చలోక్తి గుర్తుకొస్తున్నది. అప్పటికే రొట్టె, మాంసం, ఓడ్కా వంటి నిత్యావసరాలు దొరకని పరిస్థితి రష్యాలో. ఇక కుప్పకూలడమే తరువాయి. ఆఖరి అధ్యక్షుడు మిఖాయిల్ గోర్బచెవ్. అసంతృప్తితో ఉన్న జనానికి ఊరట కల్పించేందుకు కొన్ని దేశ సరిహద్దులని కాపలా లేకుండా కావాలని విడిచి పెట్టేవారట. అక్కడ నుంచి జనం ఇతర దేశాలకు వెళ్లిపోతూ ఉండేవారు. ఇదంతా తన భవనం నుంచి గోర్బచెవ్ చూస్తుండేవారట. ఒకసారి భార్య రైసా గోర్బచెవ్, గోర్బచెవ్ జనం వందల సంఖ్యలో వెళిపోతున్న దృశ్యం చూశారట. దీనితో గోర్బచెవ్ రైసాతో అన్నారట, ఇలా అయితే రష్యాలో ఇద్దరమే మిగులుతామేమో అని. అందుకు రైసా, ఆ రెండోవారు ఎవరో? అని అడిగారట. అంటే ఆమె కూడా అక్కడ నుంచి నిష్క్రమించే యోచనలో ఉన్నది. ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా దానికి భిన్నంగా ఏమీ లేదు. నాయకులు వెళ్లిపోతున్నారు. రాష్ట్రాలలో పరిస్థితి చెప్పక్కరలేదు. ఎక్కడైనా వర్గాలే. రాజస్తాన్, కర్ణాటక, తెలంగాణలలో తిరుగుబాట్లు వర్ధిల్లుతున్నాయి. అన్నట్టు వచ్చే అక్టోబర్‌లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయట. చూద్దాం!

షరా: యువరాజుకు గిట్టని పెద్దలు అప్పటికీ ఇంకా పార్టీలో అదుగు బొదుగు ఎవరైనా మిగిలి ఉంటే వాళ్లు సైతం బయటకి పోయే వరకు ఎన్నికలు వాయిదా వేసే అవకాశం మాత్రం ఉంది. ★



అక్షరాస్యత ప్రగతికి మూలం. అభివృద్ధికి సాకారం. మహాత్మాగాంధీ 'దారిద్ర్యం, నిరక్షరాస్యత ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి. నిరక్షరాస్యత నిర్మూలిస్తేనే దారిద్ర్య నిర్మూలన జరుగుతుంది' అని చెప్పారు. సుమతీ శతకకర్త 'ఇమ్ముగ చదవని నోరును / అమ్మా! యని పిలిచి యన్న మడుగని నోరున్/ తమ్ములమబ్బని నోరును / కుమ్మరి పను ద్రవ్వినట్టి గుంటర సుమతీ' అన్నాడు. ఇంపుగా చదువని నోరు కుమ్మరి మట్టి త్రవ్వే గుంట లాంటిదని చదువు ప్రాధాన్యాన్ని 13వ శతాబ్దంలోనే చెప్పాడు. పోతన భాగవతంలో హిరణ్యాకశిపుని పాత్ర ద్వారా ప్రహ్లాదుడికి చదువు ప్రాశస్త్యాన్ని వ్యక్తీకరిస్తూ 'చదువనివాడజ్ఞుండు చదివిన సద సద్వివేక చతురత గలుగున్'-చదువు వల్ల అజ్ఞానం తొలగిపోయి విజ్ఞత కలుగుతుందని, సదసద్వివేక చతురత సాధ్యమవుతుందని చదువు ప్రయోజనాన్ని గొప్పగా ప్రబోధించాడు.

# అక్షరాస్యత ప్రగతికి

ఐక్యరాజ్య సమితిలో ప్రధానమైన విద్యా, విజ్ఞాన శాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1945లో ప్రారంభమైంది. ఈ సంస్థ అంతర్జాతీయ సహకారంతో ఆయా అంశాల పరిరక్షణ కోసం పాటుబడుతుంది. అందులో 193 మంది సభ్యులు, ఆరుగురు అసోసియేట్ సభ్యులుంటారు. దాని ప్రధాన కేంద్రం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉంది.

యునెస్కో 1965 అక్టోబర్ 26వ తేదీన సభ్య దేశాల విద్యాశాఖ మంత్రుల సమావేశం నిర్వహించి,



**డా॥ పి.వి.సుబ్బారావు**
9849177594
రిటైర్డ్ ప్రొఫెసర్ & తెలుగు శాఖాధిపతి,
సి.ఆర్. కళాశాల, గుంటూరు.

సెప్టెంబర్ 8వ తేదీని ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవంగా ప్రకటించింది. అక్షరాస్యతను వ్యక్తులకు, సంఘాలకు అందించడమే దీని ఆశయం. పిల్లల్లోనే కాకుండా వయోజనుల మీద దృష్టి కేంద్రీకరించి అక్షరాస్యతను పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుతారు.

ప్రపంచవ్యాప్తంగా అప్పటికి 775 మిలియన్‌ల పెద్ద వారిలో కనీస అక్షరాస్యతా లేని వారు ఉన్నారు. వారిలో మహిళలు రెండు వంతుల మంది ఉన్నారు. పిల్లల్లో 60.7 మిలియన్లు మధ్యలో బడి మానేసి బాల కార్మికులుగా మారుతున్నారు.

యునెస్కో రూపొందించిన నివేదిక ప్రకారం (2006) దక్షిణ ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో అక్షరాస్యతా శాతం అతి తక్కువగా ఉంది. మహిళలు నిరక్షరాస్యత మూలంగా వివక్షతకు గురవుతున్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో భాగంగా వివిధ దేశాల్లో 'అందరికీ విద్య' అనే నినాదంతో అక్షరాస్యతను పెంచే ప్రయత్నం జరుగుతోంది.

ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం అక్షరాస్యత విషయంలో అట్టడుగు స్థానంలో ఉండటం బాధాకరం. దేశంలో ఇంత మాత్రమైనా అక్షరాస్యత సాధించటానికి కేరళ వంటి కొన్ని రాష్ట్రాలు ముందంజలో ఉండటమే కారణం. బిహార్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు అక్షరాస్యతలో బాగా వెనుకబడి ఉన్నాయి.

ప్రపంచ నిరక్షరాస్యుల్లో సగం మంది మన దేశంలో ఉండటం విచారకరం. స్థిరమైన ఆర్థికాభివృద్ధి సాధించాలంటే దేశంలో 80 శాతం మంది అక్షరాస్యులై ఉండాలి. స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న సమయంలో కూడా ఆ స్థాయిలో అక్షరాస్యత లేకపోవడం బాధాకరం.

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించే నాటికి (1947 ఆగస్ట్) 15 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఆ మాత్రం అక్షరాస్యత సాధనకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటివారు గ్రంథాలయోద్యమంలో భాగంగా వయోజన విద్యను ప్రోత్సహించారు. సాహితీ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం 1887 ప్రాంతంలో తన శిష్యుల ద్వారా రాజమండ్రిలో రాత్రి పాఠశాలలు నిర్వహించి వారికి ఒక్కొక్కరికి నెలకు 8 రూపాయలు పారితోషికం



ఇచ్చారు. ఆయన శిష్యుడు చిలకమర్తి లక్ష్మీ నరసింహం 1902లో రాత్రి పాఠశాలలు నిర్వహించారు. వీరి కృషి వల్ల తెలుగునాట అక్షరాస్యత శాతం కొంత మేరకు జరిగింది.

అప్పట్లో తెలుగు పాఠ్య గ్రంథాలు గ్రాంథిక భాషలో ఉన్నందున చదువు కొనేందుకు బడుగు బలహీన వర్గాల వారు జంకేవారు. స్వాతంత్య్రానంతరం భారత ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రయత్నం చేసినా, ఆశించిన మేరకు అక్షరాస్యత సాధించలేకపోయింది.

1979లో మొరార్జీ దేశాయ్ ప్రధాని అయిన వెంటనే గాంధీ జయంతి రోజున జాతీయ వయోజన విద్యా పథకాన్ని (ఎన్.ఏ.ఇ.పి) ప్రవేశపెట్టారు. అప్పటి జనాభాలో భారతదేశంలో 15 నుండి 35 సంవత్సరాల మధ్య వయసున్న వయోజన నిరక్షరాస్యులు 10 రెట్ల మంది ఉన్నారు. వారిని 5 సంవత్సరాల్లో (1984 నాటికి) వయోజన విద్య ద్వారా అక్షరాస్యులుగా చేయాలని తలచారు. ఆయన ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగనందున ఆ పథకం ఆచరణ సాధ్యం కాలేదు. ఆ తర్వాత ప్రధానిగా వచ్చిన ఇందిరాగాంధీ జాతీయ వయోజన విద్యా పథకంలో భాగంగా విశ్వవిదాలయాల ద్వారా కళాశాలలను భాగస్వాములు చేసి విద్యార్థి వాలంటీర్ల ద్వారా నిర్వహించేలా వయోజన విద్యా పథకాన్ని ప్రవేశ

## ఆధారం

పెట్టారు. ప్రతి కళాశాలకు అధ్యాపకుల్లో ఒకరిని వయోజన విద్యాపథకం ఆఫీసర్‌గా గౌరవ వేతనంపై నియమించారు. కళాశాల ఆధ్వర్యంలో పదిమంది విద్యార్థి వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి, పది వయోజన కేంద్రాలు నిర్వహించారు. వాలంటీర్లకు గౌరవభృతి చెల్లించేవారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఒక సూపర్‌వైజర్‌ని నియమించేవారు. ఈ వ్యాసకర్త 1984 నుండి 1990 వరకు కళాశాలల వయోజన విద్యా కార్యక్రమ అధికార్లకు, సూపర్‌వైజర్‌లకు శిక్షణ నిర్వహకుడిగా (రిసోర్స్ పర్సన్) ఆంధ్ర, నాగార్జున విశ్వవిద్యాలయాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాడు. రాజీవ్‌గాంధీ ప్రధాని అయిన తర్వాత ఈ కార్యక్రమ నిర్వహణకు 1986లో జాతీయ అక్షరాస్యతా మిషన్ ప్రవేశపెట్టారు. ప్రతి రాష్ట్రానికి ఒక వయోజన విద్యా సంచాలకులు, ప్రతి జిల్లాకు వయోజన విద్యాధికారి, ప్రాజెక్టు ఆఫీసర్లను నియమించి కార్యక్రమాలను నిర్వహించారు. సంబంధిత అధికార్లు నిబద్ధతతో నిర్వహించకపోవడం వల్ల వారి నివేదికల ఆధారంగా రూపొందిన అక్షరాస్యత పెరుగుదల నివేదికలు సరైనవి కావని తేలింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలల కూడా చేపట్టిన వయోజన విద్యా కార్యక్రమాలు సరైన ఫలితాలను సాధించలేకపోయాయి. ఇప్పటికీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నామమాత్రంగా కార్యక్రమాలు జరుగుతున్నాయి.

యునెస్కో 1990 సంవత్సరాన్ని ప్రపంచ అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి 2003-2012 కాలాన్ని అక్షరాస్యత దశాబ్దిగా ప్రకటించింది. 'లిటరసీ ఫర్ ఆల్.. వాయిస్ ఫర్ ఆల్; లెర్నింగ్ ఫర్ ఆల్' అనే అంశాలను దశాబ్ది లక్ష్యాలుగా నిర్దేశించింది.అయితే ఆశించిన మేరకు లక్ష్యాల సాధన జరుగలేదు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా వివిధ దేశాల్లో 'అందరికీ విద్య' నినాదంతో అక్షరాస్యతను పెంచే ప్రయత్నాలు చేస్తున్నారు. 'అక్షరాస్యత-ఆరోగ్యం' లక్ష్యంగా(2008) ముఖ్యంగా హెచ్ఐవీ, క్షయ, మలేరియా వంటి సమస్యల నివారణ కోసం చిత్తశుద్ధితో కృషి చేసే సంస్థలకు మంచి బహుమతులిచ్చి ప్రోత్సహించారు.

భారతదేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలంటే 'అక్షరాస్యులకే ఓటు హక్కు' అని రాజకీయ పార్టీలన్నీ ఏకగ్రీవంగా ప్రతిపాదన చేయాలి. కానీ ఈ ప్రతిపాదనకు రాజకీయ పార్టీలు సుముఖత వ్యక్తం చేయవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అక్షరాస్యులకే అని, బ్యాంకుల ద్వారా పొందే రుణ సదుపాయాలు అక్షరాస్యులకే అని ప్రకటించినా అక్షరాస్యత శాతం పెరుగుతుంది. ఈ ప్రతిపాదనను రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో అమలు పరిస్తే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుంది. ఏది ఏమైనా ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవాల వల్ల ప్రజల్లో అక్షరాస్యతపై అవగాహన పెరుగుతుంది. విద్యాసంస్థలు, విద్యాధికులు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, ఉపాధ్యాయులు ర్యాలీల ద్వారా అక్షరా స్యత ఆవశ్యకతను ప్రబోధించి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించాలి. వయోజన విద్యా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో కార్యక్రమాన్ని అమలు చేయాలి. ప్రత్యేకించి బడుగు బలహీనవర్గాల వారిలో మహిళల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్నారు. అటువంటివారు నివసించే కాలనీల్లో 'అక్షరాస్యత-ఆరోగ్యం' వంటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి చైతన్య పరచాలి. వారి పిల్లలను సక్రమంగా పాఠశాలలకు పంపించేటట్లు చేయాలి. ఆరోగ్య కార్యకర్తలు, ఈ కృషితో భాగస్వాములు కావాలి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై చిత్తశుద్ధితో కృషి జరగాలి. అప్పుడే సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమవుతుంది. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం ఆశయం సఫలమవుతుంది. ★



కథ

# కాటు

## నాగేంద్రకుమార్ వేపూరి

హైదరాబాద్ శివార్లలో అనేక కొత్త ఇళ్లతో అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీ. సుందరనగర్‌లో అదో అందమైన చిన్న డూప్లెక్స్ ఇల్లు. బయట కాంపౌండ్ వాల్ గేటు పక్కన గోడలో ఫిక్స్ చేసిన నేమ్ ప్లేట్ మీద 'డా. శంతను కుమార్, సైంటిస్ట్.' అని ఉంది.

ఆ వీధిలో ఓ అంబులెన్స్ వస్తున్న శబ్దం వినిపించింది.

వెంటనే ఆ ఇంట్లో నుండి ఓ రెండేళ్ల పసివాడు తప్పటడుగులు వేస్తూ గబగబా గేటు దగ్గరకి పరిగెత్తుకుంటూ వచ్చి గేటుకు తాళంవేసి ఉండటంతో ఆగిపోయాడు. అదే సమయంలో వారింటి ముందు నుండి అంబులెన్స్ వేగంగా వెళ్లిపోతుంటే దానిని ఆపమని చేయి ఊపుతూ ఆతృతగా 'డాడీ.. డాడీ' అని అరుస్తున్నాడు.

అది చూసి 'నానీ..' అని అరుస్తూ ఇంట్లో నుండి పరిగెత్తుకుంటూ వచ్చిన ఇరవై తొమ్మిదేళ్ల వయసున్న శిరీష ఆ బాబుని అమాంతం ఎత్తుకుంది.

ఆమెను బేలగా చూస్తూ.. 'మమ్మీ...డాడీ...' అంటూ కన్నీరుబుకుతుండగా అంబులెన్స్ వెళ్లిన వైపు చేత్తో చూపించాడు నాని.

శిరీష కళ్లు కూడా చెమర్చగా ఓ చేత్తో నాని కన్నీళ్లు తుడుస్తూ 'డాడీ కాదమ్మా..' అంటూ నానీని ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు మూసింది..

'మరి.. డాడీ ఎప్పుడొస్తారు..?'

అని బేలగా అడుగుతుంటే సమాధానం చెప్పకుండా... శిరీష కన్నీళ్లతో నానీని చూస్తూ గతాన్ని తల్చుకుంది.

* * *

ప్రతిష్ఠాత్మకమైన ఓ జాతీయస్థాయి మైక్రోబియల్ పరిశోధనా కేంద్రంలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న శంతను కుమార్ తన అభిరుచికి అనుగుణంగా డిజైన్ చేసి కట్టించుకున్న డూప్లెక్స్ బంగ్లాలో ప్రవేశించి ఆనాటికి సరిగ్గా నెల అయి ఉంది.

చిన్న వయసులోనే పెద్ద ఉద్యోగం, మంచి జీతం, అందమైన భార్య శిరీష, రెండేళ్ల కొడుకు నానీతో ఎంతో ఆనందంగా ఉన్న శంతను అంటే ఎంతో మందికి అభిమానం.

ఆరోజు రాత్రి శంతనుకి తమ సంస్థ డైరెక్టర్ నుంచి ఈ-మెయిల్ వచ్చింది.

శంతను రీసెర్చ్ చేస్తున్న ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని సూచనలు చేసేందుకు మర్నాడు ఢిల్లీలో జరగనున్న ఓ అంతర్జాతీయ సెమినార్‌కి తమ టీమ్ లీడర్‌తో పాటు శంతనుని కూడా రమ్మని ఆ మెయిల్ సారాంశం.

ఆ మర్నాడు ఉదయం బయలుదేరి ఢిల్లీ వెళ్లిన శంతను ఆ రాత్రి వీడియో కాల్ చేసి శిరీషతో మాట్లాడి మరో రెండు రోజులలో తాను తిరిగి వస్తానని చెప్పాడు. నానికి ఫోన్‌లోనే ముద్దులిచ్చాడు.

రెండో రోజు సాయంత్రం హైదరాబాద్ ఎయిర్ పోర్ట్‌లో దిగిన వెంటనే శిరీషకి కాల్ చేసిన శంతను మరో గంటలో ఇంటికి చేరుకుంటానని చెప్పాడు.

వెంటనే స్నానం చేసి శంతనుకి ఇష్టమైన చిలకాకు పచ్చ చీర కట్టుకుని, తల నిండా మల్లెపూలు పెట్టుకుని, నానిని ఎత్తుకుని శంతను రాకకై గేటు వైపు చూస్తూ ఉంది శిరీష.

కొన్ని నిమిషాలు గడిచేసరికి ఆఫీస్ కారు తమ ఇంటి వైపు వస్తూ కనిపించగానే నానికి ఆ కారును చూపుతూ ఆనందంగా 'అదిగో.. డాడీ వచ్చేస్తున్నారు..' అనగానే కారు వారింటి ముందుకొచ్చి ఆగటం, దానిలోంచి శంతను దిగటం చూసిన నాని ఆనందంగా నవ్వుతూ చేతులూపాడు.

సరిగ్గా అదే సమయంలో రయ్ మంటూ ఓ పోలీస్ జీప్‌తో పాటు విజిల్ శబ్దం వేసుకుంటూ స్పీడుగా వచ్చిన ఓ అంబులెన్స్ అక్కడ ఆగాయి. ఇంట్లోకి వెళ్లబోతు శంతను ఆశ్చర్యంగా ఆ వాహనాలను చూస్తుండగానే జీప్ లోంచి దిగిన పోలీస్ ఆఫీసర్ వేగంగా శంతను దగ్గరకు వచ్చి 'ఎక్స్‌క్యూజ్ మీ.. మీరు డాక్టర్ శంతన్ కుమార్ కదూ?"

అతనిని ఆశ్చర్యంగా చూస్తూ 'ఎస్.. అయాం డా.శంతన్ కుమార్.. వాటీజ్ ది మేటర్..?"

'సార్..మీరు వెంటనే ఆ అంబులెన్స్‌లోకెక్కండి..'

'బట్..వై..?'

ఆశ్చర్యానికి, అసహనం తోడవ్వగా ప్రశ్నించాడు శంతన్.

'సార్.. మీకు తెలుసుగా కరోనా సృష్టిస్తున్న కల్లోలం గురించి. ఇప్పటికే కొన్ని వేలమంది చనిపోయారని.. అదొక అంటువ్యాధనీ... మిమ్మల్ని



ఢిల్లీలో కలిసిన చైనా సైంటిస్ట్ ఒకాయన ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కరోనా వల్ల చనిపోయాడట..

కాబట్టి అతనిని కలిసిన వారందరినీ ఇతరులతో కలవనీయకుండా వెంటనే క్వారెంటైన్‌కి తరలించ మని పైనుంచి ఆర్డర్స్ వచ్చాయి. అందుకే మీరు వెంటనే అంబులెన్స్ ఎక్కండి.' ఆదేశిస్తున్నట్లు చెప్పాడు.

'సరే.. ఐ అండర్ స్టాండ్ ఇట్.. ఒక్కసారి ఇంట్లోకి వెళ్లి....'

'నో సార్.. యూ ఆర్ నాట్ ఎలౌడ్ టు మీట్ ఎనీ ఒన్.. ఒకవేళ బై ఛాన్స్ మీకు గనుక కరోనా వచ్చి ఉంటే దానిని మీ ఫ్యామిలీకి కూడా పాస్ చేయడం మీకిష్టమా..?"

పోలీస్ ప్రశ్నతో విషయం అర్థం చేసుకున్న శంతను శిరీషతో దూరం నుంచే..

'ఇట్స్ ఓన్లీ ఫర్ మెడికల్ టెస్ట్ పర్పస్ శిరీషా.. అయిపోగానే వచ్చేస్తాను.. డోన్ట్ వర్రీ' అని.. నానీనుద్దేశించి 'నానీ బై బై.." అంటూ గాల్లో ఓ ముద్దిచ్చి అంబులెన్స్ ఎక్కాడు.

వెంటనే అంబులెన్స్ బయల్దేరింది.

అది చూసిన నాని విషయం తెలియక తన తల్లికి అంబులెన్స్‌ని చూపుతూ

'డాడీ..' అంటూ ఏడవబోతే..

'డాడీ వచ్చేస్తారు ఏడవకమ్మా..' అంటూ నానీని సముదాయిస్తూ ఇంట్లోకి తీసుకెళ్లి పోయింది శిరీష.

ఆ మర్నాడు సాయంత్రం శంతను రాకకై ఎదురు చూస్తున్న శిరీషకి అతని బాస్ ఫోన్ చేసి 'శంతనుకి కరోనా పాజిటివ్ అని తెలిసింది.. స్పెషల్ వార్డ్‌లో ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు.. త్వరలో తగ్గిపోతుంది.. ధైర్యంగా ఉండమ్మా..' అని చెప్పేసరికి దుఃఖం పొంగుకొచ్చింది శిరీషకి..

గద్గద స్వరంతో 'సరేనండి' అని ఫోన్ పెట్టేసి నానీని పట్టుకుని తనివి తీరా ఏడ్చింది..

అలా వారం రోజులు అత్యంత భారంగా గడిచాక ఓ రోజు తమ ఇంటి ముందు ఆఫీస్ వెహికిల్ ఆగటంతో ఆతృతగా బయటికొచ్చిన శిరీషని చూసిన శంతను బాస్.. 'సారీ అమ్మా.. భగవంతుడు నీ కింత అన్యాయం చేస్తాడనుకోలేదు. కరోనా మహమ్మారి బారినపడిన శంతను లాంటి ప్రతిభావంతుడైన యువ శాస్త్రవేత్తను ఈ దేశం కోల్పోవటం, అతని మృతదేహాన్ని కూడా మీరు చూడలేకపోవడం దురదృష్టకరం..'

ఆ తర్వాత అతనేం చెప్పాడో వినిపించలేదు శిరీషకి..

అపస్మారక స్థితిలో కుప్పకూలిపోయిన శిరీషకి తెలివి వచ్చేసరికి ఓ హాస్పిటల్లో ఉంది..

శంతను వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే ఒకమ్మాయి నానీని ఆడిస్తూ కనిపించింది.

శిరీష దగ్గరకు వచ్చి నానీని అందించింది ఆమె.

నానీని గుండెలకు హత్తుకుని కన్నీళ్లు ధారాపాతంగా వర్షిస్తుండగా

'కనీసం చివరిచూపు కూడా దక్కని దురదృష్టవంతురాలిని.." అని ఏడుస్తుంటే శిరీషని ఓదార్చలేక నిస్సహాయంగా నిలుచుండి పోయిందామె.

ఇహంలో కొచ్చిన శిరీషని నిస్సహాయంగా చూస్తున్నట్లున్నాయి గోడ మీద గల తమ ముచ్చటైన ఫ్యామిలీ ఫొటోలోని శంతను చూపులు. ★



జాగృతి వారపత్రిక ఆధ్వర్యంలో

ఘనశ్యామల ప్రసాదరావు స్మారక



# పాటల రచనల పోటీ-2022

**ఎంపిక చేసిన 5 రచనలకు**

**రూ. 4,000/- వంతున బహుమతి**

- ఈ పోటీకి కొత్తగా రచించిన పాటలనే పంపాలి.
- పాట 20 నుంచి 25 లైన్‌లకు మించరాదు. ఒక రచయిత రెండుకి మించి పంపరాదు.
- జాతీయతను, సేవాభావాన్ని పెంపొందించే పాటలను మాత్రమే పంపాలి.
- ఈ పాట ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీపత్రం జత చేయాలి.
- రచనలు అను ఫాంట్‌లో కాని, యూనికోడ్‌లో కాని డీటీపీ చేసి jagriticompetition@gmail.com కి మెయిల్ చేయండి.
- మెయిల్ సబ్జెక్టులో పాటల పోటీకి అని తప్పనిసరిగా రాయాలి.
- పోస్టు ద్వారా: పాటల రచనల పోటీ, జాగృతి వార పత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027.

**రచనలు జాగృతికి చేరవలసిన చివరి తేది :**

**14 సెప్టెంబర్ 2022**

ప్రపంచంలోనే పెద్ద వయసున్న ఆచార్యులు (ప్రొఫెసర్). దేశంలోనే 'డాక్టరేట్ ఆఫ్ సైన్స్' (నేటి పీహెచ్‌డీతో సమానం) పట్టా అందుకున్న మొదటి మహిళామణి. భౌతిక, రసాయన శాస్త్రాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు రాజా విక్రమ్‌దేవ్ వర్మ స్మారక స్వర్ణ పతక విజేత. జీవిత సాఫల్యం సహా లెక్కకు మిక్కిలిగా పురస్కారాలు గ్రహీత. సుమారు తొమ్మిదిన్నర పదులు వయసులోనూ అలుపెరుగక విద్యాబోధన. విజయం సాధించిన పురుషుడి వెనుక మహిళ పాత్ర ఉంటుందన్నట్లే, మహిళ విజయం వెనుకా పురుషుడి ప్రమేయం ఉంటుందని విశ్వసించే ఆచార్య చిలుకూరి శాంతమ్మ... తమ జీవితభాగస్వామి, తెలుగు శాఖ పూర్వ ఆచార్యులు దివంగత సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రస్తావన లేకుండా మాట ముందుకు సాగనివ్వలేరు. సంతానంలేని ఆ దంపతులకు విద్యార్థులే పిల్లలు. 'శిష్యాదిచ్ఛేత్ పరాజయం' అనే సూక్తిని అక్షరాల పాటించే శాంతమ్మ. తన దగ్గర విద్యాబుద్ధులు నేర్చిన వ్యక్తి (ఆచార్య జీఎస్ఎన్ రాజు) ఉపకులపతిగా వ్యవహరిస్తున్న విశ్వవిద్యాలయంలోనే విద్యాబోధన చేస్తున్న నిగర్వి. వయసు శరీరానికే కానీ మనసుకు కాదంటారామె. నిత్యం రానూపోనూ సుమారు 150 కిలోమీటర్లు ప్రయాణిస్తూ పాఠాలు చెబుతున్నారు. వేకువజామున నాలుగు గంటలకు నిద్రలేచి పనులు చక్కపెట్టుకొని, విశాఖ నుంచి విజయనగరంలోని విశ్వవిద్యాలయంలో పాఠాలు చెప్పడానికి వెళతారు.'శ్వాస ఉన్నంత వరకు చదువు చెప్పాలి. చదువు చెప్పగలిగేంత వరకూ జీవించాలి' అనే దృఢ సంకల్పంతో, ఊతకర్రల సాయంతో తిరుగుతూ పాఠాలు చెబుతూ అధ్యాపకవర్గానికే స్ఫూర్తి ప్రదాతతో 'జాగృతి' మాటామంతీ...

# 'తిరుమల మెట్లమీద ఆయన అన్న మాటలు నన్ను ఎంతో ఎత్తుకు తీసుకు వెళ్లాయి!'



### బోధనంటే ప్రాణం

జ్ఞానం పంచే కొద్దీ పెరుగుతుంది. ఒకరి నుంచి మరొకరికి విశ్వవ్యాప్తమవుతుంది. కొత్తకొత్త ఆవిష్కరణలకు అవకాశం కలుగుతుంది. అందుకు ఉద్యోగ విరమణ ఆటంకం కాబోదు, కారాదు. ఆఖరి శ్వాస వరకు చదువు చెప్పాలన్నదే నా సంకల్పం. ఇరవై ఏళ్ల క్రితం రెండు మోకాళ్ల చిప్పలకు శస్త్రచికిత్స జరిగింది. వయసుతో వస్తున్న సమస్యలు నా మనోధైర్యాన్ని, స్థైర్యాన్ని ఏమీ చేయలేకపోయాయి. అన్నీ అందరికి తెలియాలని లేదు. కానీ తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలి. నేర్చేవారైనా, నేర్పేవారైనా నిత్య విద్యార్థులే. ఉద్యోగం కోసమే చదువు కాదు. ఉద్యోగం అనేది కొంతవరకు బతుకుతెరువు కోసమే అయినా, ఆయా రంగాలకు సేవ చేసే చక్కటి అవకాశమని నా భావన. వృత్తిని గౌరవించాలి. శక్తి మేరకు చిత్త శుద్ధితో నిర్వర్తించేందుకు ప్రయత్నించాలి. పుట్టిన తేదీ ప్రాతిపదికగా, సాంకేతికంగా వృత్తి, ఉద్యోగ విరమణ చేయవలసి వచ్చినా అటు తరువాత, మన ఇష్టమైన వ్యాపకాలను కొనసాగించగలగాలి. ఉద్యోగ విరమణతోనే జీవితం పూర్తయినట్లు కాదు. ఆపైనా సేవలు అందించగలగాలి. కొందరికి ఆ ఉద్దేశం ఉన్నా కారణాంతరాల వల్ల సాధ్యం కాకపోవచ్చు. కానీ అవకాశం ఉన్నవారు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మన అనుభవాలు, జ్ఞానం భావితరానికి ఉపకరించగలగాలి. అందులోనే శాంతి, ఎనలేని సంతృప్తి దాగి ఉంటాయి. పనిలోనే విశ్రాంతి అనే భావన అలవరచుకుంటే ఆరోగ్య సమస్యలు దరిచేరవు. నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యే వారికి నిరాశ అనేది కలగదు. లక్ష్యసిద్ధి కోసం ఎక్కడా ఆగకుండా ముందుకు సాగిపోవడమే అసలైన విజయ రహస్యం. 'అత్యున్నతమైన లక్ష్యాన్ని చేపట్టండి. దాన్ని సాధించేంతవరకు మీ జీవితాన్ని ధారపోయండి' అన్నారు వివేకానందుడు.

### శక్తిసామర్థ్యాల వినియోగంపైనే ఫలితాలు...

'జ్ఞానచక్షువు' లేదా 'సహజ జ్ఞానం' (Intuition), శక్తి సామర్థ్యాలను భగవంతుడు అందరికీ ఇచ్చాడు. దానిని వినియోగించుకోవడంపై ఫలితాలు ఆధారపడి ఉంటాయి. అందరు వాటిని గ్రహించలేకపోవచ్చు. జ్ఞానచక్షువు అనేది స్వయం విజ్ఞానాత్మక/ జ్ఞానదాయకం(సెల్ఫ్ ఎడ్యుకేటివ్). దీనినే 'అంతర్వ్యిజ్ఞానం' అనీ వ్యవహరిస్తారు. దీనికి విద్యతో సంబంధం లేదు. ప్రజ్ఞ, వివేచనాలపైన ఇది ఆధారపడి ఉంది. అంతర్ బుద్ధితో నైతిక సూత్రాలను గ్రహించి, ఆచరణలో పెట్టే ప్రక్రియ. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు ఈ అంశాన్ని బాగా నమ్మారు. ఈ విధానం ద్వారా



పలు అంశాలు అనేకసార్లు అనుభవంలోకి వచ్చినట్లు చెప్పేవారు. చిన్నప్పటి నుంచే నాకూ అలాంటి అనుభవాలు కలిగాయి. దీనిపై అనేక సార్లు ప్రసంగించాను. ఈ అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాను. చాలా మంది పలానాది కనిపెట్టామంటారు. కానీ అది అప్పటికి ప్రకృతి (నేచర్)లో ఉంది. అదే 'విశ్వవేద్'. విశ్వంలో ఉన్నదానినే జ్ఞానచక్షువుతో కనిపెట్టారు లేదా గమనించారు. ఉదాహరణకు, 'రెండు మూళ్లు ఆరు' అనే దానిని ఎవరు కనిపెట్టారు? విశ్వంలో ఉన్నదానినే తెలుసుకున్నాం అంతే.

**ఇలా ఎదుగుదల. . . .**

కృష్ణాజిల్లా మచిలీపట్నం మా ఊరు. న్యాయవ్యవస్థలో పని చేస్తున్న మా నాన్నగారు వంగల సీతారామయ్య నేను ఐదు నెలల పసికందుగా ఉన్నప్పుడే కాలం చేశారు. మా చిన్నాయన వంగల నరసింహదీక్షితులు (జిల్లా న్యాయమూర్తిగా పదవీ విరమణ చేసి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లేబర్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌లో పనిచేశారు) గారు చేరదీశారు. అమిత ప్రేమానురాగాలతో, పూర్తి స్వేచ్ఛతో పెంచారు. రాజమండ్రి, మదనపల్లి, విశాఖలో చదువు సాగింది. ఉమ్మడి మద్రాసు ప్రభుత్వ హయాంలో విశాఖ ఏవీఎన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాను. ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో స్నాతకోత్తర విద్య, 'మైక్రోవేవ్ స్పెక్ట్రోస్కోపి'కి సంబంధించి పీహెచ్‌డీతో సమానమైన డీఎస్సీ పరిశోధన పూర్తి చేసి, అక్కడే 1956లో భౌతిక శాస్త్ర విభాగంలో ఉపన్యాసకురాలిగా చేరాను. భౌతిక, రసాయన శాస్త్రాలలో ప్రతిభకు రాజా విక్రమ్‌దేవ్ వర్మ స్మారక స్వర్ణ పతకాన్ని అందుకున్నాను. రీడర్, ప్రొఫెసర్, ఇన్వెస్టిగేటర్ లాంటి బాధ్యతలు నిర్వహించాను. నా పర్యవేక్షణలో 17 మంది పీహెచ్‌డీ, నలుగురు ఎం. ఫిల్. పట్టాలు అందుకున్నారు. అనేక విశ్వ విద్యాలయాల డి. ఎస్సీ. , పీహెచ్‌డీ సిద్ధాంత వ్యాసాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించాను.

శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన మండలి,(కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్–సీఎస్ఐఆర్), విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ), శాస్త్ర సాంకేతిక విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలలో పరిశోధనలకు ఇన్‌చార్జిగా వ్యవహరించాను. 'అటామిక్ స్పెక్ట్రోస్కోపి మాలిక్యులర్ స్పెక్ట్రోస్కోపి'కి సంబంధించిన అంశాలపై చేసిన విశ్లేషణలకు ప్రఖ్యాత శాస్త్రవేత్తల (వెటరన్ సైంటిస్ట్స్) విభాగంలో బంగారు పతకంతో పాటు అనేక పురస్కారాలు లభించాయి. వృత్తిలో భాగంగా అమెరికా, కెనడా, బ్రిటన్, స్పెయిన్, కొరియా, శ్రీలంక తదితర దేశాలలో అనేక సైన్స్ సదస్సులకు హాజరయ్యాను. బోర్డు ఆఫ్ స్టడీస్, ఏపీ తెలుగు అకాడమీ పాలకమండలి చైర్ పర్సన్‌గా వ్యవహరించే అవకాశం లభించింది.


1989లో పదవీ విరమణ తరువాత కూడా ఆరేళ్లపాటు ఆంధ్ర విశ్వ కళా పరిషత్‌లోనే గౌరవ అధ్యాపకురాలిగా సేవలు అందించాను. ప్రస్తుతం, నా శిష్యుడు ఆచార్య జీఎస్ఎన్ రాజు ఉపకులపతిగా ఉన్న విజయ నగరంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో పాఠాలు చెబుతున్నాను. బోధన విషయంలో ఆయన నాకు పునర్జన్మనిచ్చారు. రోజుకు కనీసం ఆరు తరగతులు తీసుకుంటున్నాను. విద్యార్థులే నా పిల్లలు, వారి భవిష్యత్ నాకు ముఖ్యం. అందుకే అవసరమైతే సెలవు రోజుల్లోను తరగతులు తీసుకుంటుంటాను.

**దాంపత్య ప్రస్థానం**

మాది ఆదర్శ దాంపత్యం అనను కానీ అపూర్వ దాంపత్యం. ఆయన ఎంతో గౌరవించే వారు. మావి భిన్నత్వంలో ఏకత్వం లాంటి మనస్తత్వాలు. గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటే ఎలాంటి సమస్యలు ఉండ వనేందుకు మేమే నిదర్శనం. ముఖ్యంగా భార్యాభర్తల మధ్య అలాంటి అవగాహన ఉండాలి. అప్పుడే కుటుంబాలు, తద్వారా సమాజం చక్కగా సాగుతాయి. నాకు బోధనంటే చాలా ఇష్టం. ఆయనకూ (సుబ్రహ్మణ్యశాస్త్రి) తెలుగు సాహిత్యం అంటే అమితమైన ప్రేమ. అదే సమయంలో రాష్ట్రీయ స్వయంసేవక్ (ఆర్ఎస్ఎస్)కు అంకితమయ్యారు. ఎక్కువ కాలం పర్యటనలలోనే గడిపేవారు. అయినా వృత్తి, ప్రవృత్తులను సమాంతరంగా, సమానంగా నిర్వహించారు. ఒకదానిపై మరొక దాని ప్రభావం పడేది కాదు.

వయస్సు రీత్యా మా మధ్య ఆరు నెలలే వ్యత్యాసం. మా పెళ్లే విచిత్రంగా జరిగింది. వాళ్లమ్మ, మా అమ్మగార్లు మంచి స్నేహితులు. బాగా మాట్లాడుకునేవారు. వారిద్దరే కూడ బలుక్కుని మా పెళ్లి నిర్ణయం చేశారు. పెద్దల అనుమతితో మేమిద్దరమే తిరుమలకు వెళ్లి పెళ్లి చేసుకున్నాం. కొండ దిగి వస్తుండగా 'బాగా చదువుకున్నావ్. చాలా విషయాలు బాగా తెలిసిన దానివి. స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకో. ఏం చేసినా నాకు చెప్పనవసరంలేదు. నాదాకా రానక్కర్లేదు. నా అనుమతి కోసం వేచి ఉండ నక్కర్లేదు. అయితే తీసుకున్న నిర్ణయాలు ఎలాంటివైనా పునరాలోచించుకుంటూ బాధపడ కూడదు. అంటే ఏం జరిగినా స్వీకరించగలగాలి' అని చెప్పారు. చదువు సంధ్యలంటూ సుమారు మూడు పదుల వయసు గడిపేసిన నాకు 'పెళ్లంటే ఇంత సులువా, గొప్పదా? అలా అయితే ఎప్పుడో చేసుకుందును' అనిపించింది (నవ్వుతూ). వివాహబంధం గొప్పదే... అలాంటి వ్యక్తులు జీవిత భాగస్వాములుగా లభించడం మహా గొప్పని నేటికీ అనిపిస్తూంటుంది.

మా పెళ్లినాటికే నేను అధ్యాపకురాలిని.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

ఆయన బీఏ ఆనర్స్ విద్యార్థి. (ఆ అంతరం మాకు అడ్డుకాలేదు.) ఆయన పదేళ్లు ఆర్ఎస్ఎస్‌లో తిరిగిన తరువాత చదువుకునేందుకు వచ్చారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో బి.ఎ. ఆనర్స్‌లో ఇతర విభాగాలన్నిటిలో ప్రథములుగా నిలిచారు. 'సామెతలు–నుడికారాలు' అనే అంశంపై పరిశోధన చేశారు. ఫెలోషిప్‌పై కేంద్ర ప్రభుత్వంలో మూడేళ్లు పనిచేశారు. స్థిరమైన ఉద్యోగం ఆలస్యంగా వచ్చింది. అందులోనూ ఒడుదొడుకులు. కుటుంబ పోషణంతా నాదే. మా మధ్య అతిశయాలు, ఆత్మన్యూనత భావాలు లాంటివి లేవు. వ్యక్తిత్వాలు ప్రధానం తప్ప హోదాలు, ఆర్థికాంశాలు కావన్నది మా నమ్మకం. పరస్పర అభిప్రాయాలను గౌరవించుకున్నాం. ఆలుమగల బంధం పటిష్టతకు అదే మూలం అనుకుంటా. ఉదాహరణకు, నా చదువు, ఉద్యోగం 'వంగల' ఇంటిపేరుతోనే సాగినా, ఆయనతో జీవితం పంచుకున్న తర్వాత అధికారిక పత్రాలలో ఇంటి పేరు (చిలుకూరిగా) మార్చుకున్నాను. పుట్టింటి పేరుతో కొనసాగితే సాంకేతికంగా ఇబ్బందేమీ ఉండదు కానీ మెట్టినింటి గౌరవం కాపాడుకోవడం ధర్మం. నా అభిప్రాయాలను ఆయన మన్నించినప్పుడు, వారి గౌరవమర్యాదలను కాపాడుకోవాలనిపించింది. నా ఉన్నతిలో శాస్త్రి గారి పాత్రే ఎక్కువ. ప్రతి మగవాడి విజయం వెనుక స్త్రీ పాత్ర ఉంటుందన్నది లోకంలోని మాట. నా విషయంలో అది తిరగబడింది. ఆయన ప్రోత్సాహం వల్లనే ప్రొఫెసర్‌గా అంతర్జాతీయ



స్థాయికి ఎదగ గలిగాను. మా అమ్మ పెంచింది వేరు, మా పినతండ్రి పెంపకం వేరు, మావారు సాకిన తీరు వేరు. మా అమ్మ వనజాక్షమ్మ 104 ఏళ్లు జీవించి ఆరేళ్ల క్రితం వెళ్లిపోయారు. అప్పటి వరకు నన్ను కంటికి రెప్పలా చూసుకున్నారు. అత్తింటి వారంటే ఎంతో అభిమానం. ఇప్పటికీ మా పెద్ద బావగారికి నెలనెలా గౌరవపూర్వకంగా, నా ఆత్మసంతృప్తి కోసం కొంత మొత్తం పంపుతున్నాను.

'నీవే తల్లివి తండ్రివి...' అని భాగవతంలో పోతనామాత్యుడు రుక్మిణితో చెప్పించిన మాటలు మా 'ప్రొఫెసర్' (నవ్వుతూ సంబోధన) విషయంలో నాకూ వర్తిస్తాయి. ఆయనకు తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో సమాన ప్రావీణ్యం ఉండేది. సంస్కృత, తెలుగు భాషలను బాగా అధ్యయనం చేయడం వల్ల ఉపనిషత్తులు, వేదాలు, పురాణాల గురించి వివరించి చెప్పేవారు. అలా వాటి పట్ల కలిగిన మక్కువ, ఆయన స్ఫూర్తితోనే భగవద్గీత శ్లోకాలను వ్యాఖ్యాన సహితంగా 'భగవద్గీత ది డివైన్ డైరెక్టివ్' (Bhagvadgeetha-The Divine Directive) శీర్షికతో ఆంగ్లంలోకి అనువదించగలిగాను. పూరీలో జగద్గురు శంకరాచార్య భారతీ కృష్ణ తీర్థ స్వామీజీ ప్రవచించిన సూత్రాలలో ఇరవై తొమ్మిదింటికి 'వేదిక్ మాథమాటిక్స్'ను అన్వయిస్తూ వ్యాఖ్యానించాను. అనేక రచనల విషయంలో ఆంగ్ల భాషా విషయంలో ఆయన ద్వారా సందేహనివృత్తి చేసుకునే దానిని. మేమిద్దరం సమయపాలనకు విలువిస్తాం. తరగతులకు ఆలస్యంగా వెళ్లడం మా నిఘంటువులో లేదు. ఆయన దాటిపోయినా, ఇప్పటికీ అదే పాటిస్తున్నా.

**జయాపజయాలకు నిమిత్తమాత్రులం**

ఏం సాధించినా మనగొప్పంటూ ఏమీ లేదు. మనచుట్టూ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడం, మనకు అవగాహన ఉన్న, మన దరిచేరిన వాటిని అమోదించడమే చేయవలసింది. ఇదే కర్మ సిద్ధాంతం. కర్మ చేస్తూ ఉండడమే మన పని. జీవితంలో ఎన్నో సంగతులు వచ్చిపడుతుంటాయి. వాటిని స్వీకరించడం, కాదనుకోవడం, వాటి వెంట పడడం. . ఇదే కదా జీవితం? దానికే తబ్బిబ్బయి కింద మీద పడడం ఎందుకు? కర్మ సిద్ధాంతంలోనే నిజమైన ప్రశాంతత. మేం ఎప్పుడు దుఃఖంగా ఉండేవారం కాము. తృప్తిగా, సంతోషంగానే ఉన్నాం. ఒకవేళ బాధాకరపరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎవరైనా 'ఎలా ఉన్నారు?' అని ప్రశ్నిస్తే శాస్త్రి గారు 'ఎక్స్‌లెంట్' అని తడుముకోకుండా బదులు ఇచ్చేవారు. 'అంతబాధలోనూ అలా చెప్పారెందుకు?' అని




అడిగితే 'వాళ్లకు మాత్రం కష్టాలు ఉండవా? మన కష్టాలు కూడా చెప్పి మళ్లీ వాళ్లను బాధపెట్టాలా?'అనేవారు.

'జీవితంలో ఏదీ ఎప్పుడు రావాలో అప్పుడే తప్పక వస్తుంది. ఏది ఎంతకాలం నీతో ఉండాలో అంతకాలం ఉంటుంది. ఎప్పుడు వదిలిపోవాలో అప్పుడే పోతుంది. వీటిలో దేనినీ ఆపలేవు. నీచేతిలో ఉన్నది ఒక్కటే. ఉన్నంత వరకు ఉన్నవాటిని విలువ తెలుసుకొని జీవించడం' అనేది కర్మ సిద్ధాంతం. దానినే నమ్మిన మా ఇద్దరికి ఆస్తిపాస్తులపై మమకారం లేదు. దశాబ్దాల క్రితం కష్టించి కట్టుకున్న ఇంటిని ఆయన అనారోగ్యంతో 'పడక' మీద ఉన్నప్పుడే 'మానవసేవే మాధవసేవ' అన్నట్లు వివేకానంద మెడికల్ ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చేశాం.' ఆ సమయంలో నాకు అండగా నిలిచి, మా వారికి ప్రేమానురాగాలతో సేవలు అందించిన అబ్బాయిని చేరదీసి చదివించి పెళ్లి చేశాను. అతనికి ముగ్గురు పిల్లలు. చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నాడు. నాతో పాటు మొత్తం ఆరుగురం కలిసే ఉంటున్నాం. అతని కొద్దిపాటి సంపాదనకు నా పింఛన్‌తోడై వారికి గడుస్తోంది. మావారు పెళ్లి తర్వాత తిరుమలగిరు దిగుతూ చెప్పిన 'ఒకసారి తీసుకున్న నిర్ణయాలను పునరాలోచించుకుంటూ బాధపడకూడదు' అన్న మాటలు వెంటాడుతున్నాయి. దాదాపు 95 ఏళ్ల వయసులో ఆస్తులపై మమకారం లేదు. కాకపోతే నా తరువాత నన్ను నమ్ముకున్న ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏమిటన్నదే నా ఆలోచన, బెంగ. ఎవరికి ఎంతో అంతే ప్రాప్తం. . . ! ★

మహమ్మదీయ పరిపాలకులు దేశం నలుమూలలా వాళ్ల కర్కశత్వాన్ని చూపించారు. కొంచెం ఆలస్యంగా దక్షిణ భారతదేశం మీదకు వచ్చారు. ముస్లిం దండయాత్రలు సుమారు 1700 ప్రాంతంలో తిరుమల తిరుపతి పరిసర ప్రాంతాలను కూడా తాకాయి. సుల్తానుల సైన్యం రాజకీయ, సాంఘిక, మత పరమైన జీవనాన్ని అల్లకల్లోలం చేసి దోపిడీలు, అకృత్యాలకు పాల్పడటంతో జనజీవనం కల్లోలమైంది. సాంస్కృతిక జీవనం భ్రష్టమైంది. ఆచారాలు అపవిత్రమయ్యాయి. అలాంటి సమయంలో కొందరు కవులు ఈ పరిస్థితిని రక్షించలేవా అంటూ తాము నమ్మిన దైవాలకు మొర పెట్టుకోవడం సర్వసాధారణమైన విషయం. సాధారణంగా నిందా స్తుతులతో ఈ వేడుకోళ్లు, విన్నపాలు ఉండేవి. ఇందులో దేవుళ్ల మీద దుమ్మెత్తి పోస్తారు. ఆ సంగతి ఎలా ఉన్నా, ఆ కాలం నాటి సామాజిక పరిస్థితులు తురుష్కుల చేతిలో హిందూ ధర్మానికి ఎదురైన సంకటం వారు గొప్పగా ఆవిష్కరించారు. కానీ వారంతా పరమ భక్తులు. ఆ కాలంలో వేంకటాచల విహారునిగా శ్రీ వేంకటేశ్వర స్వామిని సంబోధిస్తూ ఈ దుస్థితినుండి రక్షించాలనీ, శత్రువులను నిర్జించాలనీ వేడుకుంటూ సాగేదే 'వేంకటాచల విహార' శతకం. పైన చెప్పుకున్న విషయాలు, నిజానికి చారిత్రక సత్యాలు ఇందులో చాలానే ఉన్నాయి.



# తురుష్కుల పాపం, శతక


ఎటువంటి ఆచార్య పురుషుడుడినైనా నరే, ఎటువంటి షట్ శాస్త్రవేత్తనైనా గాని, సోమయాజి (యజ్ఞములు చేసినవారు) కొడుకునైనా, బహుశాస్త్ర సంపన్నుడినైనా పచ్చిబూతులతోనే సంబోధిస్తూ, ఈ శతక కవి కూడా కవి చౌడప్పనే ఆదర్శంగా తీసుకున్నట్టు కనిపిస్తుంది. దండయాత్రకు వచ్చిన ముస్లింలను కూడా ఏ మాత్రం తగ్గకుండా మోతాదులో దూషించడం ఇక సర్వసాధారణం. ధూమపానం, సురాపానం, తోయపానం, రక్తపానం అంటే వారికి రక్తి కలుగుతుంది. దుష్ట ఆలోచనలతో వచ్చే తురక దొరల (కవి వాడిన పదం) గురించి ఈ కవి వివరించాడు. ఆయన 16వ శతాబ్దం నాటి పరిస్థితులకు ప్రత్యక్ష సాక్షి. ఆ కాలం నాటి దురాగతాలను స్వయంగా అనుభవించి రాసిన గ్రంథం ఇది. హిందూ ధర్మానికి ఎదురైన హింస ఎలాంటిదో చెప్పేదే కూడా.

ఈ శతకంలోని ఏ పద్యంలోనూ కవి తన పేరు చెప్పుకోలేదు. శతకం అంటే సుమారు నూరు పద్యాలు. కానీ 98 పద్యాలు మాత్రమే దొరుకుతున్నాయి. మిగిలిన ఆ రెండు పద్యాలే కవి వివరాలతో ఉండి ఉంటాయని ఒక నమ్మకం. వాటిలో కవి తన పేరు తదితర వివరాలు చెప్పుకొని ఉండవచ్చని ప్రముఖ సాహితీ పరిశోధకుడు, ఈ గ్రంథ పరిష్కర్త వేటూరి ప్రభాకరశాస్త్రి అభిప్రాయ పడ్డారు. కానీ అప్పుడున్న ఆ పరిస్థితులలో కవి తన పేరు తెలియకుండా గోప్యంగా ఉంచుకునే అవకాశం కూడా ఉంది. రెండు చోట్ల తాను బ్రాహ్మణుడనని (7 వ పద్యం) వేంకటేశ్వరస్వామి సొమ్ము తిన్న వాడినని (85వ పద్యం) చెప్పుకున్నాడు. అయితే మెకంజీ ఖైఫియత్ ప్రకారం దీని గ్రంథకర్త 'నల్ల కాల్వ వరకవి సీతాపతి'. ఈ విషయాన్ని విద్వాన్ నరసింహులు పేర్కొన్నారు. కె. జె కృష్ణమూర్తి వ్యాసంలో తక్కిన రెండు పద్యాలు దొరికాయి.

ఈ శతకానికి 'శత్రు సంహార వేంకటాచల విహార'ను మకుటంగా స్వీకరిం చారు. ప్రతి పద్యంలో చివరి పాదంగా ఈ పాదం ఉంటుంది. ముందు చెప్పినట్టు ఈ గ్రంథం నిందాస్తుతి శైలిలో నడుస్తుంది. శతకంలోని విషయాలకూ మకుటానికి దగ్గర సంబంధం ఉంది. సుల్తాను సైన్యం (వీరినే తురకలని సంబోధించాడు కవి) చేస్తున్న ఆగడాలను భరించలేక, వారిని నశింపజేయమని తను నమ్మిన దైవాన్ని, అంటే వేంకటేశుని కోరుతూ ఈ శతకం రాశాడు. దీనిలో దేవుణ్ణి కటువుగా సంబోధించిన సందర్భం కూడా వస్తుంది. ఎవడబ్బ సొమ్మని కులుకుతూ కూర్చున్నావు అంటూ రాముల వారిని రామదాసు బాధతో నిలదీసినట్టే ఇదీను. సింహాద్రి అప్పన్న కొండపై తురుష్కులు దాడి చేసినప్పుడు గోగులపాటి కూర్మనాథకవి రాసిన 'శ్రీ సింహాద్రి నారసింహ శతకం' ఈ కోవలోకే వస్తుంది. అలాగే చల్ల పేరయ్య రాసిని 'భద్రగిరి శతకం' ఇలాంటిదే.

దేవాలయ ముట్టడి అంటే ఒక ధర్మం మీద అన్న స్పృహ తురుష్కులలో బలంగానే ఉండేదని పిస్తుంది. ఎందుకంటే తురుష్క సైనికులు విగ్రహాలను ధ్వంసం చేసేవారు. దైవత్వం ఉన్న వృక్షాలుగా పూజించే వృక్షాలను నరికేసేవారు. పూజారులను, పురోహితులను, పండితులను, భక్తులను అవమానించేవారు. బంగారు ఆభరణాలు దోచుకోవడం సర్వసాధారణం. ఇలా ఎన్నో అమానవీయ అకృత్యాలకు పాల్పడేవారని చరిత్ర చెబుతుంది.


విగ్రహాలను నాశనం చేస్తున్నప్పుడు జిగురు పాలకోసమంటూ చిగురించే పవిత్రమైన రావిచెట్లు నరికేవారు. వాటిని నుజ్జు నుజ్జు చేసేవారు. గురువులకే గురువులుగా పూజారులంతా పూజించే వారిని పట్టుకుని నామాలను చెరిపించే వారు. అది కూడా ఒకరి నామాలు ఒకరు నాలుకతో నాకి తుడిచి వేయాలి. ఇలాంటి ఒక దుర్భర పరిస్థితిని కవి వర్ణిస్తాడు. పైగా వాళ్లని 'గెలవడం నీకు శక్యమా,



కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

ఏదో వెర్రితనం కొద్దీ విన్నవించుకుంటున్నాము, మీ చిత్తమూ మా భాగ్యమూ' అని కూడా అంటారు.


తురుష్క సైనికుల పైశాచికానందం ఎలా ఉండేది? బోడిగుండు సన్యాసులను పొట్టేళ్లలాగా ఒకరి తలతో ఒకరిని డీ కొట్టించువాడొకడట. సోమయాజులు జంధ్యాలు తెంచి వాటితో విల్లుల కట్టే తాళ్లు తయారుచేసుకొనేవాడొకడట. యవనుల మేఘాల్లా వ్యాపించి దుర్దినములు వచ్చినా దిగువ తిరుపతిలో (ఇవన్నీ చూడకుండా) నిదురపోతున్నాడు



# కవి శాపం

మీ అన్న (గోవిందరాజులు) లేవలేక. అని కూడా కవి బాధపడతాడు. 'వడి గుళ్లు సొచ్చి దేవుళ్ల బ్రద్దలు చేసి' దేవాలయాల్లోకి వెళ్లి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారు చూస్తున్నావా అని నిలదీస్తాడు.

'ఓ వేంకటేశ్వర స్వామీ! తురకలని బొడుతుననుచు బాకు మొలకు తగిలించుకుని బొంకుతున్నావు గానీ నీ వంటిపై గల సొమ్ములు






వేటూరి ప్రభాకర శాస్త్రి

దోచుకునే వరకూ కదలవా? ఖలులు సొమ్ములు దోచినా, మొల కతారు ఊడదీసుకుపోయినా ఎదిరించి పోరాడలేవులే. 'రత్నాల పెద్ద కిరీటంబు' సొమ్ములన్నీ దోచుకుపోయాక 'గోచీగోనము' వేసుకొందువుగానిలే అని తిడతాడు కవి. ఇక్కడ తురుష్కుల ఆగడాలే కాదు, స్వామివారి వైభవాన్ని కూడా కవి విస్మరించడు. బంగారు భేరీ ఏ పాపాత్ముడు హరించాడు. కనీసం 'అచ్యుత, కృష్ణరాయలొసంగిన రత్నాలహారం' రక్షించుకోమని కోరుకుంటున్నాడు కవి. కటక్ లోని జగన్నాథ స్వామిని ఎన్ని అన్నా, సింహాద్రి అప్పన్నను కృష్ణమాచార్యులూ, గోగులపాటి కూర్మనాథకవి ఎన్ని తిట్టినా, చిన్న మల్లేశుని ఎన్ని అన్నా మీ వల్ల కాదా మమ్ము రక్షించడం? అని నిష్ఠూరంగా మాట్లాడతాడు కవి.

గోల్కొండ తురుష్కులు కాళహస్తిని ఆక్రమణ కవిని మరింత బాధపడి, ఇంకొంత ఆగ్రహం తెచ్చుకునేటట్టు చేసింది. ఆ గుడిని ఆక్రమించారని తెలియగానే వెంకన్నబాబుకు భయపడిపోయాడని రాశాడు. ఇక మమ్మేమి రక్షిస్తాడు అని వాపోయాడు కూడా. 'కోవెల' పేరు 'మసీదు'ను పల్కు ప్రసిద్ధమయ్యింది, గుఱ్ఱము ఘోడా అయ్యింది. ఆంధ్రభూమి తురుష్కుల వశమయ్యింది. సిద్ధవటంలో తురుష్కులు దేవాలయాన్ని నాశనం చేస్తుంటే ఒంటిమిట్ట రఘునాథుడు మాత్రం ఎదురు తిరిగి పోరాడాడు. కామాక్షి ముక్కు చెక్కులు పోయెనని సిద్ధలింగడు పోరాడి ప్రాణం విడిచాడు, అమ్మవారి బొద్దు మాణిక్యం పోతుందని కంచి వరదప్ప భయంతో వణికి పోయాడు, అయినా చెంగల్వరాయుడు, ఘటికాచల స్వామీ గట్టు దిగడు, మమ్ము రక్షింపడు అని వాపోతాడు కవి.

మంగళగిరిలో పానకాల స్వామి పొట్ట నిండా పానకం తాగాడు, కూరటానికి తెరిపి లేదు, హరి లచ్చితో ముచ్చట్లాడుతున్నాడు, పైగా ఎక్కువ ప్రసాదాలారగించి కదల లేకుండా ఉన్నాడు అని కూడా నిందలేస్తాడు. అంతేకాదు, దక్షిణాత్యుడవు, ఏకాకివి, నీవు మమ్మెట్టు కాపాడగలవు? అని ప్రశ్నించాడు. దక్షిణాదిలో ఆయన ఏకాకి అయ్యాడట.

రోజూ నీకు ఇన్ని ప్రసాదాలు పెడుతున్నాం కదా, అయినా మా రక్షణ సంగతి ఎలా మరిచిపోయావని కూడా అడుగుతాడు కవి. ఎన్ని రకాలు పెడుతున్నాం, మేము సాధారణ తిండి తిని నీకు అన్ని రకాలు పెడుతున్నాం, పాలు, వెన్న, బంగాళబాతు దద్యోజనం, పులిహోర, వెన్న బూరెలు, పాయసం, చక్కెర పొంగలి, నువ్వు మండిగలు, మనోహరాలు, అప్పడములు, వడలు, దోసెలు, పండ్లు, తేనెలు, బొబ్బట్లు, పచ్చడులు ఇవన్నీ తినేసి ... మా బోట్లకి గుగ్గిళ్ళు వదిలావు, నీవంటి బ్రతుకు గాదా మాది? అని తీవ్రంగానే అడుగుతాడు.

ఓ వేంకటేశ్వరస్వామీ యుద్ధం అంటే 'చల్లని పన్నీటి చల్లులాట కాదని చెబుతాడు దేవదేవుడికి. మమ్మల్ని ఎలానూ రక్షింపలేవు గానీ కనీసం నువ్వైనా పారిపోయి ప్రాణాలు దక్కించుకో, నీ సంపద అయినా రక్షించుకో అంటూ 'వలదు మా యయ్యా ప్రాణంబు గలిగినేని బలుసుటాకే తినవచ్చు బారిపొమ్ము' అని గేలి చేస్తాడు. మీరు త్వరగా పారిపోకపోతే గుర్రాలపై ఎక్కి స్వారీ చేసినట్లు వాళ్లు మనపై స్వారీ చేస్తారు, పరుగెత్తమంటారు అని హెచ్చరిస్తాడు. దానం ఇమ్మని వ్యాపారస్తులను బూతులు తిట్టేవాడొకడు. జీవితమంతా దుర్దినములుగా గడుస్తున్నా దిగువ తిరుపతిలో మీ అన్న (గోవిందరాజులు) నిదుర బోతున్నాడు. నువ్వేమో కంతారలన్నీ తురుష్కులకిచ్చి మొలలో చిన్న బాకుతో తిరుగుతున్నావు, నువ్వేం కాపాడుతావు మమ్మల్ని' అంటాడు. కానీ చివర్లో కవి తన అంతరంగాన్ని పరమ సాత్వికంగా విన్నవిస్తాడు. స్వామి భక్తిని ప్రదర్శిస్తూ 'తిన్న ఇంటి వాసాలు లెక్కబెట్టరాదు' అందుకే చెపుతున్నాను. 'దేవా నీ సొమ్ము గట్టిగా తిన్న కవిని గాన చెపుతున్నాను జాగ్రత్తగా ఇక్కడ నుండి తప్పించుకో'

ఈ విధంగా కవి నిందాస్తుతితో గేలి చేసాడు. అయితే అది ఆయన బాధ, తురుష్కుల ఆగడాలను చూడలేక ఆ విధంగా మాట్లాడాడు అంతే కానీ ఈ కవి శ్రీ వేంకటేశ్వరస్వామి పరమభక్తుడు.

దేవుళ్లతో మన కవులకు ఉన్న చనువు, మాలిమి, గారాబం కావ్యాలలో కడు రమ్యంగా కనిపిస్తుంది. దండి సరస్వతినే తిట్టాడు. అయినా త్వమేవాహం అన్నది అమ్మ. అంటే నువ్వే నేను నేనే నువ్వు అని. ఇక శ్రీనాథుడి చాటువులలో కొన్ని ఉన్నాయి. పార్వతి చాలు గంగ విడువుము అని ఆదేశించాడీ కవి. ఇందులో చమత్కారం ఉంటుంది. సమకాలీన పరిస్థితులు ఉంటాయి. వాటిని మాత్రమే తీసుకోవాలి. ★

నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అంగస్ డియోటన్ భారత్‌లో పోషకాహార లోపానికి ప్రధాన కారణాన్ని ఈ విధంగా వివరించారు– 'భారత్‌లో పోషకాహార లోపం కేవలం తగినన్ని కేలరీలు తీసుకోకపోవడం వల్ల కాదు. కార్బొహైడ్రేట్‌లతో కూడిన ఆహారాన్నే అధికంగా తీసుకోవడం వల్ల! ఇందులో ప్రొటీన్, కొవ్వు పదార్థాలు చాలా తక్కువ. పారిశుద్ధ్య లేమి కూడా పోషకాల లోపాలకు తోడై, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్‌లకు కారణమవుతోంది'.

# పోషకాహార లోపాన్ని అధిగమిద్దాం!



మన దేశంలోని 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 33 లక్షల మంది పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతుండగా వీరిలో సగానికంటే ఎక్కువమంది బిహార్, గుజరాత్, మహారాష్ట్రల్లో ఉన్నట్లు కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ ఇచ్చిన సమాచారం తెలియజేస్తోంది. 2021, అక్టోబర్ 14 వరకు 17.76 లక్షలమంది పిల్లల్లో అత్యధిక పోషకాహార లోపం ఉండగా, 15.46 లక్షల మంది ఒక మాదిరి పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. బిహార్‌లో 4.75 లక్షలు, గుజరాత్‌లో 3.20 లక్షలు, ఆంధ్రప్రదేశ్‌లో 2.76 లక్షలు, కర్ణాటక 2.49 లక్షలు, ఉత్తరప్రదేశ్ 1.86 లక్షలు, తమిళనాడు 1.78 లక్షలు, అస్సాం 1.76 లక్షలు, తెలంగాణ 1.52 లక్షల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నట్టు గణాంకాలు తెలుపుతున్నాయి.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

**గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ)**

2021 గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ)ను మొత్తం 116 దేశాలకు సంబంధించి రూపొందించగా, భారత్ 101వ స్థానంలో ఉంది. 2020లో మొత్తం 107 దేశాల్లో భారత ర్యాంకు 94. 2021లో మొత్తం స్కోరు విలువ 50 కాగా, భారత్ జీహెచ్ఐ స్కోరు 27.5. విచిత్రమేమంటే మన పొరుగు దేశాలైన నేపాల్ (76), బంగ్లాదేశ్ (76), మయన్మార్ (71), పాకిస్తాన్ (92) మన కంటే జీహెచ్ఐ ర్యాంకుల్లో ముందుండటం గమనార్హం. అయితే భారత ప్రభుత్వం ఇది తప్పుడు నివేదిక అంటూ కొట్టి పారేసింది. ఏది ఏమైనప్పటికీ జీహెచ్ఐ సూచిక దేశంలో విపరీతమైన స్థాయిలో ఉన్న పోషకాహార లోపాన్ని మరోసారి ఎత్తిచూపినట్లయింది. ఇదిలా ఉండగా చైనా, కువైట్, బ్రెజిల్ సహా 18 దేశాలు పోషకాహారం విషయంలో అగ్రస్థాయిలో ఉండటం గమనార్హం. వీటి ర్యాంకు 5 కంటే తక్కువే. అంటే ఈ దేశాల్లో ఆకలి, పోషకాహారలోపం చాలా తక్కువ స్థాయిలో ఉన్నదని అర్థం. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 2030 నాటికి ఆకలిని అరికట్టడంలో 47 ప్రపంచ దేశాల వైఫల్యం కొనసాగుతోంది. సంఘర్షణలు, కొవిడ్–19, వాతావరణ మార్పులు అనే మూడు అంశాలు ప్రపంచ దేశాల్లో ఆకలి, పేదరికం పెరగడానికి కారణమవుతున్నాయి. అంతేకాదు అసమానతలు, అస్థిర ఆహార వ్యవస్థలు, వ్యవసాయంపై పెట్టుబడులు తగ్గిపోవడం, గ్రామాల అభివృద్ధి కుంటుపడటం, పాలనాపరమైన వైఫల్యాలు, ఆరోగ్య భద్రతా వ్యవస్థలో లోపాలు కూడా ఆకలి, పేదరికం పెరగడానికి కారణమవుతున్నాయి.

ఈ గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ముఖ్యంగా నాలుగు అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తుంది. 1. పోషణస్థాయి తక్కువ (తగినంత కేలరీలను తీసుకోక పోవడం), 2. ఐదేళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం (ముఖ్యంగా తక్కువ బరువు) 3. ఐదేళ్లలోపు పిల్లలు వయసుకు తగ్గ ఎత్తు లేకపోవడం. ముఖ్యంగా దీర్ఘకాల పోషకాహార కొరతను ఎదుర్కోవడం, 4. చిన్నపిల్లల్లో

# సెప్టెంబర్ 01-07 జాతీయ పోషకాహార వారం



మరణాలు (ఐదేళ్లలోపు పిల్లల్లో మరణాలు. పోషణ కొరత, అనారోగ్య వాతావరణం). వీటి ఆధారంగా హంగర్ ఇండెక్స్‌ను తయారుచేస్తారు.

**మీకు తెలుసా?**

మానవ శరీరానికి ఏడు రకాల ప్రధాన పోషకాలు అవసరం. అన్ని పోషకాలు తగినంత శక్తినివ్వకపోయినప్పటికీ నీరు, పీచు పదార్థాల మాదిరిగా అవి కూడా చాలా అవసరం. సూక్ష్మ పోషకాల ప్రాధాన్యం తక్కువేమీ కాదు. కానీ అవి సూక్ష్మ పరిమాణంలో అవసరం కనుక వీటిని సూక్ష్మ పోషకాలని పిలుస్తున్నాం. మనకు అత్యవసరమైన కర్బన సంయోగ పదార్థాలు విటమిన్లు. వీటిని మన శరీరం తయారుచేసుకోలేదు.

**పోషకాహార వారోత్సవాలు**

ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నాడని నిర్ధారించే కారకాల్లో కీలకమైంది పోషకాహారం. ఇది వ్యక్తుల ఆరోగ్యానికి, ఎదుగుదలకు, అభివృద్ధికి దోహదం చేస్తుంది. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు జాతీయ పోషకాహార వారోత్సవాలు (ఎన్ఎన్‌డబ్ల్యు) నిర్వహించడం మనదేశంలో ఆనవాయితీగా వస్తున్నది. భారత ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధీనంలో పనిచేసే ఆహారం, పోషకాహార బోర్డు ఈ వారోత్సవాలను నిర్వహిస్తుంది. ప్రజల్లో మంచి ఆరోగ్యం పెంపొందేందుకు, హితకరమైన ఆహారాన్ని స్వీకరించాలన్న అంశాన్ని ఎన్ఎన్‌డబ్ల్యు నొక్కి చెబుతుంది. ఆరోగ్యకరమైన ఆహారం వ్యక్తుల భౌతిక, మానసిక ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. హితకరమైన, విభిన్న రకాల ఆహారం తీసుకోవడం వల్ల జీవన నాణ్యత పెరుగుతుంది. అదే తగిన పోషకాలు లేని ఆహారం అనారోగ్యానికి, వ్యాధిగ్రస్తతకు దోహదం చేస్తుంది. జాతీయ పోషకాహార వారోత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రభుత్వ సంస్థలు సెమినార్లు, ప్రచార కార్యక్రమాలు, రోడ్‌షోల ద్వారా ప్రజల్లో పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల్లో పోషకాహార అలవాట్లను పెంపొందింపజేయడమే ఎన్ఎన్‌డబ్ల్యు ప్రధాన లక్ష్యం.

**పోషణ్ అభియాన్**

2018-22 వరకు ప్రభుత్వం అమలుచేస్తున్న పోషణ్ అభియాన్ కింద తక్కువ బరువుతో జన్మించే, పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల సంఖ్యను 2 శాతానికి తగ్గించడానికి, అదేవిధంగా రక్తహీనతతో బాధపడుతున్న అన్ని వయసుల పిల్లల సంఖ్యను 3 శాతానికి తగ్గించడానికి కృషి జరుగుతోంది. ఇటువంటి పిల్లలు తేలిగ్గా ఇన్ఫెక్షన్లకు, వ్యాధులకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. ఇటువంటి వారు మరణాలకు గురవుతారు. ఈ సమస్య నుంచి బయటపడాలంటే దేశం యావత్తూ పోషకాహారం ద్వారా సంపూర్ణ స్వాస్థంతో మెలగాలి. ఈ పోషణ్ అభియాన్ కింద చేపట్టే ప్రధాన కార్యక్రమం 'జన్ ఆందోళన్'. సెప్టెంబర్ నెలలో చేపట్టే ఈ కార్యక్రమం సోషల్ డ్రైవ్‌ను సృష్టించేందుకు దోహదం చేస్తుంది. సామాజిక ప్రవర్తన, కమ్యూనికేషన్‌లో మార్పు, అత్యవసర పోషకాహార ప్రమేయాలపై మరింత చైతన్యం కలగజేసేందుకు జనసమీకరణ వంటివి 'జన్ ఆందోళన్' కింద చేపట్టే కార్యక్రమాలు. నవజాత శిశువులకు తొలి రెండేళ్ల కాలం తగినన్ని పోషకాలు తప్పనిసరిగా అందాలి. తల్లిపాలల్లో బిడ్డకు కావలసిన అన్ని పోషకాలు సమృద్ధిగా లభిస్తాయి. కాబట్టి ఈ రెండేళ్ల కాలం తల్లిపాలు అందించడం సర్వదా శ్రేయస్కరం. ఆరు నెలలు దాటిన తర్వాత పిల్లలకు అదనపు పోషకాహారాన్ని అందించాలి. వయసు పెరుగుతున్నకొద్దీ పోషకాహారం విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించవచ్చు. కాగా ఈ పోషణ్ అభియాన్‌కు తోడు నీతి ఆయోగ్ 'కుపోషన్ ముక్త్ భారత్'ను 2022 చివరి నాటికి సాధించాలని లక్ష్యంగా నిర్దేశించింది. అయితే ప్రస్తుతం పిల్లల్లో కొనసాగుతున్న ఎదుగుదల లోపాలను అనుకున్నదానికంటే రెట్టింపు స్థాయిలో తగ్గిస్తేనే ఈ లక్ష్యాన్ని సాధించడం సాధ్యం. ముఖ్యంగా వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించకపోవడం, సమాచార నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి సమస్యలు లక్ష్యసాధనకు ప్రధాన అవరోధంగా ఉన్నాయి. ఇప్పటికీ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ పథకం కింద కేంద్రం కేటాయించిన నిధుల్లో కేవలం 16% మాత్రమే వినియోగించాయంటే అమలులో నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉన్నదీ అర్థమవుతుంది. నిజానికి పోషణ్ అభియాన్‌ను అమలుపరచేది క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు. పోషకాహారం విషయంలో అట్టడుగునున్న బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో పనిచేసే అంగన్‌వాడీల సంఖ్య చాలా తక్కువ. వీటిల్లో సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు. పోషకాహార లోపంతో బాధపడే ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టకపోవడం మరో ప్రధాన లోపం. ఉదాహరణకు వయసుకు తగిన బరువు లేని పిల్లలు అధికంగా ఉన్న రాష్ట్రాలు జార్ఖండ్, బిహార్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర. ఈ రాష్ట్రాలపై ఎక్కువ దృష్టిపెట్టాలి.

**జాతీయ పోషకాహార వారోత్సవాల చరిత్ర**

1975లో అమెరికన్ డయేటిక్ అసోసియేషన్ (ఏడీఏ) ఈ పోషకాహార వారోత్సవాలను మార్చి నెలలో ప్రారంభించింది. ఏడీఏను ప్రస్తుతం



> అతిపోషకాహారం అంటే మన శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం. ఎవరైనా తన శరీరానికి అవసరమైన దాని కంటే ఎక్కువ కేలరీలు తీసుకున్నట్లయితే అది కూడా పోషకాహార లోపానికి దారితీస్తుంది. అంటే పండ్లు, కూరగాయలు, ప్రొటీన్లు, ధాన్యం మొదలైనవి తీసుకోకపోవడం వల్ల కలిగే స్థితి ఇది. విటమిన్లు, ఖనిజలవణాలు వారు తీసుకునే ఆహారంలో తక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

అకాడమీ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ డయేటిక్స్ అని పిలుస్తున్నారు. ప్రజల్లో పోషకాహారంపై చైతన్యం కలిగించడం మాత్రమే కాదు, డయేటియన్స్ వృత్తికి కూడా తగిన ప్రోత్సాహం కల్పించడం దీని ప్రధాన లక్ష్యం.

1980లో పోషకాహారంపై నిర్వహించిన వారోత్సవాలకు ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో, అప్పటి నుంచి ఏటా నెలరోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇక మనదేశం విషయానికి వస్తే 1982 నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు జరుగుతున్నాయి. అప్పటినుంచే భారత ప్రభుత్వం ప్రజల్లో పోషకాహార ప్రాధాన్యంపై విస్తృత ప్రచారం ప్రారంభించింది.

**పోషకాహార లోపం అంటే?**

పోషకాలు అసమతుల్యంగా ఉన్న స్థితినే పోషకాహార లోపం అంటాం. అంతేకాని తక్కువ పోషకాలు లేదా ఎక్కువ పోషకాలుండటం అనేది పోషకాహార లోపం కాదు. తగినన్ని కేలరీలు, ప్రొటీన్లు లేదా ఇతర పోషకాలు కలిగిన ఆహారాన్ని తినకపోవడం వల్ల పోషకాహార లోపం కలుగుతుంది. అదేవిధంగా అతిపోషకాహారం అంటే మన శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకోవడం. ఎవరైనా తన శరీరానికి అవసరమైన దాని కంటే ఎక్కువ కేలరీలు తీసుకున్నట్లయితే అది కూడా పోషకాహార లోపానికి దారితీస్తుంది. అంటే పండ్లు, కూరగాయలు, ప్రొటీన్లు, ధాన్యం మొదలైనవి తీసుకోకపోవడం వల్ల కలిగే స్థితి ఇది. విటమిన్లు, ఖనిజ లవణాలు వారు తీసుకునే ఆహారంలో తక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

ముఖ్యంగా చిన్నపిల్లల్లో పెరుగుదల ఆగిపోవడం, ప్రతి రక్షక వ్యవస్థ బలహీనం కావడం వల్ల తరచుగా అనారోగ్యానికి గురికావడం వంటివి జరుగుతుంటాయి. ఎప్పటికప్పుడు పోషకాహార లోపాన్ని గుర్తిస్తూ తగిన చర్యలు తీసుకోవాలి.

**పరిష్కారమేంటి?**

ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సెక్యూరిటీ అనాలసిస్ ఇండియా–2019 పోషకాహార లోపాన్ని పరిష్కరించేందుకు కొన్ని సూచనలు చేసింది. పంటమార్పిడులు పాటించే రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, తక్కువ ఖర్చుతో పంటలు పండించే సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, తమ ప్రాంతంలోని భూమిని సక్రమంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించడం ద్వారా సుస్థిర పంట ఉత్పత్తుల అభివృద్ధి సాధించడం, కోతల అనంతర నష్టాల నివారణలో భాగంగా నిల్వల సామర్థ్యాన్ని పెంచడం, చిన్నపిల్లలకు ఆహారాన్ని అందించే అలవాట్లలో మార్పులు, ఆకలి, అన్ని రకాల పోషకాహార లోపాలను నివారించాలన్న సుస్థిరాభివృద్ధి లక్ష్యం–2ను సాధించడానికి మరిన్ని చర్యలు తీసుకోవడం. వీటిని అనుసరించడం ద్వారా పోషకాహార లోపాలను సమర్థవంతంగా అరికట్టవచ్చు.



**పిల్లలకు అనుబంధ ఆహారం ఇవ్వడంలో సూచనలు**

– రెండేళ్ల వరకు పిల్లలకు తల్లి పాలు తప్పనిసరిగా ఇస్తుండాలి.

– పిల్లలకు నిదానంగా, సహనంతో ఆహారం అందించాలి. వారిని తినడానికి ప్రోత్సహించాలి తప్ప, ఒత్తిడి తీసుకురాకూడదు. ఆరోగ్యకరమైన రీతిలో ఆహారం అందించే పద్ధతులను పాటించాలి.

– మొదట చిన్న పరిమాణంలో ఆహారాన్ని అందిస్తూ, వారి వయసు పెరిగే కొద్దీ ఈ పరిమాణాన్ని పెంచుకుంటూ పోవాలి. క్రమంగా ఆహారంలో మార్పులు తీసుకొనిరావాలి. శిశువుల వయస్సును బట్టి ఆహారాన్ని అందించాలి. 6–8 నెలల వయస్సున్న పిల్లలకు రోజుకు రెండు లేదా మూడుసార్లు భోజనం అందించాలి, 9–23 నెలల మధ్య వయస్కులైన పిల్లలకు 3–4సార్లు ఆహారాన్ని అందిస్తూ అవసరమైతే ఒకటి లేదా రెండుసార్లు స్నాక్స్ ఇవ్వాలి.

– అనారోగ్యంగా ఉన్నప్పుడు తగిన రీతిలో బలమైన అనుబంధ ఆహారాన్ని ఎంపికచేసి అందించాలి. ద్రవాహారాన్ని అందిస్తూ, శిశువులకు తల్లి పాలను కొనసాగించాలి. తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారాన్ని అందించాలి.

**ఈ అలవాట్లను కొనసాగించాలి!**

– పిల్లలకు భోజనం తర్వాత తాజా పండ్లను ఇవ్వాలి. ఫ్రిడ్జ్‌లో జంక్ ఫుడ్ కాకుండా, పోషకాలతో కూడిన ఆహారాన్ని ఉంచాలి.

– అన్ని రకాల కూరగాయలు, పండ్లు పిల్లలకు రుచి చూపాలి.

– ఆహార తయారీలో పిల్లలను కూడా భాగస్వాములను చేయాలి. అందువల్ల వారు భోజనాన్ని మరింత ఆస్వాదించగలుగుతారు.

– అన్నం తినేటప్పుడు టీవీని కట్టేయండి. అప్పుడు పిల్లలు తినడంపై ఎక్కువ దృష్టిపెట్టి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోగలుగుతారు. ★



క్రీడా కృష్ణ, 84668 64969



ప్రజ్ఞానంద్

# గురువును మించిన శిష్యుడు

మేధోక్రీడ చదరంగంలో విశ్వనాథన్ ఆనంద్ ప్రియశిష్యుడు ప్రజ్ఞానంద్ సంచలన విజయాలతో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. వయసుకు మించిన ప్రతిభతో వారేవ్వా! అనిపించుకుంటున్నాడు. సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌కు తానే తగిన వారసుడనని చాటి చెబుతున్నాడు. చదరంగంలో ఐదుసార్లు విశ్వవిజేత విశ్వనాథన్ ఆనంద్‌ది ఓ ప్రత్యేక చరిత్ర. అనతోలీ కార్పోవ్, గారీ కాస్పరోవ్, గెల్ఫాండ్ లాంటి ఎందరో గొప్ప గొప్ప సూపర్ గ్రాండ్ మాస్టర్ల ఆటకట్టించిన ఆనంద్.. ప్రస్తుత ప్రపంచ విజేత మాగ్నస్ కార్ల్‌సన్‌తో పోరులో విజేత కాలేకపోయాడు. అయితే, ఆనంద్ శిష్యుడు, భారత బాల గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద్ ఆ లోటును పూడ్చాడు. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా మూడు వేర్వేరు గేమ్‌ల్లో కార్లసన్‌పై సంచలన విజయాలు సాధించడం ద్వారా ప్రజ్ఞానంద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు.

చదరంగ క్రీడలో గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించాలంటే తల పండిపోవాలి అనుకొనే రోజులు పోయాయి. వయసుకు, గ్రాండ్‌మాస్టర్ హోదాకు ఏమాత్రం సంబంధం లేదని ఈ బాలమేధావి ప్రజ్ఞానంద్ నిరూపించాడు. తెలివితేటలు, సమయస్ఫూర్తి, ఎత్తులు, పై ఎత్తులతో సాగే ఈ ఆటలో గ్రాండ్ మాస్టర్ హోదా సాధించడం ఓ పెద్ద పరీక్షే. ఐదేళ్ల వయసు నుంచే చదరంగం ఆడుతూ ఎన్నో సంచలన విజయాలు సాధించిన విశ్వనాథన్ ఆనంద్ లాంటి ఆటగాడే.. 18 ఏళ్ల వయసులో ఆ హోదా సాధించలేకపోయాడు. అలాంటి ఘనతను తమిళనాడు చిచ్చరపిడుగు ప్రజ్ఞానంద కేవలం 12 సంవత్సరాల వయసులోనే సాధించి తన పేరును సార్థకం చేసుకున్నాడు. 12 సంవత్సరాల, 10 నెలల, 14 రోజుల వయసులో మూడో గ్రాండ్ మాస్టర్ నార్మ్ సాధించడం ద్వారా ప్రజ్ఞానంద ప్రపంచ చెస్ చరిత్రలోనే రెండో అతిపిన్న వయస్కుడైన గ్రాండ్ మాస్టర్‌గా రికార్డుల్లో చోటు సంపాదించాడు. భారత చెస్ ఎవర్‌గ్రీన్ స్టార్ విశ్వనాథన్ ఆనంద్ 18 ఏళ్ల వయసులో గ్రాండ్ మాస్టర్ హోదా సంపాదించి ఆ కాలంలో సంచలనం సృష్టిస్తే, ఆ తర్వాత మూడు దశాబ్దాలకు తమిళనాడుకే చెందిన ప్రజ్ఞానంద్ 12 ఏళ్ల చిరుప్రాయంలోనే ఈ ఘనత సాధించాడు.

1980 దశకంలో ప్రపంచ చదరంగంలో బాల మేధావిగా తన ప్రస్థానం మొదలుపెట్టిన ఆనంద్ సాధించిన ఘనతలు, అధిరోహించిన విజయ శిఖరాలు అన్నీ ఇన్నీ కావు. 1988లో విశ్వనాథన్ ఆనంద్ భారత చదరంగ తొలి గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన ముహూర్తబలం ఏమిటో కానీ, ఆ తర్వాతి కాలంలో 35 మందికి పైగా గ్రాండ్ మాస్టర్లు, ఎనిమిది మంది మహిళా గ్రాండ్ మాస్టర్లు, 60 మంది ఇంటర్నేషనల్ మాస్టర్లు, ఏడుగురు మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్లు తయారయ్యారు. అంతేకాదు, ప్రపంచ చదరంగంలోనే అత్యంత బలమైన పురుషుల, మహిళల జట్లు కలిగిన అతికొద్ది దేశాలలో భారత్ ఒకటిగా నిలిచింది. మహాబలిపురం వేదికగా ఇటీవలే ముగిసిన 44వ చెస్ ఒలింపియాడ్ పురుషుల విభాగంలో భారత– బీ జట్టు కాంస్య పతకం సాధించడంలో ప్రజ్ఞానంద్ ప్రధానపాత్ర వహించాడు. పురుషుల వ్యక్తిగత విభాగంలో సైతం ప్రజ్ఞానంద్ కాంస్య పతకం సాధించాడు.

## ప్రజ్ఞానంద్‌కు ఆనంద్ కితాబు

12 ఏళ్ల వయసులోనే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన ప్రజ్ఞానంద్‌ను సూపర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ప్రశంసించడమే కాదు, తమ ఇంటికి ఆహ్వానించి మరీ అభినందించాడు. జయాపజయాలతో సంబంధం లేకుండా ఆటను ఆస్వాదిస్తూ సాగిపోమని సలహా ఇచ్చాడు. ప్రత్యర్థి ఎంత పేరున్న, బలమైన ఆటగాడైనా పట్టించుకోకుండా ఆడటంలో ప్రజ్ఞానంద్ తర్వాతే ఎవరైనా అంటూ ఆనంద్ కితాబిచ్చాడు.

## అమ్మ స్ఫూర్తి, అక్క ప్రేరణ

విజయవంతమైన ప్రతి పురుషుడి వెనుక ఓ స్త్రీమూర్తి ఉన్నట్లే.. వయసుకి మించి ప్రతిభ కనబరచే చిచ్చరపిడుగుల వెనుక.. అమ్మ లేదా అక్క ఉండి తీరుతారు. అదే విషయం ప్రజ్ఞానంద విషయంలోనూ అనుభవమైంది. చెన్నై నగరంలోని ఓ మధ్య తరగతి కుటుంబానికి చెందిన ప్రజ్ఞానంద.. తన తల్లి నాగలక్ష్మి స్ఫూర్తి, అక్క వైశాలి ప్రేరణతో చురుకైన చదరంగ క్రీడాకారుడిగా రూపుదిద్దుకున్నాడు. తన ఆరాధ్యదైవం విశ్వనాథన్ ఆనంద్ ఆటతీరు, వ్యూహాలను అనుసరిస్తూ... శిక్షకుడు ఆర్బీ రమేశ్ పర్యవేక్షణలో గ్రాండ్ మాస్టర్ ఘనతను సొంతం చేసుకున్నాడు.

చిరుప్రాయానికే 2600 పాయింట్ల ఎలో రేటింగ్‌కు చేరుకొన్న ప్రజ్ఞానంద్ రానున్న రోజుల్లో మరో వంద పాయింట్లు సాధించడం ద్వారా 2700 ఎలో రేటింగ్‌తో సూపర్ గ్రాండ్ మాస్టర్ హోదా పొందాలని కోరుకుందాం.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్




# తిరుపతిలో బాలికల ఆవాసం ప్రారంభం

**తిరుపతి:** కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో ఆగస్ట్ 22న శ్రీమాతా బాలికల ఆవాసాన్ని తిరుపతిలోని రైల్వే కాలనీలో ఆర్‌ఎస్‌ఎస్ సహ క్షేత్ర ప్రచారక్ భరత్ ప్రారంభించారు. కేశవ సేవాసమితి అధ్యక్షుడు డా॥ దత్తాత్రేయ (తిరుపతి నగర సంఘచాలక్) ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విభాగ్ సంఘచాలక్ త్యాగరాజ రవీంద్రన్, జిల్లా సంఘచాలక్ ఆనందరెడ్డి, ప్రొ॥ సుందరమూర్తి జ్యోతి ప్రజ్వలన చేశారు.

దత్తాత్రేయ మాట్లాడుతూ కేశవ సేవాసమితి ఆధ్వర్యంలో బాలికల ఆవాసం ప్రారంభించడం ఆనందదాయకమైనదని అన్నారు. భరత్ మాట్లాడుతూ 'సంఘ్ దేశంలో 1,50,000 సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. స్వయంసేవకులలో సేవాభావం నింపేందుకు పరమ పూజనీయ డాక్టర్‌జీ స్వయంగా సేవాకార్యక్రమాలను కలకత్తాలో ప్రారంభించారు. ఇలాంటి ఆవాసాలు ఆంధ్రప్రదేశ్‌లో బాలుర కోసం 9 ఉన్నాయి. కానీ బాలికలకి మన రాష్ట్రంలో ఇదే మొదటి ఆవాసం. ఈ ఆవాసం విద్యార్థుల్లో చదువుతో పాటు సంస్కారం, సేవాభావాలు, ధైర్య సాహసాలు పెంపొందించేందుకు కృషిచేయాలి. బాలికలు వారి కాళ్లమీద వారు నిలదొక్కుకునే వరకు మనమందరం వారి వెనుక ఉండి ఎదుగుదలకు సహాయ సహకారాలు అందించి వారిలో చిరునవ్వులు చూడాలి. ఇలాంటి ఆవాసాలు ఏర్పాటుచేయడం మాత్రమే ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశం కాదు, సమాజంలోని ప్రతిఒక్కరిలో సేవాస్ఫూర్తిని నింపి ప్రతి ఇల్లు, ప్రతి హృదయం ఒక ఆవాసంగా మలచడమే సంఘ్ ఉద్దేశం.' అన్నారు.

కార్యక్రమంలో ప్రాంత సేవా ప్రముఖ్ కేశవయ్య, ప్రాంత ధర్మజాగరణ ప్రముఖ్ కొండారెడ్డి, విభాగ్ ప్రచారక్ మల్లికార్జున, సహ విభాగ్ ప్రచారక్ లోవారెడ్డి, జిల్లా కార్యవాహ మహేష్, స్వయం సేవకులు కుటుంబాలతో కలిసి 220 మంది పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో శ్రీమాతా బాలికల ఆవాసం నిర్వహణ కమిటీని విభాగ్ సంఘచాలక్ రవి నిర్వహించారు. అధ్యక్షుడు డా॥ మార్తా భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడు గణపతిసింగ్ రాజ్ పురోహిత్, ఉపాధ్యక్షుడు డా॥ రవిశంకర్, కార్యదర్శి కేవీ వెంకటాచలం, సహ కార్యదర్శి అరగొండ సోమశేఖర్, సహ కార్యదర్శి సుధామయి, కోశాధికారి పురుషోత్తం పటేల్, సభ్యులు రాజేంద్రశెట్టి, డా॥ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుతం ఈ ఆవాసం ఇద్దరు బాలికలతో ప్రారంభమైంది. ఈ సంవత్సరం 20 మంది బాలికలకు వసతి అవకాశం ఉంది. తల్లి కానీ తండ్రి కాని లేని బాలికలకు, ఎవరూ లేని బాలికలకు అవకాశం కల్పిస్తారు.

**వివరాలకు 9346352977, 9652200820 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.** ★





## హన్మకొండలో జాతీయ సాహిత్య విక్రయం

**వరంగల్ :** ఆజాదీ కా అమృతోత్సవాలలో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార విభాగ్ – వరంగల్ ఆధ్వర్యంలో ఆగస్ట్ 28న హన్మకొండ చౌరస్తాలో దేశభక్తి ప్రపూరిత సాహిత్యం విక్రయించారు.

సేవికా సమితి ఆధ్వర్యంలో...

# ఘనంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్





భాగ్యనగరం: ఆబాల గోపాలానికి బాధ్యతలు నేర్పించడం, సత్యవ్రతం చేయించడాన్ని ప్రతి భారతీయ స్త్రీ తన కర్తవ్యంగా చేసుకోవాలని, తద్వారా పెంపొందిన ఏకాత్మత భావనతో విశ్వజననికి వైభవంగా మంగళహారతులు ఇద్దామని రాష్ట్ర సేవికా సమితి ఉద్ఘాటించింది.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలను రాష్ట్ర సేవికా సమితి భాగ్యనగర్, సికింద్రాబాద్ విభాగ్‌లు భాగ్యనగర్, నారాయణగూడలోని కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్ట్ 28 (ఆదివారం)న సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తల్లి ఒడి మొదటి బడి అని అన్నారు. ఉగ్గుపాలతో మాతృమూర్తి నేర్పిన పాఠాలతోనే తాను పాకిస్తాన్‌లో భారత పతాకాన్ని రెపరెపలాడించే స్థాయికి చేరుకున్నానని ఆమె తెలిపారు. మన మాతృమూర్తులు తమ సంతానాన్ని చిన్నతనం నుంచే ధైర్య సాహసాలతో పెంచారని, మన బాలలు దేశభక్తులై నవభారత నిర్మాణానికి పునాదులు వేశారని అన్నారు. అల్లూరి సీతారామరాజు అంబేద్కర్, కొమురం భీం, వంటి ఎందరో మహనీయులు జన్మించిన నేల మనదని అన్నారు. తన ప్రసంగం మధ్యలో సభికులతో 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేయించడం ద్వారా సభలో ఏకాత్మతా భావనను ఆమె నెలకొల్పారు.

ప్రధాన వక్తగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త 'భారతీయమ్' సత్యవతి ప్రసంగిస్తూ ప్రస్తుతం భారతీయ సమాజంలో సానుకూలమైన దృక్పథంతో కూడుకున్న దేశభక్తిని నెలకొల్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. భారతీయులంతా ఎవరికి వారు సక్రమంగా వారి బాధ్యతలను నిర్వర్తించడమే అసలైన దేశభక్తి అని ఆమె అన్నారు. భారతీయ మహిళ తాను తెరవెనుక ఉండి చేసే ప్రతి పనిలోనూ ఘనతను పురుషుడికి ఆపాదించాలని ఆకాంక్షిస్తారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో పురుషుడికి బాధ్యతలు నేర్పించడమే స్త్రీ ప్రధాన కర్తవ్యమని సత్యవతి తెలిపారు. ప్రతి మాతృమూర్తి తన కుమారుడితో సత్యవ్రతం చేయించాలని కోరారు. ఏదైనా విషయానికి సంబంధించి పురుషులు మనస్సుతో ఆలోచిస్తే, స్త్రీలు హృదయంతో స్పందిస్తారని ఆమె అన్నారు. యావత్ భారత జాతికి ఏకాత్మతా భావన కలిగించడానికి మాతృమూర్తులు ప్రతిన బూనాలని చెప్పారు.

కార్యక్రమంలో భాగంగా 75 గీతాలతో కూడిన పుస్తకం, సీడీ, రాష్ట్ర సేవికా సమితి యూట్యూబ్ చానల్‌ను అతిథులు ఆవిష్కరించారు. నాగోల్‌కు చెందిన భూపతి స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'ఉరి' నాటకం, 'వందేమాతరమ్' పేరిట వైదేహి ఆశ్రమానికి చెందిన ముగ్గురు విద్యార్థినుల నృత్య ప్రదర్శన, ఉప్పుగూడకు చెందిన సరస్వతి శిశుమందిర్ విద్యార్థినుల సామూహిక నృత్య ప్రదర్శన సభికుల్లో దేశభక్తి భావనను పెంపొందించాయి.

రాష్ట్ర సేవికా సమితి ప్రాంత కార్యవాహిక శ్రీపాద రాధ, భాగ్యనగర్ విభాగ్ కార్యవాహిక గోవర్ధనం ప్రసన్నలక్ష్మి, ప్రముఖ రచయిత ముదిగొండ శివప్రసాద్‌తో పాటు, 500 మంది సభికులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. ★




**పాఠకులకు, ఏజెంట్లకు, ప్రకటన కర్తలకు గమనిక**

జాగృతి వార పత్రికలో ప్రచురణార్థం పంపే వార్తలు ఫోటోలు, మిగతా సమాచారం **jagritiweekly@gmail.com** కు మాత్రమే పంపాలి.

జాగృతి వారపత్రిక చందాకు సంబంధించిన అన్ని వివరాలు **jagritiweeklysub@gmail.com** కు మాత్రమే పంపాలి.

జాగృతి వారపత్రికలో ప్రచురణార్థం పంపే వాణిజ్య ప్రకటనలను **jagritiweeklyadvt@gmail.com** కు మాత్రమే పంపాలి.

# బాల జాగృతి

## తెలుసుకుందాం

## ఖజ్రానా వినాయక ఆలయం- ఇందోర్



ఈ ఆలయం మధ్యప్రదేశ్‌లోని ఇందోర్‌లో కొలువుదీరింది. దీనిని 1735లో హోల్కర్ రాజవంశానికి చెందిన మహారాణి అహల్యాబాయి హోల్కర్ నిర్మించారు. ఈ ఆలయంలో ప్రదక్షిణలు చేసి, దారం కడితే కోరుకున్న కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మన దేశంలోని ఆలయాలపై దండెత్తుతున్న కాలంలో ఈ వినాయక విగ్రహాన్ని అక్కడే ఉన్న బావిలో దాచిపెట్టి రక్షించారని చెబుతారు. ఆ విగ్రహమే ఇప్పుడు ఇక్కడ పూజలందుకుంటోందని చెబుతున్నారు.

## కథ | వాగ్దానం - వాస్తవం



గౌరీపురంలో హేమంతుడు అనే ధనికుడు ఉండేవాడు. అతనికి పెద్ద భవంతి, డబ్బు, బంగారం, వస్తువులు, వాహనాలు లెక్కలేనన్ని ఉండేవి. అయితే దానధర్మాల విషయంలో మాత్రం అతను పరమ పిసినారి.

ఎవరైనా ఏదైనా సహాయం అడగటానికి వస్తే ఏవో సాకులు చెప్పి తర్వాత రమ్మనేవాడు. తర్వాత వెళితే మళ్లీ ఇంకేదో కారణం చెప్పేవాడు. అంతేగానీ పైసా కూడా ఇచ్చేవాడు కాదు. ఆ విధంగా హేమంతుడికి చెడ్డ పేరు వచ్చింది.

అదే ఊరిలో ప్రసన్నుడు అనే మరొక వ్యక్తి ఉండేవాడు. అతడు ధనవంతుడు కాకపోయినా ఉన్నంతలో ఇతరులకు తనకు తోచిన సాయం చేస్తుండేవాడు. అడిగిన వారికి లేదనకుండా తృణమో పణమో ఇస్తుండటంతో ప్రసన్నుడిని అందరూ మెచ్చుకునేవారు.

ఇది చూసి హేమంతుడికి ఈర్ష్య కలిగింది. ఒక ఉపాయం ఆలోచించాడు. 'కొంతకాలం ఆగండి. నేను నా ఆస్తి మొత్తాన్ని ఈ ఊళ్లో బడి, గుడి కట్టించడానికి, దాన ధర్మాలకు ఇచ్చేస్తాను' అని అందరినీ పిలిచి చెప్పడం ప్రారంభించాడు. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

## పద్యం

తగిలి మదంబుచే నెదిరి తన్ను నెఱుంగక దొడ్డవానితో
పగగొని పోరుటెల్ల నతిపామరుఁడై చెడు, టింతెగాకఁ?
నెగడి జయింప నేంc, డది నిక్కము, దప్పదు; ధాత్రి లోపలన్
దెగి యొక కొండతో తగరు ఢీకొని తాకిన నేమి భాస్కరా!

**భావం :** భాస్కరా! ఎదుటివాని శక్తిని, తన శక్తిని గ్రహించక గొప్పవానితో శత్రుత్వం పూని మదంతో పోరాడటం వల్ల, అవివేకియై చెడిపోవడమే గాని తాను జయింపలేడు. అది నిజం. పొట్టేలు సాహసంతో కొండను ఢీ కొంటే దాని ప్రాణం పోతుంది కదా!

## సూక్తి రత్నావళి

'అతి సర్వత్ర వర్జయేత్'

'అతి దానా ద్బలి ర్బద్ధో హ్యతిమానాత్సు యోధనః
వినష్టో రావణో లౌల్యా దతి సర్వత్ర వర్జయేత్

అతిదానం వల్ల బలిచక్రవర్తి, మితిమీరిన స్వాభిమానంతో దుర్యోధనుడును, అతి లౌల్యం వల్ల రావణాసురుడు నశించిపోయారు. కనుకు దేనియందు అతి కూడదు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఆశ్చర్యం | పసరము |
| రాత్రి | పొత్తము |
| ముఖం | అచ్చెరువు |
| పశువు | రాతిరి |
| పుస్తకం | ముగము |

జవాబులు : ఆశ్చర్యం-అచ్చెరువు; రాత్రి-రాతిరి; ముఖం-ముగము; పశువు-పసరము; పుస్తకం-పొత్తము.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### కల్లూరి చంద్రమౌళి



గాంధేయవాది. ప్రముఖ రాజకీయ నాయకుడు కూడా. ఆర్ష విద్యాలంకార బిరుదాంకితుడు. నవంబర్ 15, 1898న గుంటూరు జిల్లా, అమృతలూరు మండలం, మోపర్రులో జన్మించారు. దేవాదాయ శాఖ మంత్రిగా శ్రీశైలం, భద్రాచలం ఆలయాల జీర్ణోద్ధరణ గావించారు. ఖద్దరు ప్రచారంలో పాల్గొన్నారు. ఊరురూ తిరిగి, యువ జన సంఘాలను ఏర్పాటుచేసి వారిలో స్వతంత్ర భావాలను నాటారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జనవరి 2, 1992న మరణించారు.



ప్రసన్నుడు మాత్రం ఎప్పటిలాగానే అందరికీ సాయం చేస్తూ బడికి వెళ్లే పేదపిల్లలకు పలకలు, బలపాలు ఉచితంగా ఇవ్వసాగాడు.

అలాగే గుడికివెళ్లే భక్తులకు ఉచితంగా ప్రసాదాలు పంచిపెట్టసాగాడు.

ఒకరోజు ప్రసన్నుడికి ఊర్లో ఘనసన్మానం జరిగింది. 'నా ఆస్తిని బడికి, గుడికి ఇస్తానంటే నాకు గాక ఇతనికి సన్మానం చేస్తారా?' అని హేమంతుడు అందరినీ అడిగాడు. 'మీరు ఎప్పుడో ఇస్తానంటున్నారు. ఆయన ఇప్పుడే ఇస్తున్నారు. అదీ తేడా' అన్నారు ప్రజలు.

తన తప్పు తెలుసుకుని అప్పటినుంచి ఉదారంగా ఉండసాగాడు ప్రసన్నుడు. ★

## జనరల్ నాలెడ్జ్

1. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల ఎవరు ప్రమాణ స్వీకారం చేశారు?
2. సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) ఎక్కడుంది?
3. తెలంగాణ 'గంగ' అని ఏ నదిని పిలుస్తారు?

సమాధానాలు : 1. జస్టిస్ యు.యు. లలిత్; 2. హైదరాబాద్. 3. గోదావరి

## మెదడుకు మేత

పైనొక పలక,
కిందొక పలక, పలకల
నడుమ మెలికల గిలక

జవాబు : చింతపండు

## మంచిమాట

శాంతి నీ మనసు నుంచే పుట్టాలి. దానికోసం బయట ఎక్కడో వెతకొద్దు!



# వారఫలాలు 05-11 సెప్టెంబర్ 2022



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

విద్యార్థులకు అనుకూల ఫలితాలు. వాహనాలు, స్థలాలు కొంటారు. ఆకస్మిక ధనలాభాలు. ఆరోగ్యం కుదుటపడుతుంది. వ్యాపారులకు అధిక లాభాలు. ఉద్యోగులకు ఆశించిన మార్పులు ఉత్సాహాన్నిస్తాయి. రచయితలు, క్రీడాకారులకు శుభవర్తమానాలు. 5, 6 తేదీలలో వృథా ఖర్చులు. మానసిక అశాంతి. విష్ణు సహస్రనామం పారాయణం చేయండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

చేపట్టిన కార్యక్రమాలలో పురోగతి. దూరమైన ఆప్తులు దగ్గరకు చేరతారు. ఆశించిన లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు. రాజకీయవేత్తలకు విదేశీ పర్యటనలు ఉండవచ్చు. వైద్యులు, క్రీడాకారులకు ఆహ్వానాలు అందుతాయి. 6,7 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. ఒప్పందాలు వాయిదా. విష్ణుధ్యానం చేయండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఒక సమాచారం ఉత్సాహాన్నిస్తుంది. ఆర్థికంగా కొంత ఇతరులపై ఆధారపడతారు. కుటుంబ సభ్యులు ప్రోత్సాహం అందిస్తారు. వ్యాపారులకు పెట్టుబడుల్లో అనుకూలత. ఉద్యోగులు విధుల్లో అవాంతరాలు అధిగమిస్తారు. రచయితలు, కళాకారులకు ఊహించని అవకాశాలు. 9, 10 తేదీల్లో అనారోగ్యం. కుటుంబంలో ఒత్తిడులు. గణపతి స్తోత్రం పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

రావలసిన సొమ్ము అందుతుంది. ఆరోగ్యం గతం కంటే మెరుగు పడుతుంది. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు కోరుకున్న మార్పులు. కళాకారులకు సన్మానాలు జరుగుతాయి. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు ఉత్సాహంగా గడుస్తుంది. 10, 11 తేదీల్లో దూరప్రయాణాలు. ఖర్చులు పెరుగుతాయి. శివాష్టకం పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మీ సత్తా, సమర్థతను చాటుకుంటారు. అవసరాలకు తగినంత సొమ్ము అందుతుంది. ఆరోగ్యం మెరుగుపడి ఉపశమనం లభిస్తుంది. ఉద్యోగులు పట్టుదలతో అనుకున్న బాధ్యతలు నెరవేరుస్తారు. పారిశ్రామికవేత్తలకు చిక్కులు తొలగుతాయి. రచయితలు, క్రీడాకారుల ఆశలు నెరవేరతాయి. 6,7 తేదీల్లో ధన వ్యయం. మానసిక ఆందోళన. ఆదిత్య హృదయం పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

నిరుద్యోగుల యత్నాలు సానుకూలం. రావలసిన సొమ్ము అందుతుంది. కుటుంబ సభ్యులు మీపై గురుతర బాధ్యతలు ఉంచుతారు. ఉద్యోగులు సత్తా చాటుకుంటారు. రాజకీయవేత్తలు కొత్త పదవులు దక్కించుకుంటారు. రచయితలు, క్రీడాకారులకు శుభవార్తలు. 5,6 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. వృథా ఖర్చులు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

రాబడి విషయంలో ఒడిదుడుకులు తొలగుతాయి. ఆస్తులు కొనుగోలు చేస్తారు. మనస్సాక్షికి అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో మరింత అనుకూల వాతావరణం. 7,8 తేదీల్లో వ్యయప్రయాసలు. అనారోగ్యం. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొన్ని కార్యక్రమాలలో ప్రతిబంధకాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. అనుకున్నది ఒకటి జరిగేది మరొకటిగా ఉంటుంది. నిర్ణయాలలో నిదానం పాటించండి. తరచూ వైద్యసేవలు పొందాల్సి వస్తుంది. వ్యాపారులకు ఇబ్బందులు ఎదురు కావచ్చు. ఉద్యోగులకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడులు. 8,9 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. గణేశ్ స్తోత్రాలు పఠించండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

వాహనాలు, ఇల్లు కొనుగోలు యత్నాలు సానుకూలం. దూరప్రాంతాల నుంచి అందిన సమాచారం ఊరట కలిగిస్తుంది. ఉద్యోగులు పైస్థాయి అధికారుల మన్ననలు పొందుతారు. క్రీడాకారులు, శాస్త్రవేత్తల కృషి ఫలిస్తుంది. 10, 11 తేదీల్లో దూరప్రయాణాలు. వృథా ఖర్చులు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

అనుకున్న పనులు పూర్తిచేస్తారు. ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. రాబడి సంతృప్తినిస్తుంది. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలం. వ్యాపారులకు సంతోషదాయకంగా ఉంటుంది. ఉద్యోగులకు వివాదాలు తీరి ఊరట లభిస్తుంది. కళాకారులకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 6, 7 తేదీల్లో వృథా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. దేవీస్తుతి మంచిది.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. భూములు, వాహనాలు కొంటారు. రాబడి ఆశాజనకం. దీర్ఘకాలిక సమస్య నుంచి బయటపడతారు. ఉద్యోగులకు కొత్త హోదాలు రావొచ్చు. కళాకారులకు శుభవార్తలు. క్రీడాకారులు, పరిశోధకులు అనుకున్నది సాధిస్తారు. 10, 11 తేదీల్లో మానసిక ఆందోళన. ఆరోగ్య సమస్యలు. ఆంజనేయస్వామి దండకం పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

రాబడి ఆశాజనకమే. అనుకున్న విధంగా పనులు పూర్తిచేస్తారు. ఆస్తి వ్యవహారాలలో విజయం. గృహం కొనుగోలు యత్నాలు సఫలం. వ్యాపారులకు విస్తరణ కార్యక్రమాలు సఫలమవుతాయి. ఉద్యోగులకు అనుకోని బాధ్యతలు దక్కుతాయి. వ్యవసాయదారులకు ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. 8,9 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. బంధువిరోధాలు. దుర్గాదేవి స్తోత్రం పఠించండి. ★

# పదరసం-382

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | 3 | | 4 | ✠ | 5 |
| 6 | | ✠ | | ✠ | | ✠ | 7 | 8 | |
| 9 | | 10 | | ✠ | ✠ | 11 | | | |
| | ✠ | | ✠ | 12 | 13 | | ✠ | | ✠ |
| ✠ | 14 | | | ✠ | | ✠ | 15 | ✠ | 16 |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | | |
| 20 | | ✠ | 21 | | | | | ✠ | |
| | ✠ | 22 | | | ✠ | | ✠ | 23 | ✠ |
| 24 | | | ✠ | 25 | 26 | ✠ | 27 | | 28 |
| | ✠ | 29 | | ✠ | 30 | | | ✠ | |

**పదరసం – 382**

పేరు : ..........................................................................................

చిరునామా: ..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

## ఆధారాలు

**అడ్డం**

1. మాతృదేవోభవ, పితృదేవోభవ తర్వాత (7)
6. అటుగా ఓ మల్లబంధ విశేషం నారింజలో ఉంది (2)
7. పువ్వు (3)
9. విశ్వావసుడనే గంధర్వుని కూతురు (4)
11. పెదవి (4)
12. తండ్రి తల్లి (3)
14. ప్రణవనాదం (3)
19. పెద్ద దండకు పేరు (4)
20. గడ్డి (2)
21. తరగతిగదిలో పాఠాలు బోధించేవారు (5)
22. ఉన్నత కులస్తురాలు (3)
24. క్షురకర్మ (3)
25. ముసలితనము (2)
27. దువ్వు (3)
29. నడక (2)
30. బ్రహ్మ (3)

**నిలువు :**

1. అనుభవశాలి, నెరజాణ (3)
2. అడుగునుండి సేవ లేక పరిచర్య (3)
3. ఓ రకం మద్యం (2)
4. భూమి (3)
5. సమర్థమైన, తగిన (3)
6. జంట (3)
8. మృతి (3)
10. మోసగాడు, మాయావి (4)
11. జనని (2)
13. హాసము (2)
15. జనము (3)
16. పెన్ను (3)
17. మహాలయ పక్షమే! (5)
18. మెట్టు (4)
19. శ్రీకృష్ణుని నుండి అర్జునుడు ఇతనికి అభయమిచ్చాడు (3)
21. శిల్పి చేతిలో రాళ్లు మలిచే ఓ పనిముట్టు (2)
22. లేడి, జింక (3)
23. చంద్రుని భార్య, నక్షత్రము (2)
26. స్వర్గము (2)
27. రాయబారి (2)
28. కంటకము (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 సెప్టెంబర్ 19 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 378 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 పు | స్త | 2 కం | ✠ | 3 బి | త్తం | ✠ | 4 వ | ని | 5 త |
| ని | ✠ | 6 ర | క్క | రి | ✠ | 7 వ | రి | ✠ | రు |
| శ్రీ | ✠ | ప | ✠ | 8 బి | 9 ము | క్త | ము | ✠ | వు |
| ✠ | 10 ప | ర | 11 దా | ✠ | మ | ✠ | 12 ల్లి | 13 క | ✠ |
| 14 ము | ర | ✠ | 15 హం | 16 పీ | క్షే | 17 త్రం | ✠ | 18 ల | 19 త |
| 20 ని | దా | 21 నం | ✠ | క | ✠ | ఆ | ✠ | ✠ | ళ్లి |
| ✠ | 22 ర | ద | 23 న | ✠ | ✠ | ✠ | 24 డా | 25 బు | ✠ |
| 26 రా | ✠ | 27 న | ల్ల | ✠ | 28 సే | 29 వ | ✠ | 30 స | 31 రే |
| 32 జా | 33 గు | ✠ | 34 న | 35 ది | ✠ | 36 ల | 37 జీ | ✠ | లం |
| 38 జీ | డి | యు | ✠ | 39 శ | ని | ✠ | 40 బి | రా | గి |

**విజేతలు:** కె.నర్సింహ్మా, బి.ఇందుశేఖర్, ఎం.విజయలక్ష్మి, పి.రాజేశ్వర్‌రావు, టి.తులశమ్మ–హైదరాబాద్, సి.హెచ్.నాగేందర్‌రెడ్డి–మేడ్చల్, వి.రామలింగాచారి, ఎం.శ్రీహరిరావు–ఎలూర్, బి.పద్మ, బి.అలివేల, టి.రాజు–యాదాద్రి, పి.సతీష్–సూర్యాపేట, టి.శ్రీలక్ష్మి నాగజ్యోతి–నెల్లూరు, ఎన్.వి.ఎస్.శర్మ–కోనసీమ, టి.రాజేశ్వరమ్మ, కె.అల్లీరాణి–చిత్తూరు, ఎస్.రాజు–కర్నూలు, కె.స్వప్న–ఒంగోలు, కె.సత్యనారాయణ–విశాఖపట్నం, సి.హెచ్.దేవ లక్ష్మి–నిర్మల్, వి.భాస్కరయ్య–చెన్నై, ఎస్.కృష్ణమూర్తి–బెంగుళూరు, కె.సుందర జయరాం–భువనేశ్వర్.

**బహుమతి పొందిన విజేత: పి.సతీష్-సూర్యాపేట**

సి ని మా

అరుణ

సింహం గర్జిస్తుంది. పులి గాండ్రిస్తుంది. కానీ ఆ రెండింటికీ పుట్టిన ఈ 'లైగర్' మూలుగుతూ బాక్సాఫీస్ బరిలో ఓ మూలకెళ్లి కూర్చుంది. ఎందుకంటే దానికి నత్తి! నిజమే.. ఈ సినిమాలో హీరో విజయ్ దేవరకొండకు ఉన్న సమస్య అది. వెండితెర మీద గర్జనలు, గాండ్రిపులు చేయలేకపోయాడు. దానికి తోడు సినిమా విడుదలకు ముందు దేశవ్యాప్తంగా జరిగిన ప్రచార కార్యక్రమాలలో చిత్రబృందం మాటలు కోటలు దాటడంతో 'లైగర్'పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. చివరకు అతి సర్వత్ర వర్జయేత్ అనే నానుడిని 'లైగర్' నిజం చేసింది.

# గర్జించని, గాండ్రించని 'లైగర్'



కరీంనగర్‌కు చెందిన బాలామణి (రమ్యకృష్ణ) భర్త బలరామ్ ఎంఎంఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీ ఫైనల్స్‌లో గాయం కారణంగా కన్నుమూస్తాడు. దాంతో తన కొడుకు లైగర్ (విజయ్ దేవరకొండ)ను అయినా ఎంఎంఏ నేషనల్ ఛాంపియన్‌గా చూడాలని బాలామణి కలలు కంటుంది. వాటిని సాకారం చేసుకోవడానికి కొడుకును తీసుకుని ముంబైకు వెళుతుంది. అక్కడ చాయ్ అమ్ముకుంటూ, తన భర్తతో పాటే నేషనల్ ఛాంపియన్ పోటీలో పాల్గొని, ప్రస్తుతం ఎంఎంఏ కోచింగ్ సెంటర్ నడుపుతున్న కృష్ణ శర్మ (రోనిత్ రాయ్)ను కలుస్తుంది. లైగర్‌కు ఉచిత శిక్షణ ఇవ్వడానికి మొదట నిరాకరించినా ఆ తర్వాత అతనిలోని కసిని చూసి అంగీకరిస్తాడు. అయితే ఆవేశాన్ని తగ్గించుకోమని, అమ్మాయిల జోలికి పోయి ఫోకస్ డైవర్ట్ చేసుకోవద్దని లైగర్‌కు సలహా ఇస్తాడు. కానీ లైగర్ విషయంలో అవే జరుగుతాయి. తాన్య (అనన్య పాండే) ప్రేమలో పడి తన కెరీర్‌ను నాశనం చేసుకుంటాడు. ఆవేశం ఆపుకోలేక అనేక చోట్ల హద్దులు మీరతాడు. అలాంటి వ్యక్తి తిరిగి దారిలోకి వచ్చి తల్లి మాటలను ఆలకించి, నేషనల్ ఛాంపియన్ అవుతాడు. అయితే కథ అక్కడితో అయిపోలేదు, దేశం తరపున అంతర్జాతీయ పోటీలో పాల్గొనాలనే లక్ష్యాన్ని పెట్టుకుంటాడు? అది నెరవేరిందా? లైగర్, తాన్య తిరిగి ఒక్కటయ్యారా? అన్నది మిగతా కథ.


కథగా చెప్పుకుంటే ఉత్తేజభరితంగానే ఉంటుంది. కరీంనగర్‌కు చెందిన ఓ నత్తి కుర్రాడు తల్లి ప్రోద్బలం, ప్రోత్సాహంతో ఎంఎంఏ నేషనల్ ఛాంపియన్ కావడం, ఆ తర్వాత ఇంటర్నేషనల్ టైటిల్‌పై కన్నేయడం, అక్కడ ఊహించని విధంగా బాక్సింగ్ లెజెండ్ మైక్ టైసన్‌తో తలపడటం, హీరోయిన్‌ను రక్షించుకోవడం.. ఇది పక్కా కమర్షియల్ ఫార్ములానే! దానికి తోడు హీరోయిన్‌కు సంబంధించిన ట్విస్టులు, ఆమె అన్నయ్యతో హీరో చేసే ఫైట్స్, కాబోయే మావగారే అతన్ని కష్టాల్లో ఆదుకోవడం... భలే ఉందే అనిపిస్తుంది. కానీ దీనిని తెరకెక్కించిన విధానమే పరమ రొటీన్‌గా ఉండి బోర్ కొట్టిస్తుంది. అంతేకాదు దర్శకుడు పూరి జగన్నాథ్ ఏ ఒక్క పాత్రకూ సరైన క్యారెక్టరైజేషన్ రాసుకోలేదు.

సినిమా ప్రారంభమే హీరోకు ముంబైలో ఎదురయ్యే కష్టాలతో మొదలవుతుంది. అక్కడ అతగాడు తన హీరోయిజాన్ని చూపించడం, దాంతో లోకల్ గూండా మకరంద్ దేశ్‌పాండే బెదిరిపోయి.. 'మై బీ కరీంనగర్ వాలా హూ' అంటూ కాళ్లకు దండం పెట్టడం పరమ రొటీన్‌గా ఉంది. అలీ కామెడీ సైతం ఆకట్టుకోలేదు. అయితే ఆ పాత్రను మళ్లీ ద్వితీయార్థంలో ఓ కీలక ఘట్టంలో తెర మీదకు తీసుకొచ్చారు. సోషల్ మీడియాలో ఓవర్ నైట్ స్టార్ అయిపోవాలని తాపత్రయపడే హీరోయిన్... అందుకోసం ఆమె చేసే పిచ్చిచేష్టలు, హీరోను బుట్టలో దించడానికి చేసే వెకిలిపనులు.. ఆడియన్స్ సహనాన్ని పరీక్షించేవే. నడిరోడ్డు మీద హీరోని అవమానపర్చిన హీరోయిన్ పాత్రకు సంబంధించి క్లయిమాక్స్‌లో రివీల్ చేసే నిజం కూడా ఏమంత ఆకట్టుకోదు. ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికో, ఆనందానికో గురి చేయదు. జాగ్రత్తగా గమనిస్తే, దర్శకుడు హీరో పాత్రను కూడా సరిగా రాసుకోలేదని తెలిసిపోతుంది. ఇంటర్నేషనల్ టైటిల్ సాధించడం తన లక్ష్యం అని హీరోతో చెప్పించి, చివరకు మైక్ టైసన్‌ను మట్టికరిపించడమే టార్గెట్ అన్నట్టు చేసేశాడు. కానీ థియేటర్లలోని ఆడియన్స్‌కు మైక్ టైసన్‌తో పోరాటం ఓ కామెడీ ఫైట్‌లా అనిపించింది. పైగా 'మైక్ టైసన్ నటించిన తొలి ఏసియన్ మూవీ ఇది' అని చేసిన ప్రచారంతో ఆయన పాత్రతో హీరోకు ఫుల్ ఫ్లెడ్జ్ ఫైట్ ఉంటుందని అంతా ఊహించారు. వారి ఊహలన్నీ తల్లకిందులయ్యాయి. ఇంకా తెర మీద ఏదో వండర్ జరగబోతోందని ఆశగా ఎదురుచూస్తుంటే.. 'కోకా కోకా...' డ్యుయేట్‌ను రోలింగ్ టైటిల్స్‌లో వేసేసి శుభం పలికేశారు.


నిజానికి ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణుల ప్రయత్న లోపం ఏదీ లేదు. విజయ్ దేవరకొండ మేకోవర్ గ్రేట్‌గా ఉంది. ఎవరికి వారు బెస్ట్ అవుట్ పుట్ ఇవ్వడానికి ప్రయత్నించారు. వారి నుండి ఏం తీసుకోవాలి, ఎంత మోతాదులో తీసుకోవాలి, దానిని తెర మీద ఎలా ఉపయోగించుకోవాలన్నది దర్శకుడి నిర్ణయం. ఆ విషయంలో పూరి ఫెయిల్ అయ్యాడు. మొదటిసారి పాన్ ఇండియా మూవీ చేస్తూ, కథను వదిలేసి, ఇతర కసరత్తులు చేశాడు. ఇక ఐదేళ్లు గడిచినా 'అర్జున్ రెడ్డి' క్యారెక్టర్ లోంచి విజయ్ బయటకు రాకపోవడం మరో తప్పు. కొన్ని సమయాల్లో, కొన్ని చోట్ల యాటిట్యూడ్ వర్కౌట్ అవుతుందేమో కానీ ఇలాంటి సమయంలో కనీసం జాలి కూడా చూపించకుండా చేస్తుంది. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండాలని అందుకే పెద్దలు చెబుతుంటారు. ఒదిగి ఉంటే సక్సెస్ వస్తుందా? అని ఎదురు ప్రశ్నిస్తే ఏం చెప్పలేం. అలా ఉంటే కనీసం 'బెటర్ లక్ నెక్స్ట్ టైమ్' అని మనసారా ఆశీర్వదిస్తారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-





వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-




వెల : ₹.250/-





వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.349/-




వెల : ₹.695/-




వెల : ₹. 799/-




వెల : ₹.50/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 74 Issue : 45

